అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 14-8-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 225 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారి సింగయ పల్లి చౌరస్తాలో రోడ్డుపై బైటాయించిన ముంపు బాధితులు

గాంధీ స్మారక భవనం కూల్చివేత

బుల్డోజర్లతో తెగబడుతున్న యోగి సర్కార్

- వారణాసిలో సర్వ సేవా సంఘ్ నిర్మాణాలు నేలమట్టం
- గాంధేయవాదుల నిరసన



లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలోని రఘత్ ప్రాంతంలో గాంధీ సామాజిక సేవా సంస్థ అఖిల భారత సర్వ సేవా సంఘ్‌కు చెందిన 12 భవనాలను కూల్చివేయటం ఆందోళనకు దారి తీసింది. శనివారం 15 నుంచి 20 వరకు భవనాలను కూల్చివేసినట్టు కొన్ని మీడియా నివేదికలు వెల్లడించాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ కూల్చివేత కసరత్తు 500 మంది పోలీసుల సమక్షంలో జరిగింది. స్వాతంత్ర్య సమరయోధుడు జయప్రకాష్ నారాయణ్ సహ-స్థాపన చేసిన గాంధీ విద్యా సంస్థాన్‌ను కూడా నేలమట్టం చేయడానికి ఆరు బుల్‌డోజర్‌లు రంగంలోకి దిగినట్టు వార్తలు వెలువడ్డాయి.





ఈ కూల్చివేతకు వ్యతిరేకంగా పలువురు గాంధేయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. గాంధీ వారసత్వాన్ని నాశనం చేసే ప్రయత్నమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలు చేస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

తప్పుబట్టిన కాంగ్రెస్



కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, యూపీ ఇన్‌చార్జ్ ప్రియాంక గాంధీ వాద్రా తన ఫేస్‌బుక్ పేజీలో ఈ కూల్చివేతను "జాతి పిత మహాత్మా గాంధీ వారసత్వంపై దాడి"గా అభివర్ణించారు. కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ కూడా ఈ చర్యను ఖండించారు. బీజేపీ తన హద్దులను దాటిపోతున్న దని ఆరోపించారు. మేధా పాట్కర్, యోగేంద్ర యాదవ్, రాకేష్ టికాయత్ వంటి సామాజిక కార్యకర్తలు కూడా ఈ కూల్చివేతకు వ్యతిరేకంగా నిరసనలు చేసిన వందలాది మందిలో ఉన్నారు.

పైసలు రాలే... ప్యాకేజీ

బాధితుల ఆవేదన

- మల్లన్నసాగర్ నిర్వాసితులకు అందని సాయం
- లోకల్, నాన్ లోకలంటున్న అధికారులు
- ఓపిక నశించి రోడ్డెక్కిన ముంపు బాధితులు
- సీఎం తమ గోస వినాలని డిమాండ్

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

పైసలు రాలే.. ప్యాకేజీ ఇయ్యలే.. ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు సరిగా లేవు. అందునా లోకల్.. నాన్ లోకల్ అంటూ అధికారులు వివక్ష చూపుతున్నారంటూ మల్లన్నసాగర్ ముంపు బాధితులు రోడ్డుపై బైటాయించారు. ఆదివారం సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిలో వర్గల్ మండలం సింగయపల్లి చౌరస్తా వద్ద బాధితులు పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న ఎర్రవల్లి, సింగారం, పల్లెపహాడ్, వేముల గట్టు, తుర్క బంజారాపల్లి, కిష్టపూర్, ...11లో

నవంబర్ 2,3 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రూపు-2 పరీక్షను నవంబర్ 2,3 తేదీల్లో నిర్వహించనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్(టీఎస్‌పీస్సీ) ఆదివారం ప్రకటించింది. రెండు రోజులపాటు ఉదయం 10 గంటల నుంచి 12.30గంటలకు, మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

అయితే ఈనెల 28,29 తేదీల్లో నిర్వహించాల్సిన ఈ పరీక్షను విద్యార్థుల ఆందోళనలు, విపక్షాల డిమాండ్‌తో దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి రద్దుచేస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.

బీజేపీకి మరో షాక్



కాంగ్రెస్ గూటికి మాజీ మంత్రి చంద్రశేఖర్

- రేవంత్‌తో భేటీ
- అనంతరం హస్తం పార్టీలో చేరుతున్నట్టు వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్


రాష్ట్రంలో క్రమంగా తమ ప్రభను కోల్పోతున్న కమలం పార్టీకి మరో షాక్ తగిలింది. ఇతర పార్టీల నుంచి ఎంత వేగంగా బీజేపీలో చేరారో, అక్కడ ఇముడలేక అంతే వేగంగా తిరిగి వచ్చేస్తున్నారు. అంతర్గత కుమ్ములాటలు తట్టుకోలేకనే బయటకు వస్తున్నట్టు చెబుతున్నారు. తాజాగా అదేదారిలో బీజేపీ సీనియర్ నేత, మాజీ మంత్రి డాక్టర్ ఏ.చంద్రశేఖర్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లోని చంద్రశేఖర్ నివాసానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి వెళ్లారు. సుదీర్ఘ చర్చలనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ రేవంత్ ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌పార్టీయే ప్రత్యామ్నాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు బీజేపీ రక్షణగా ఉంటున్నదని విమర్శించారు. బీజేపీ విధానాలు నచ్చకనే ఆ పార్టీకి రాజీనామా చేసినట్టు స్పష్టం చేశారు. అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను మార్చటంతోనే బీజేపీ పని అయిపోయిందన్నారు. కారు, కమలం ఒక్కటేనన్న చర్చ గ్రామస్థాయిలో జరుగుతున్నదని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో బీజేపీ మూడో స్థానంలో ఉందన్నారు. కేసీఆర్ సర్కార్‌పై అవినీతి ఆరోపణలు వస్తున్నా...బీజేపీ పెద్దలు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి వచ్చాక సంతృప్తిగా ఉన్నాడో, లేదో బండి సంజయ్‌కే తెలియాలన్నారు. 2021 జనవరి 18న బీజేపీలో చేరిన ఆయన పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డికి శనివారం రాత్రి లేఖ పంపిన విషయం తెలిసిందే.

మన టార్గెట్ వంద సీట్లు

- గ్రామ, గ్రామాన తిరగండి...ప్రతీ తలుపు తట్టండి : పార్టీ శ్రేణులకు రేవంత్ పిలుపు
- కాంగ్రెస్‌లో చేరిన పలువురు కార్యకర్తలు

వివరాలు 11లో..





చట్టాల్లో మార్పులు ప్రమాదకరం

మతోన్మాద భావజాలంతో యువతను తప్పుతోవ పట్టిస్తున్న బీజేపీ

- ప్రశ్నించేవారి గొంతు నొక్కుతున్నారు : సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాద్

గుంటూరు: దేశంలో దాదాపు 70 ఏండ్ల తరువాత కీలకమైన ఐపీసీ, సీఆర్‌పీసీ చట్టాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న మార్పులు ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత ప్రమాదకరమని సామాజిక కార్యకర్త, ప్రముఖ న్యాయవాది తీస్తా సెతల్వాద్ అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) ఏపీ రాష్ట్ర మహాసభల సందర్భంగా గుంటూరులో ప్రజాస్వామ్యం పరిరక్షణ, రాజ్యాంగరక్షణ అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆమె మాట్లాడారు. సభకు ఐలూ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. తీస్తా తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ రాజ్యాంగం రూపకల్పనలో అన్ని తరగతుల అభిప్రాయాలకు ప్రాతినిధ్యం లభించిందని, అందుకే అప్పట్లో సమానత్వానికి ప్రాధాన్యం వచ్చిందన్నారు. ఇప్పుడు రూపొందిస్తున్న చట్టాలు, చట్టసవరణలు అన్నీ ఏకపక్షంగా జరుగుతున్నాయన్నారు. ఎన్డీఏ హయంలో పార్లమెంటులోనే రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతుందన్నారు. వామపక్షాల మద్దతుతో కొనసాగిన యూపీఏ ప్రభుత్వంలో సామాన్య ప్రజలకు సంబంధించిన ఎన్నో మెరుగైన చట్టాలు వచ్చాయన్నారు. ఎన్డీఏ హయంలో ప్రతి చట్టంలోనూ ప్రజల మధ్య విద్వేషాలు పెంచడం, అధికారం కేంద్రీకరణ, ప్రశ్నించే తత్వాన్ని నియంత్రించేలా వ్యవహరించడం పరిపాటిగా మారిందన్నారు. తాజాగా ఐపీసీ, సీఆర్‌పీసీ చట్టాల్లో మార్పులు భవిష్యత్తు తరాల స్వేచ్ఛను హరించే విధంగా ఉన్నాయన్నారు. ప్రధానంగా వివిధ కేసుల్లో పోలీసు కస్టడీని 15 రోజులకు మించకుండా ప్రస్తుత చట్టాలు ఉండగా, కొత్తచట్టాల్లో 15 రోజుల నుంచి 45 రోజులకు, తరువాత 90రోజులకు పెంచుకునే వెసులుబాటు ఉండటం వల్ల పోలీసు రాజ్యం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందువల్ల రాజకీయంగా కక్ష సాధించేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. గతంలో రచయితలు, కవులుకూడా తమ కవితలు, రాతల ద్వారా ప్రశ్నించే తత్వాన్ని ప్రజలకు నేర్పించారని గుర్తు చేశారు. గత తొమ్మిదేండ్ల కాలంలో ప్రశ్నించడమే నేరంగా భావించి వేధిస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యానికి ఇది మంచిది కాదన్నారు. దేశంలో నెలకొన్న విచ్ఛిన్నకర పరిస్థితులపై మేథావులు, న్యాయవాదులు, కవులు, సాహితీవేత్తలు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ పార్టీలకు ఎలక్ట్రోరల్ బాండ్స్‌ను ప్రవేశపెట్టిన ఎన్‌డిఏ ప్రభుత్వం కార్పొరేట్లనుంచి అత్యధిక విరాళాలు తీసుకుని వీటిని మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ఉపయోగించుకుంటుందన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి కె.జి.శంకర్ మాట్లాడుతూ గుజరాత్ హైకోర్టులో రాహుల్‌గాంధీకి బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ జడ్జి చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయన్నారు. పరువు నష్టం కేసుల్లో గరిష్ఠ శిక్షా కాలాన్ని అమలు చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ఉటంకించారు. ఏపీ మండలి ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, మాజీ మంత్రులు డొక్కా మాణిక్య వర ప్రసాద్, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఐలూ అఖిల భారత కార్యదర్శి, సుప్రీంకోర్టు న్యాయవాది సురేంద్రనాథ్, ఐలూ రాష్ట్ర అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్, జేకేసీ న్యాయకళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, ఐలూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కె.పార్థసారధి, సమాచార చట్టం కార్యకర్త పట్నాయక్, ప్రొఫెసర్ ఎన్.రంగయ్య తదితరులు ప్రసంగించారు.

> **37శాతం ఓట్లతో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం తాము ఏం చేసినా చెల్లుతుందనే నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోంది. ఎన్నికల కమిషన్ నియామకంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థానాన్ని తొలగించడం కూడా ఇందులో భాగమే. దేశంలో లౌకికతత్వానికి ప్రమాదం పొంచి ఉంది. రాజ్యాంగాన్ని మతపరమైన రాజ్యాంగంగా మార్చడానికి బీజేపీ అనేక చట్టాలను తీసుకువస్తోంది. మతపరమైన భావజాలంతో 18 నుంచి 35 ఏండ్ల లోపు యువతను బీజేపీ తన వైపునకు తిప్పుకోవడానికి ఎన్నో కుయుక్తులు పన్నుతోంది. పార్లమెంటులో 52 శాతం మంది ధనికులు ఎంపీలుగా ఉన్నారు. 2040 నాటికి ఈసంఖ్య 80 శాతంకు పెరుగుతుంది. అప్పటికి పేదల గురించి, అభాగ్యుల గురించి చర్చించేవారే లేకుండా పోతారు.**
> - తీస్తా సెతల్వాద్

24గంటల్లో 18మంది మృతి...

థానే సర్కారు దవాఖానాలో మరణమృదంగం

- బాధిత కుటుంబీకుల ఆందోళన..భారీగా పోలీసుల మొహరింపు



థానే: మహారాష్ట్రలోని థానేలో సర్కారు దవాఖానాలో మరణమృదంగం మోగింది. ఒక్కరోజే భారీ సంఖ్యలో రోగులు మృతిచెందిన ఘటన ఒక్కసారిగా కలకలం రేపింది. కల్వాలో ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆస్పత్రిలో 24గంటల వ్యవధిలో 18మంది చనిపోయారని పురపాలక శాఖ కమిషనర్ అభిజిత్ బంగార్ వెల్లడించారు. వీరిలో 10 మంది మహిళలు ఉండగా.. ఎనిమిది మంది పురుషులు ఉన్నట్టు తెలిపారు. చనిపోయిన వారిలో థానే నగరానికి చెందినవారు ఆరుగురు ఉండగా.. ముంబయిలోని ...11లో

దేశంలో ఆరోగ్యవ్యవస్థ నిర్వీర్యం

కేంద్రంలోని దోపిడీ సర్కార్ వల్లే వైద్యానికి అనారోగ్యం

- సాగనంపే రోజులు దగ్గరపడ్డాయి..కాంగ్రెస్ చీఫ్ ఖర్గే



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మరోసారి ఘాటుగా విమర్శలు చేశారు. నరేంద్రమోడీ సర్కారు దేశ ఆరోగ్య వ్యవస్థను నిర్వీర్యం చేసిందని ట్విటర్‌లో మండిపడ్డారు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో వైద్యులు, సిబ్బంది కొరత ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏమీ పట్టించుకోవట్లేదని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ప్రజలు వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఉన్న 19 ఎయిమ్స్‌లలో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. కేంద్రంలోని దోపిడీ సర్కార్ దేశ ఆరోగ్య వ్యవస్థను ...11లో

ఎన్సీఆర్టీ కమిటీలో ఆర్ఎస్ఎస్ సభ్యునికి చోటు


- పాఠ్యపుస్తకాల ప్రణాళిక ఖరారుకు నూతన కమిటీ



న్యూఢిల్లీ : 3-12 తరగతుల విద్యార్థుల కోసం పాఠ్య పుస్తకాలు, పాఠ్య ప్రణాళికలను ఖరారు చేసేందుకు ఎన్సీఈఆర్టీ 19 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది.ఆర్ఎస్ఎస్ ...11లో

స్పోర్ట్స్ స్కూల్‌లో లైంగిక వేధింపులు

- ఓఎస్‌డి హరికృష్ణ సస్పెండ్
- ఎమ్మెల్సీ కవిత ట్వీట్
- స్పందించిన మంత్రి శ్రీనివాస్ గౌడ్
- క్రీడారంగంలో కలకలం



వివరాలు 12లో..

వెట్టి చాకిరీ...

పర్మినెంట్‌కు నోచుకోని రెండో ఏఎన్ఎంలు

- 15-20 ఏండ్ల కాంట్రాక్టు సర్వీస్
- డీఎస్సీ ద్వారా మెరిట్ ఆధారంగా నియామకం
- ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో 36 రకాల రిజిస్టర్ల నమోదు
- కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలు
- తాజా నోటిఫికేషన్‌తో ఇంటికి పంపే కుట్ర
- యథావిధిగా పర్మినెంట్ చేయాలని 16 నుంచి సమ్మె

> **'తెలంగాణ ఏర్పడితే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానమనేదే ఉండదు. అందరూ ప్రభుత్వ ఉద్యోగులవుతారు. ప్రస్తుతం ఆ పద్ధతిలో పనిచేస్తున్న వారందర్నీ రెగ్యులర్ చేస్తాం' అని ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమ కాలంలో చెప్పారు. తెలంగాణ ఏర్పడి పదేండ్లు కావస్తున్నా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు సర్వీస్‌లో 15-20 ఏండ్లు ఉన్న మమ్ముల్ని ఎందుకు పర్మినెంట్ చేయట్లేదని రెండో ఏఎన్ఎంలు ప్రశ్నిస్తున్నారు. తాజాగా నియామకాల నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం ఈ రెండో ఏఎన్ఎంలను ఇంటికి పంపేందుకు కుట్ర చేస్తోంది. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలందించిన తమను నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండానే పర్మినెంట్ చేయాలని రెండో ఏఎన్ఎంలు కోరుతున్నారు.**



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో రెండో ఏఎన్ఎంలను కాంట్రాక్టు పద్ధతిలో నియమించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, కమ్యూనిటీ ఆస్పత్రులు, జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో పనిచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల మంది రెండో ఏఎన్ఎంలున్నారు. సిద్దిపేట జిల్లాలో 130 మంది, సంగారెడ్డిలో 95 మంది, మెదక్‌లో 119 మంది కలిపి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 344 మంది పనిచేస్తున్నారు.

పని ఎక్కువ..జీతం తక్కువ

రెండో ఏఎన్ఎంలకు పని ఎక్కువ.. జీతం తక్కువగా ఉంది. 36 రకాల రిజిస్టర్లను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో నమోదు చేయాలి. డయేరియా, మలేరియా, ...11లో

మా గ్రామంలోకి రావద్దు

- ముస్లింలకు హర్యానా గ్రామ పంచాయితీల హుకుం
- విమర్శల వెల్లువతో సర్పంచ్‌లకు అధికారుల నోటీసులు

వివరాలు 5లో..

నవతెలంగాణ

పాత పెన్షన్ అమలు చేయాలి : టీఎస్ఈఈఎఫ్ డిమాండ్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర విద్యుత్ సంస్థలు సహా ప్రభుత్వరంగంలో 1999 తర్వాత నియమితులైన ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫోరం (టీఎస్ఈఈఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫోరం నాయకులు శ్రీనివాస్, సురేష్‌బాబు పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ అంశంపై శనివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన పాత పెన్షన్ సాధన సాకార సభలో పాల్గొని, టీఎస్‌సీపీఎస్‌ఈయూ అధ్యక్షులు స్థితప్రజ్ఞను కలిసి సంఘీభావం తెలిపామన్నారు. వారి ఆందోళనకు సంపూర్ణ మద్దతు ప్రకటించినట్టు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఫోరమ్ తరపున విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 1999 తరువాత నియమితులైన ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతున్న విషయాన్ని ఈ సందర్భంగా వారితో చర్చించామన్నారు. ఇటీవల రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాలు నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నాయని గుర్తుచేశారు. తెలంగాణ లోను అదేవిధంగా అమలు చేయాలని గత పదిహేను సంవత్సరాలుగా టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తున్నామనీ, న్యాయమైన తమ కోరికను తెలంగాణ ప్రభుత్వం తప్పని సరిగా నెరవేరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు

అక్బరుద్దీన్‌కు కృతజ్ఞతలు

- ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని శాసనసభా సమావేశాల్లో ప్రభుత్వాన్ని కోరినందుకు ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసీకి తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు ఆదివారం జేఏసీ వర్కింగ్ చైర్మెన్ డాక్టర్ ఎం.రామేశ్వరరావు, చైర్మెన్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్ నేతృత్వంలో ప్రతినిధులు అక్బరుద్దీన్ ఓవైసీని కలిశారు. తమ రెగ్యులరైజేషన్ జరిగేంత వరకు ఇదే విధమైన కృషిని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.



ఎయిర్‌పోర్టులో 931 గ్రాముల బంగారం పట్టివేత

నవతెలంగాణ-శంషాబాద్

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో విదేశాల నుంచి అక్రమ బంగారం తరలింపు ఆగడం లేదు. తాజాగా ఆదివారం మళ్లీ బంగారం పట్టుబడింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రియాద్ నుంచి ఇద్దరు ప్రయాణికులు షేక్ ఖాజా రెహమతుల్లా, షేక్ జానీభాష ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. వారు బంగారాన్ని రహస్యంగా డ్రై ఫ్రూట్స్ ప్యాకెట్లలో దాచుకొని తరలిస్తుండగా కస్టమ్స్ అధికారులు గుర్తించారు. సుమారు రూ.60 లక్షల విలువచేసే 24 క్యారెట్ల విలువైన 931 గ్రాముల బంగారాన్ని పట్టుకున్నారు. బంగారాన్ని స్వాధీనం చేసుకొని నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. శనివారం ఎనిమిది కిలోల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు పట్టుకున్న విషయం విదితమే. ఒక్క రోజు వ్యవధిలోనే మరో కిలో బంగారం పట్టుబడటం గమనార్హం.

కాపుల సంక్షేమానికి బీఆర్ఎస్ పెద్ద పీట


- నగరం నడిబొడ్డున 6.87 ఎకరాల భూమి కేటాయింపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలగ, బలిజ, కాపు, ఒంటరి తదితర అనుబంధ కులాల సంక్షేమానికి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పెద్దపీట వేస్తుందని ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తోట చంద్రశేఖర్ అన్నారు. సౌత్ ఇండియా సెంటర్ ఫర్ కాపు కమ్యూనిటీ భవన్ కోసం తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు 6.87ఎకరాల భూమిని జీఓ నెంబర్ 87 ద్వారా కేటాయించిన విషయం తెలిసిందే. దీనికోసం చొరవ చూపిన తోట చంద్రశేఖర్‌ను యాళ్ళ వరప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ కాపు సంఘాల నాయకులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతంలో కాపు అనుబంధ కులాల వారు దశాబ్దాలుగా తీవ్ర అన్యాయానికి గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలు కాపులను ఓటు బ్యాంకుగా వాడుకుంటూ రాజకీయ లబ్ది పొందుతున్నాయని విమర్శించారు.

ఉపకారవేతనాలు ఎక్కువిస్తున్న రాష్ట్రం తెలంగాణ

మంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వైద్య విద్యార్థులకు ఉపకారవేతనాలు ఎక్కువగా ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ అని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీ విద్యార్థులకు రాష్ట్రంలో రూ.58 వేలు ఇస్తుంటే, కేరళలో రూ.55 వేలు, ఆంధ్రప్రదేశ్‌లో రూ.55 వేలు, తమిళనాడులో రూ.48 వేలు, కర్ణాటకలో రూ.45 వేలు ఇస్తున్నారని తెలిపారు. వైద్యవిద్యకు ఫీజులు తక్కువగా తీసుకుంటున్న రాష్ట్రం కూడా తెలంగాణాయేనని మంత్రి తెలిపారు. ఎంబీబీఎస్ అడ్మిషన్లకు రూ.10 వేలు ఫీజు ఉందని చెప్పారు.

ప్రతి లక్ష మందికి 22 ఎంబీబీఎస్ సీట్లతో దేశంలో నెంబర్ వన్ స్థానంలో, ఎనిమిది పీజీ సీట్లతో రెండో స్థానంలో ఉన్నామని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో పని చేసే వైద్యులకు పీజీ అడ్మిషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించినట్టు తెలిపారు. గతేడాది 3 వేల మంది వైద్యులను నియమించినట్టు చెప్పారు. ఈ నెల 16న గాంధీలో సూపర్ స్పెషాలిటీ మదర్ అండ్ చైల్డ్ సెంటర్ (ఎంసీహెచ్)ను ప్రారంభించనున్నట్టు తెలిపారు.

సెక్యూరిటీ సిబ్బంది వేతన సమస్యలను పరిష్కరిస్తాం

- సిబ్బందికి ఉచిత వైద్య సేవలు
- మహిళా సిబ్బంది రక్షణకు ప్రత్యేక కమిటీ : నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప
- సెక్యూరిటీ ఏజెన్సీలతో సమావేశం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో ఏజెన్సీల ద్వారా పనిచేసే సెక్యూరిటీ సిబ్బంది వేతనాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు ఆస్పత్రి డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప చెప్పారు. ఆస్పత్రి లెర్నింగ్ సెంటర్‌లో ఆదివారం ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. కొత్తగా టెండర్లు దక్కించుకున్న కార్తీక సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా 140 మంది సిబ్బందిని నియమించారు. 12 మంది మాజీ సైనిక అధికారులను సెక్యూరిటీ ఆఫీసర్స్‌గా నియమించారు. వారిని ఉద్దేశించి డైరెక్టర్ బీరప్ప మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. ఆస్పత్రి ప్రాంగణంలో వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా నిర్దేశించిన పార్కింగ్ స్థలంలో నిలిపేలా సూచనలు చేయాలన్నారు. ఏజెన్సీలు వేతనాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నాయని తన దృష్టికి వచ్చిందని, ఇక నుంచి అలాంటి సమస్య లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు. సెక్యూరిటీ సిబ్బందికి విధి నిర్వహణలో ఏదైనా అనారోగ్య సమస్యలు, అత్యవసర వైద్యం అవసరమైతే ఉచితంగా అందిస్తామని చెప్పారు. మహిళా సిబ్బందిని ఎవరైనా వేధిస్తే కఠిన చర్యలు తీసుకునేలా అంతర్గత ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేశామని, ఎవరికైనా సమస్య వస్తే ఆ కమిటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్లు లక్ష్మి భాస్కర్, కృష్ణారెడ్డితో పాటు సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాంక్ బండ్ పై గద్దర్ విగ్రహాన్ని పెట్టాలి

- వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ట్యాంకుబండ్‌పై గద్దర్ విగ్రహాన్ని ప్రతిష్టింపచేయాలని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా పెట్టాలని విజ్ఞప్తి చేశారు. సొంత ఊరు తూప్రాన్‌లో స్మారక భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. తొమ్మిదేండ్లుగా సీఎం కేసీఆర్.. గద్దర్‌కి అపాయింట్ మెంట్ ఇవ్వలేదని విమర్శించారు. ప్రగతి భవన్ దగ్గర రోజంతా ఎదురు చూసినా లోపలికి పిలవక పోవటంతో ఆయన కన్నీరు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గద్దర్ కుటుంబ సభ్యులకు కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కోట్ల మంది గుండెల్లో ఆయన ఇంకా బతికే ఉన్నాడనీ, అందుకే ఆయనకు మరణం లేదని తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా జరగాలి

- అధికారులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాలు
- కమిషనర్ కార్యాలయంలోనూ కేంద్రం ఏర్పాటు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మద్యం దుకాణాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా జరగాలని, రాష్ట్రంలో ఏ మద్యం దుకాణానికైనా దరఖాస్తు చేసుకోవడానికి ఆయా జిల్లాలతో పాటు, హైదరాబాద్‌లోని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దరఖాస్తుల సమర్పణలో ఎవరైనా సిండికేట్‌గా ఏర్పడినా, ఎవరినైనా అడ్డుకున్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం దుకాణాల కేటాయింపు పారదర్శకంగా జరగాలని, అందరికీ అవకాశాలు కల్పించాలని అన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేవారికి, సహకరించే వారిపై గట్టి నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్కువ దరఖాస్తులు వచ్చిన జిల్లాలకు ప్రత్యేక అధికారులను పంపుతున్నామన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ఎక్కడైతే తక్కువ దరఖాస్తులు వస్తున్నాయో పరిశీలించాలని ఆదేశించారు. గౌడ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన మద్యం దుకాణాల దరఖాస్తుకు కుల ధ్రువీకరణ పత్రం, ఏజెన్సీ సర్టిఫికెట్ లేకపోతే సెల్ఫ్ అఫిడవిట్‌లను అంగీకరించాలని అధికారులను సూచించారు. దరఖాస్తు చేయడంలో ఎటువంటి సమస్యలు ఉన్నా, దరఖాస్తుదారులకు సమాచారం కావాలన్నా వెంటనే స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులను సంప్రదించాలని, టోల్ ఫ్రీ నెంబర్ 18004252523ను సైతం సంప్రదించాలని శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు ఆ జిల్లాల్లో రియల్ ఎస్టేట్, సిమెంట్, ఫార్మా, వస్త్ర తదితర వ్యాపారవేత్తలతో సమావేశాలు నిర్వహించి వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం పాలసీని వివరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫరూఖీ, జాయింట్ కమిషనర్ శాస్త్రి, డిప్యూటీ కమిషనర్లు డేవిడ్ రవికాంత్, హరికిషన్, సహాయ కమిషనర్‌లు చంద్రయ్యగౌడ్, శ్రీనివాస్, ఈఎస్‌లు సత్యనారాయణ, రవీందర్‌రావు, అరుణ్‌కుమార్, విజయ భాస్కర్‌గౌడ్, విజయ్, పవన్‌కుమార్, టీఎస్‌బీసీఎల్ ఉన్నతాధికారులు సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు ఫిక్స్‌డ్ వేతనం

రూ.18 వేలు నిర్ణయించాలి

ఆశావర్కర్ల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో : వంగూరు రాములు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు నిర్ణయించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు డిమాండ్ చేశారు. లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్ గోల్కొండ చౌరస్తా వద్ద సీఐటీయూ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యాలయంలో ఆశా వర్కర్ల రాష్ట్ర విస్తృత సమావేశం ఆశా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వంగూరు రాములు మాట్లాడుతూ ఆశ వర్కర్లు గత 18 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ వారికి ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించకుండా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు అనేక రేట్లు పెరిగాయనీ, మరోవైపు గతంతో పోలిస్తే పని భారం కూడా బాగా పెరిగిందని చెప్పారు. ఆశ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి మాట్లాడుతూ ఆశాలకు గతంలో ఇచ్చిన హామీలు కూడా ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. రిజిస్టర్ ఇవ్వలేదని, యూనిఫామ్ నాణ్యతగా లేదనీ, అనేక ప్రాంతాల్లో రెస్ట్ రూమ్‌లు కూడా ఏర్పాటు చేయలేదనీ, జాబ్‌చార్ట్ కూడా ఇంకా ఇవ్వలేదని తెలిపారు. అనేక రకాల పనులు ఆశ వర్కర్లు చేయాల్సి వస్తుందని పని భారం పెరిగి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఆశా యూనియన్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు శ్రీలత, కొండాలక్ష్మి, రాజమణి, సాధన, హేమలత, సునీత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వం వైషమ్యాలు సృష్టిస్తోంది..

- అప్రమత్తంగా లేకపోతే దేశం ఆగమే : ఐలమ్మ ట్రస్ట్ కార్యదర్శి హైమావతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో బీజేపీ వైషమ్యాలు సృష్టిస్తున్నదనీ, అప్రమత్తంగా లేకపోతే దేశం అధోగతిపాలవుతుందని ఐలమ్మ ట్రస్ట్ కార్యదర్శి బి హైమావతి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం వీరనారి ఐలమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో 76వ స్వతంత్ర దినోత్సవ సందర్భంగా బాల బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. '76 వ స్వతంత్ర దినోత్సవం- బాలికల స్థితి' అనే అంశంపై వ్యాసరచన, లెమన్ మరియు చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వంద మంది పిల్లలకు పైగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ట్రస్ట్ చైర్మెన్ బుగ్గవీటి సరళ, కోశాధికారి కేఎన్ ఆశాలత, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, కుటుంబ న్యాయ సలహా కేంద్రం సభ్యులు ఉదయలక్ష్మి, రచయితలు రూపా రుక్మిణి, సమత, ఐద్వా సభ్యులు కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ 75ఏండ్ల స్వతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామనీ, అయినా నేటికి అక్షరాస్యత 62, 65 శాతం మధ్యలోనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో పక్క చదువుకున్న యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వాలు కల్పించలేకపోతున్నాయని విమర్శించారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వానికి పేదల కష్టాలు పరిష్కరించకపోగా.. మనువాద సంస్కృతిని పెంచిపోషిస్తున్నదని తెలిపారు. కుల, మత, ప్రాంతాల, తెగల మధ్య వైషమ్యాలు రగిలించి చోద్యం చూస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశభక్తి జపం చేస్తూ..మణిపూర్‌లాంటి మారణహోమాలను సృష్టిస్తున్నదని విమర్శించారు. తిండి లేక, ఉపాధి కరువై యువత డ్రగ్స్, తాగుడుకు బానిసలై కొడిగట్టిన దీపాల్లా తయారవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలపై రోజురోజుకు వేదింపులు పెరుగుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతతో వ్యవహరిస్తే..నేటి బాలబాలికలే రేపటి పౌరులు మారుతారని గుర్తుచేశారు.

నవతెలంగాణ మాజీ సీజీఎం పీవీ శ్రీనివాస్‌కు ఘన నివాళి

- ముగిసిన అంత్యక్రియలు
- సంతాపం ప్రకటించిన సీపీఐ(ఎం) తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర నాయకులు
- ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేసిన నేత పీవీ : సంతాప సభలో నేతలు



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

విద్యార్థి ఉద్యమ మాజీ నేత, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు, నవతెలంగాణ దినపత్రిక మాజీ సీజీఎం కామ్రేడ్ పీవీ శ్రీనివాస్ అంత్యక్రియలు ముగిశాయి. ఆయన శనివారం గుండెపోటుతో మృతిచెందిన విషయం విదితమే. కాగా శనివారం రాత్రి మృతదేహాన్ని స్వగ్రామం భద్రాచలం తీసుకొచ్చారు. మృతదేహాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సీపీఐ(ఎం), సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు ఆదివారం సందర్శించి నివాళి అర్పించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు పార్టీ జెండా కప్పి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ మాట్లాడారు. భద్రాచలం ఏజెన్సీలో పుట్టి మన్నెంలో విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించడంలో పీవీ కీలక పాత్ర పోషించారని సాగర్ అన్నారు. ప్రజాతంత్ర ఉద్యమ అవసరాలరీత్యా ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాలకు తరలివచ్చి.. భద్రాచలం ఏజెన్సీ నుంచి హైదరాబాద్ కేంద్రం వరకు విద్యార్థి యువజన ఉద్యమాలు నడిపారని చెప్పారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కేంద్రంలో పీవీ శ్రీనివాస్‌తో కలిసి పని చేసిన జ్ఞాపకాలను సాగర్ గుర్తు చేసుకున్నారు. ఆయన స్ఫూర్తితో భద్రాచలం ఏజెన్సీలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావటమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని, శ్రీనివాస్ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు.

పీవీ తండ్రి కృష్ణారావు పంచాయతీ రాజ్ శాఖలో ఉద్యోగ విధులు నిర్వహించినప్పటికీ అతనికి బండారు చంద్రరావుతో ఉన్న సాన్నిహిత్యంతో తన కుమారుడైన శ్రీనివాస్‌ను ఎస్ఎఫ్ఐ ఉద్యమంలోకి ప్రోత్సహించారని బండారు రవికుమార్ చెప్పారు. శ్రీనివాస్ భార్య స్వర్ణ జ్యోతి తల్లిదండ్రులు కూడా పార్టీ కుటుంబానికి చెందిన వారేనని, ఆ విధంగా పీవీ శ్రీనివాస్‌కి పార్టీకి విడదీయలేని అనుబంధం ఏర్పడిందని అన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏజే రమేష్, డీసీసీబీ మాజీ చైర్మెన్ యలమంచి రవికుమార్ మాట్లాడుతూ.. భద్రాచలం డివిజన్‌లో విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించిన పీవీ శ్రీనివాస్ అంచలంచెలుగా ఎదుగుతూ డీవైఎఫ్ఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యునిగా వెళ్లారని చెప్పారు. నవతెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్‌గా పనిచేశారన్నారు. పీవీ శ్రీనివాస్ సతీమణి జ్యోతి ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేస్తున్నారని చెప్పారు. ఆయన మృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటన్నారు. అనంతరం అంతిమయాత్రలో నాయకులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ కమిటీ సంతాపం

పీవీ మృతికి సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం ప్రకటించారు. అలాగే, ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. పీవీ మృతదేహానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల కాశి పూలమాల వేసి నివాళులర్పించారు. పీవీ శ్రీనివాస్‌తో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ యువజన ఉద్యమంలో కలిసి పనిచేసిన అనుభవాన్ని బాలకాశి గుర్తు చేసుకున్నారు.

పలువురి నివాళి

శ్రీనివాస్ మృతదేహాన్ని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావ రవికుమార్ సందర్శించి నివాళి అర్పించారు. మాజీ ఎంపీ, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు డాక్టర్ మిడియం బాబురావు పీవీ మృతికి తమ సంతాపాన్ని, కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఎం.సుబ్బారావు, నవతెలంగాణ ఉమ్మడి ఖమ్మం జిల్లా మేనేజర్ జావీద్, విలేకరులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ నాయకులు నివాళి అర్పించారు.

కృష్ణమూర్తి సేవలు ఉద్యమకారులకు ఆదర్శం

- దృఢసంకల్పంతో కమ్యూనిస్టు ఉద్యమానికి కృషి : 'ఉద్యమపథంలో నా జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణలో వక్తలు



పలాస(శ్రీకాకుళం) : కమ్యూనిస్టు ఉద్యమ కృషికి సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పాతిని కృష్ణమూర్తి మచ్చుతునక అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలంలోని మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కృష్ణమూర్తి 80వ జన్మదినోత్సవ సభను ఆదివారం నిర్వహించారు. కృష్ణమూర్తి జీవిత చరిత్ర 'ఉద్యమపథంలో నా జ్ఞాపకాలు' పుస్తకాన్ని, ప్రజాశక్తి వెలువరించిన జన్మదిన ప్రత్యేక సంచికను ఏపీ రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, ప్రజాశక్తి దినపత్రిక ఎడిటర్ బి.తులసీదాస్, సీపీఐ(ఎం) శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి.గోవిం దరావు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా సామాజిక స్పృహతో పాటు సమాజాన్ని మార్చాలన్న దృఢ సంకల్పంతో పనిచేసిన కమ్యూనిస్టు అని కొనియాడారు. ప్రజా, సామాజిక సమస్యలపై నిరంతర పోరాటం సాగించేవారని తెలిపారు. ఉపాధ్యాయులు, రైతులు, కూలీల సమస్యలపై పోరాటం చేయడమే కాదని... ప్రజాప్రతినిధులు, అధికారులను ఒప్పించి, మెప్పించి సాధించుకునేవారని చెప్పారు. ఉపాధ్యాయునిగా ఎంతోమందిని విద్యావంతులను చేశారని,



చౌదరి తేజేశ్వర్‌రావుని పరామర్శిస్తున్న వీరయ్య

కమ్యూనిస్టుగా ఎంతోమంది ఉద్యమకారులను తీర్చిదిద్దారని తెలిపారు. బెందాళం గవరయ్య గానుగుల తరుణాచారి, మార్పు పద్మనాభం మరికొంతమందితో కలిసి రైతుసంఘం ఏర్పాటు చేసి మందస జమిందారు ఉద్యమంలో పోరాడారని గుర్తుచేశారు. పోలీసులు ఎన్‌కౌంటర్ చేస్తారని ప్రచారం జరిగినా, జైలు జీవితాన్ని గడిపారు తప్ప పోలీసులకు లొంగిపోలేదన్నారు. మామిడిపల్లిలో ఉద్యమ పున:నిర్మాణంలో కృష్ణమూర్తి కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. 1999 ఎన్నికల్లో సోంపేట సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని పార్టీ కోరినప్పుడు గెలుపోటములను చూడకుండా ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి పోటీ చేశారని చెప్పారు. మామిడిపల్లి సర్పంచ్‌గా రెండుసార్లు ఎన్నికై ప్రజలకు సేవ చేశారన్నారు. అనంతరం కృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు. కృష్ణమూర్తి తనయుడు నరేంద్ర వర్మ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఏపీ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, పిరియా రాజారావు, ఎంపీపీ నిమ్మాన దాసు, వాణిజ్య పనుల శాఖ మాజీ డిప్యూటీ కమిషనర్ జుత్తు తాతారావు, మామిడిపల్లి సర్పంచ్ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

బాలికల పట్ల ప్రిన్సిపాల్ అసభ్య ప్రవర్తన

- రాకేష్ విద్యానికేతన్‌లో ఘటన
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- పోలీసుల అదుపులో ప్రిన్సిపాల్



నవతెలంగాణ-రాజేంద్రనగర్

అత్తాపూర్ ఎస్ఆర్‌డీజీ స్కూల్ విద్యార్థినిపై పీఈటీ వేధింపుల ఘటన మరువకముందే రాకేష్ విద్యానికేతన్ హైస్కూల్లోనూ అలాంటి ఘటనే జరిగింది. పదో తరగతి విద్యార్థినుల పట్ల ప్రిన్సిపాల్ అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం వెలుగుజూసింది. పోలీసులు, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామ్‌నగర్‌లోని రాకేష్ విద్యానికేతన్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థినుల పట్ల ప్రిన్సిపాల్ గుర్రం శంకర్ కొంతకాలంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. పాఠశాల సమయం అయిపోయిన తర్వాత స్పెషల్ క్లాస్‌ల పేరుతో రాత్రి 8, 9 గంటల వరకు స్కూల్లోనే ఉంచేవాడు. ఆ సమయంలో బాలికలను అసభ్యంగా తాకుతూ ముద్దులు పెట్టాలని వేధించేవాడు. అదేవిధంగా బాలికల ఫోన్ నెంబర్లు తీసుకొని తరచూ ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడేవాడు. ఇటీవల ప్రిన్సిపాల్ వేధింపులు ఎక్కువ అవ్వడంతో ఇద్దరు విద్యార్థినులు శనివారం రాత్రి తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు ఆదివారం ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. తను అలా చేయలేదని ప్రిన్సిపాల్ బుకాయించి, అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వెంటనే తల్లిదండ్రులు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రిన్సిపాల్ గుర్రం శంకర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

చనిపోతున్నాం.. న్యాయం చేయండి

- భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ - నర్మెట్ట

చనిపోతున్నాం న్యాయం చేయండి.. అంటూ సెల్ఫీ వీడియో తీసి భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం తెల్లవారు జామున జనగామ జిల్లా నర్మెట్టలో జరిగింది. ఎస్ఐ అనిల్ కుమార్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... నర్మెట్ట మండలం సూర్య బండతండాకు చెందిన భార్యాభర్తలు గురు- సునీతకు సర్వే 258.లో 1.09 గుంటల భూమి ఉంది. అది సునీత పేరు మీద పట్టా ఉండగా, అదే గ్రామానికి చెందిన భూక్యా జయరామ్ ఆక్రమించి చదును చేస్తున్నారు. ఊరిలో పెద్ద మనుషుల్లో మాట్లాడినా బాధితులకు న్యాయం జరగలేదని మనస్తాపానికి గురైన భార్యాభర్తలు "చనిపోతున్నాం న్యాయం చేయండి" అంటూ సెల్ఫీ వీడియో తీసుకుని పురుగుల మందు తాగారు. స్థానికంగా ఉన్న తండావాసులు గమనించి జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుల పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు.

ఆగస్టు 15 నుంచి కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమ్మె -టీయుఎంహెచ్ఇయూ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వాతంత్ర్య దినోత్సవం జెండా ఆవిష్కరణల అనంతరం రాష్ట్రంలోని కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమ్మెలోకి వెళ్లనున్నారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(టీయుఎంహెచ్ ఇయూ - సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో సీఐటీయూ సిటీ కార్యాలయంలో రాష్ట్రస్థాయి ఏఎన్ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఫసియుద్దీన్ అధ్యక్షత వహించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.యాద నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.బలరాం, రాష్ట్ర కోశాధికారి కవిత, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, టీయుఎంహెచ్ఇయూ గౌరవాధ్యక్షులు భూపాల్ ప్రసంగించారు.

నోటిఫికేషన్ రద్దు చేయాలి

భూపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము 1520 ఏఎన్ఎం పోస్టుల భర్తీ కోసం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దుచేసి ఖాళీ పోస్టుల్లో కాంట్రాక్ట్ వారిని సీనియార్టీ ప్రకారంగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నతాధికారులకు వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు. ఆగస్టు 15 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్టు జులై 31న సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదువేల మంది కాంట్రాక్ట్ ఏఎన్ఎంలందరూ ఆగస్టు 15 జండా ఆవిష్కరణల అనంతరం సమ్మెలోకి వెళుతున్నట్టుగా ప్రకటించి సమ్మెను ప్రారంభించాలని కోరారు.

ప్రభుత్వ ద్వంద్వ వైఖరి

వైద్యారోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద వైఖరి అవలంబిస్తున్నదని భూపాల్ విమర్శించారు. ఇటీవల కాలంలో మెడికల్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎంలు మేల్ హెల్త్ అసిస్టెంట్లను నేరుగా రెగ్యులర్ చేశారని గుర్తు చేశారు. కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు పరీక్ష విధానం రద్దుచేసి యధావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంట్రాక్ట్ ఏఎన్ఎంల నాయకులు కిరణ్మయి, సుగుణ, తదితరులు ప్రసంగించారు.

'ఔట్ సోర్సింగ్' రద్దు చేయాలి ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- వీఆర్ఏల కోసం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించొద్దు : జేఏసీ ఆత్మీయ సమ్మేళనంలో నేతల విజ్ఞప్తి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి, ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఏజెన్సీల అరాచకాలు పెచ్చరిల్లుతున్నాయనీ, సకాలంలో జీతాలు ఇవ్వకపోగా, అడిగితే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. కర్మన్‌ఘాట్‌లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో ఆదివారం జేఏసీ ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పలు జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జేఏసీ నేతలు పులి లక్ష్మయ్య, కె.సంతోష్, వినోద్, అరుణ్‌కుమార్, నారాయణ, బిందు తదితరులు మాట్లాడారు. మూడేండ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తక్షణమే క్రమబద్ధీకరించి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పే-స్కేలు, ఇతర ప్రయోజనాలు వర్తింపజేయాలనీ, మూడేండ్ల సర్వీసు పూర్తి కాని ఉద్యోగులకు ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లించాలని కోరారు. ఆత్మహత్యలకు పాల్పడిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందజేయాలనీ, కారుణ్య నియామకం కింద కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగావకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 2023 ఏప్రిల్ నుంచి కొత్త పీఆర్సీ వర్తింపజేయాలన్నారు. వీఆర్ఏల క్రమబద్ధీకరణ ప్రభావం పశుసంవర్ధక శాఖలో 15 ఏండ్లుగా పనిచేస్తున్న వందల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై పడిందనీ, పెద్ద సంఖ్యలో వీఆర్ఏలను తమ శాఖకు కేటాయించారన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇకపై విధులకు రావాల్సిన అవసరం లేదని నాలుగైదు జిల్లాల్లో పశుసంవర్ధక శాఖ ఆఫీస్ సబార్డినేట్లకు స్థానిక అధికారులు తేల్చి చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు ప్రసాద్, కష్ణ, గోవర్ధన్, జహీరుద్దీన్, శ్రీధర్, జగదీష్, శ్రీనాథ్‌గౌడ్, విజయలక్ష్మీ, సునీత, రాజిరెడ్డి, సురేందర్, సంధ్య, యాదయ్య, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవ కానుక ...

తీరొక్క పూల వనంలో
వాదాలు వర్ణాలు వదిలి
సీతాకోక చిలుకలు అయి వాలదాం
పరిమళాలు ప్రతి ఒక్కరికీ సమానంగా

మహిమ గల మట్టిలో
మంచి మొక్కలు నాలుగు నాటి
దేశాన్ని ఆనంద బృందావనం చేద్దాం
హృదయాలన్నీ వికసించాలి స్వేచ్ఛగా

ఒంటరి బాటను వీడి
నలుగురితో భుజాలు కలుపుదాం
కొత్త బాటలు వేసి మార్గదర్శకం అవుదాం
తరాలకు మనమే మేటి ఆదర్శం అవ్వాలి

భాషా భేషజాలు వదిలి
జాతీయ గీతం పాడుదాం



ఆసేతు హిమాచలం వరకు
భావాలు కలుపుదాం
చల్లని స్నేహ సౌరభాల పవనాలు
నాలుగు దిక్కులా

రంగు రేఖలు చెరిపేసి
రాజకీయాలకు గౌరవం పెంచి
అభివృద్ధి ఫలాలు అందరికీ పంచుదాం
ప్రపంచానికి మార్గ దర్శకత్వం మనమే అవ్వాలి

విద్వేషాలను ఇక్కడే వదిలి
మానవత్వం అందరిలో వెలిగిద్దాం
నువ్వు నేనూ
ఇక మనతో ముందుకు కదులుదాం
ఇక శాంతి వనం విస్తరణలు దిశలుగా

వజ్రోత్సవ కానుకగా
మనసులను అనుసంధానం చేసి
మనుషులం మరింత విశాలం ఆవుదాం
మానవత్వం మరింత గర్వంగా
కాలర్ ఎగుర వేస్తుంది..

- దాసరి మోహన్, 9985308080

నడిచే పొద్దు నేలకు ఒరిగిందా !?

అతడో మహోద్యమాల వేదిక
అన్యాయాలపై ప్రజా యుద్ధ గొంతుక
ప్రత్యామ్నాయ పోరాటల నౌక
పాదంమీద పుట్టు మచ్చైన
ప్రేమానుబంధాల వేడుక
ఆయన పాటొక కలకత్తా కాళికా నాలుక
బడుగు బలహీన వర్గాల చైతన్య మూలిక

పోరాటం అతని చిరునామా
ప్రశ్న అతని మాట.. ధిక్కారం అతని పాట..
రాజ్యం గుండెల్లో ఎక్కుపెట్టిన తూట
వెరసి గద్దర్

అవును ...
ఇప్పుడు సిరిమల్లెచెట్టు కింద
లచ్చుమమ్మ సినబోయే కూచుంది

తెలంగాణ సిరిమువ్వ మూగబోయిందా!?
గోసి గొంగడి పాటకు వందనం
గద్దరన్నా ఓ గద్దరన్నా... లాల్ నీల్ వందనం.

రాజ్యం బుల్లెట్‌నే
భయపెట్టిన పాటల బుల్లెట్ వి నువ్వు
నినదించే నీ ఉద్యమ గొంతులో
బుల్లెట్ కూడా నిదురపోయింది
ఏడేడు రంగుల సింగిడి తెలంగాణ గానమా ...!
మహోదయమా...!!
గద్దరన్న నీ మరణం చివరి చరణం కాదు
నీ పాటకు మరణం లేదు
నీ పోరు పేరు అమరత్వం

- శిఖాఆఖాష్, తంగిరాల. సోని
9676609234

గగన కుసుమం గద్దరన్న

పాటల సూరీడు మాయమయ్యేనని
ఎర్రమల్లెలు ఏడుస్తున్నవి
పాదం మీద పుట్టుమచ్చమాయమయ్యేనని
కన్నీళ్లు మాటిమాటికి తడుముతున్నవి

గోసి గొంగడి గొంతు పోవంగా
గద్దరేడని గోసబడుతున్నవి
కనేల్ కనేల్ అనే కంచు గజ్జెలు
కిమ్మనకుండా మౌనంగానే రోదిస్తున్నవి

పేదరికమే పెద్ద పాటై
గాయిదొళ్ల గాన గొంతుక
గగనసీమకు పయనమయ్యేనని
పోరు పాట పోరుతున్నది

పాట పొద్దు పడమట వాలేనని
ఆకలి అవ్వల ఆర్తనాదాలు
అలసిన అడుగులు ఆగి
అన్నేడని అడుగుతున్నవి

పాటకు పట్టం కట్టి
ప్రజాగొంతుకై ప్రశ్నించిన
ప్రజా యుద్ధనౌక
సమ సమాజ స్వాప్నికుడేడని
జన జాతర అడుగుతున్నది ?

వారితో పోరు బాట అన్నది.
అదిగదిగో! ఆకాశానా
అమర సీమన వేగుసుక్కైన
గగన కుసుమం గద్దరన్న.

- డా.ఎడ్ల కల్లేశ్, 9866765126

విప్లవాల గానలోలుడు గద్దర్ !

నివాళి



అతని జీవితం తెలిసినవాళ్ళు గద్దర్ ప్రజా యుద్ధనౌక అన్నారు. గాన గాంధర్వుడు అన్నా నిజమే, ప్రజల కవీ, గాయకుడు, వాగ్గేయకారుడు, వైతాళికుడు గద్దరన్న. తీరా చూస్తే ఆయన గోసి గొంగడిలో కనిపిస్తూ గొంతెత్తి రాగం తీస్తే, ఎగిరెగిరి ఆడీ పాడితే బొంగురు జీర ఉన్న గళంలోంచి మాటల తూటాలు దూసుకొచ్చి వెంట్రుకలు నిక్కబొడుకుంటాయి. చిన్న పిల్లలు సైతం తల్లి చంక దిగి ఆడటం చేస్తారు.

ఇలాంటి అపురూపమైన వ్యక్తుల్ని కాలం మళ్ళీ ఎప్పుడు పుట్టిస్తుందో, సమాజం ఎప్పుడు రూపొందిస్తుందో ! భుజం మీది ఎర్ర రుమాలు అమరులను గుర్తు చేస్తూ నిత్యం చెమటతో తడిసి ముద్దవుతుంటే, కడుపు శోకంతో విలపించే తల్లుల దు:ఖం గద్దర్ కంఠం నుండి ఎగతన్నుకు వస్తుంది. అందుకే 'మీ పాటనై వస్తున్నానమ్మో మా తల్లులారా' అని ఓదారుస్తాడు. సమాజం కోసం అడవిదారి పట్టి అర్థాంతరంగా అసువులు బాసిన యువకులను పిలుస్తూ 'వందనాలూ వందనాలమ్మో మా బిడ్డలూ. మీకు వందనాలు వందనాలమ్మో మా వీరులు.. మీరు తొలి పొద్దుల కిరణాలై వస్తారా, వాన చినుకులై కురిసి మమ్మల్ని పలకరిస్తారా.. ఇంటి ముందటి చేలల్ల జొన్న కంకులై మీ రాకను తెలియజేస్తారా..' అంటూ ఏడుపు పాటలా సాగే ఈ ప్రవాహంలో హృదయమున్న మనుషులు కొట్టుపోక తప్పదన్నట్లు ఉంటుంది.

కేవలం ఒక కవి, ఆశుకవి, గాయకుడు, ఆటగాడు కాదు గద్దర్. పేదరికంలో పుట్టి దళిత దళాక్షుడై వికసించి బి. నర్సింగ్‌రావు (World Famous Director) సాంస్కృతిక టీమ్‌లో చేరి, జన నాట్య మండలిలో పాటలు రాస్తూ అతను తూప్రాన్ నేల కన్న మట్టి బిడ్డ గుమ్మడి విఠల్‌రావు నుండి విప్లవ సముద్రంలో మహా పుష్పమై పూచిన నెత్తుటి ఊట. కవోష్ణ రుధిరధారలతో నేల తల్లిని అభిషేకించిన ఉద్యమాల పసి బాలుడు ! విప్లవాల గాన లోలుడు !

పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలంతో సంతకం చేయించి వీర తెలంగాణా నుదట ఎర్ర తిలకం దిద్దినవాడు.. ఉద్యమం గద్దర్‌కు కన్నతల్లి అయితే విప్లవ స్వప్నం అతని నిత్యగానాలాపనం, సమ సమాజం స్థాపనే ఆయన లక్ష్యం. అందుకు ఆరాట పోరాటాలను ఎక్కుపెట్టి నిరంకుశ పాలకులపై ప్రశ్నల బాణాలు సంధించిన విలుకాడు. ప్రజల జీవన సంక్షోభాలే గద్దర్‌ను గర్జించే గళ గాయకుడిగా మార్చాయి. గద్దర్‌ను పాటకు పెద్దన్ననూ, పర్యాయపదాన్నీ చేశాయి.

ప్రజల ఉసురుబోసుకునే పాలకుల ఆగడాలనూ.. వివిధ రూపాల్లో ప్రజల్ని దోచుకునే దొరల మోసాలనూ "జర భద్రం కొడుకో.. కొడుకో కొమురన్న జర" అంటూ హెచ్చరించే కాడికి తీసుకొచ్చాయి.. వెయ్యికాళ్ళ జర్రిలున్నాయని ప్రజల దృష్టిని మరల్చి వారిని ఆ జర్రి విషపు కాట్ల నుండి, క్రూర పరిష్వంగం నుండి కాపాడజూశాడు.

నిజానికి గద్దర్‌ది ప్రజాకవి కాళోజీ ఇష్టపడే ఉగ్ర నారసింహుని తత్వం. వేదిక మీద అతని ఆటా పాటల విన్యాసాలు చూస్తుంటే మానవ రూపంలో ఉన్న సింహం గర్జనలు చేస్తూ వేదికంతా కలెదిరుగుతున్నట్లు ఉంటుంది..

మొదటి నుండి తెలంగాణ ఆకలి, కరువు, నిర్బంధాలను చూసినవాడు. "అమ్మా తెలంగాణమా ఆకలి కేకల గానమా" అంటూ తనను కన్న నేల తల్లి వెతలను ఆ తల్లిని ప్రేమించే బిడ్డగా, తల్లిని సస్యశ్యామలంగా పచ్చని వరిమడిలా చూడాలనే తన ఆకాంక్షను ప్రకటిస్తాడు.

అతని బతుకు బాట, బలిపీఠం మీద బలి కోసం తీసుకుపోయే బాట. కానీ తాను బహుముఖంగా విస్తరించి యుద్ధవీరుడైనాడు. 1970 నుండి ప్రజాపక్షం నిలబడుతూ అడివి బాటకు దారి చూపాడు. అది తొలుత మార్క్సిస్ట్ - లెనినిస్ట్ తాత్విక ధార అయినా, మావో లాంగ్‌మార్చ్ స్ఫూర్తి అయినా బ్రాహ్మణీయ వ్యవస్థ మీద తిరుగుబాటు పోరు జెండా ఎత్తిన జ్యోతీరావు పూలే, అంబేద్కర్‌ల తాత్విక సిద్ధాంత జ్ఞానాన్ని వొంట బట్టించుకున్నాడు. గద్దర్ ఆగ్రహమంతా ఈ అసమానతల యధాతథ వ్యవస్థ పైనే. గద్దర్ నిరంతర కార్యాచరణలో ఈ మహానుభావుల ఆశయ స్ఫూర్తిని చూస్తాము. తాను ఎవరి పక్కన నిలబడి ఎవరితో యుద్ధం చేసినా.. ఎవరితో సావాసం చేసి సామాజిక జ్ఞానాన్ని అవపోసన పట్టినా స్వయంగా తాను పుట్టిన కుల-వర్గాలను మర్చిపోలేదు. ఆ అడివి మనిషి తోడబుట్టిన చెల్లెల్ల పాదం మీద పుట్టుమచ్చై ఆ చెల్లెల్ల రుణం తీర్చుకునే ప్రేమార్తి !

తన తల్లి లచ్చుమమ్మ గుండె గీతాన్ని గీపెట్టడం ఆపలేదు. ఆడవాళ్ల పట్ల జరిగే సవాలక్ష అన్యాయాలను అకృత్యాలనూ గేయాలుగా ప్రపంచం ముఖం మీద గాయాలుగా ఆరేయడం మర్చిపోలేదు.

అందుకే "సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మో లచ్చుమమ్మో / నువు చినబోయి కూసున్నవెందుకమ్మో ఎందుకమ్మో../ మోకాళ్ల మట్టుకు బురదలో దిగబాడి / ఎద్దోలె ఎనుకాకు / ఒక్కొక్క అడుగేసి / నీ నడుమంత గుంజిందా లచ్చుమమ్మో లచ్చుమమ్మో".. అంటూ తన తల్లిలో వేలాది కూలి తల్లులను చూస్తూ పరామర్శించి ఓదారుస్తాడు.

"అర్ధరాతిరి అమాస చీకటి చెల్లెమ్మా ఓ చెల్లెమ్మా / ఇల్లు దాటితివి పల్లే దాటితివి చెల్లామ్మా ఓ చెల్లెమ్మా ఎక్కడికమ్మా బయలుదేరితివి" అని దగాపడిన చెల్లెళ్లను కటిక చీకటి రోజుల్లో కూడా తోడు నడుస్తూ కనిపెట్టుకొని ఉంటాడు.

ఇక ఆడపిల్లలను పుట్టనీయని ఈ దౌర్జన్యపు లోకం.. పుడితే రకరకాల నేర పద్ధతుల్లో వాళ్ళను హతమారుస్తున్నది. అది ఏ మాత్రం సహించలేని ఈ సున్నిత హృదయుడు.. అన్యాయాలపై పులిలా లంఘించే శూరుడు. "నిండూ అమాసనాడు ఓ లచ్చ గుమ్మడీ / ఆడపిల్ల పుట్టినాదో ఓ లచ్చ గుమ్మడి / అత్త తొంగి సూడలేదు ఓ లచ్చ గుమ్మడీ / మొగడూ ముద్దాడ రాలే ఓ లచ్చ గుమ్మడీ" అంటూ ఆడపిల్ల ఏ రోజున పుట్టినా అది లోకులకు అమావాస్య రాతిరితో సమానం. ఆ పసికూనను గుడ్డల్లో చుట్టి ముళ్ళ కంపల్లోకి నిర్దాక్షిణ్యంగా విసిరేయడం, మురికి కాలువల్లో పడేయడం, ఎక్కడో రోడ్డు మీద వొదిలేయడం, వడ్లగింజ నోట్లో వేసి చంపడం లాంటి దుర్చర్యలకు పాల్పడుతుంటారు. ఆయన ఆడవాళ్ళ కోసం, విప్లవోద్యమాలకు తమ బిడ్డలను బలిదానం చేసిన తల్లుల కోసం, పుట్టుకకే నోచుకోని ఆడ పిండాల కోసం, శ్రామికులు, కార్మికుల కోసం, దుక్కిదున్నే రైతుల కష్టాలనూ ఏకరువు పెడ్తూ ఎన్నో కావ్యాలను గానం చేసాడు. పాట పుట్టుకను తాత్వికతతో వివరించాడు. పాట వాహనమెక్కి ప్రపంచ పర్యటన చేసిన విశ్వమానవుడు ! అద్భుతమైన నరుడు కామ్రేడ్ గద్దర్ !

ఈ రోజున గద్దరన్న భౌతికంగా దురమయ్యాడు. కానీ ప్రజల హృదయ ఘోషలో నిత్య జీవితుడు. ప్రతి రోజు అరుణోదయంలోంచి వికసించే పొద్దు తిరుగుడు పూవై వస్తూ.. ప్రజల పాటలో ప్రజ్వరిల్లే క్రాంతి దీపమై వెలుగుతుంటాడు. అతని వారస్వత్వాన్ని కొనసాగించే వేలాది మంది బిడ్డలకు విప్లవాల పురిటి నెత్తుర్లలో జన్మనిస్తాడు. తానన్నట్లు పాటగానే వస్తాడు! పాటకు మరణం లేదు. పాట ప్రయాణం అనంతం ! అమరం ! జయహో గద్దరన్న !

- అనిశెట్టి రజిత

కూలి నాలి కష్టజీవుల,
ఆకలి కేకల అల్పజీవుల, బాధల బతుకు చెరల్లో
కునారిల్లే ఆడవాళ్లతో మమేకమయిన మనిషి. గద్దర్‌కు
జండర్ అంటూ లేదు. అతడు మనిషి అంతే. ప్రజల కోసం నిప్పల
గుండం తొక్కిన నిర్భయుడు, జయుడు. అస్పృశ్యతా అణిచివేతలను
ఎండగట్టిన సమతాధార్మికుడు. ఒంట్లో తూటాలను భరిస్తూ రెండు
దశాబ్దాలపైన ధైర్యం చెడక జీవితోద్యమ కార్యాచరణతో ఉన్న
కారణజన్ముడు ! ప్రజాస్వామిక వ్యవసాయదారుడు ! జనకావ్యం
పుట్టించిన ఆదిమ మానవుడు! విధ్వంసకరమైన రాజకీయాలను
దనుమాడిన దిగ్గజుడు. ప్రశ్నల కొడవలెత్తిన కమ్యూనిస్టు !
సామ్యవాద స్వాప్నికుడు !



నేటి భారతం

దేశం ఇంకా బ్రతికే ఉంది
మైండే చచ్చిపోయింది

మంచివాడెవడో
పిచ్చి ముదిరిన వాడెవడో
తెలిసీ తెలియని వాడెవడో
తెలిసీ తెలియనట్టు
తెలియకపోయినా తెలిసినట్టు...
ఎవరెంతమందో

ఉట్టిపడుతున్న అజ్ఞానం
ఇదే భారతీయ సుజ్ఞానం
సిగ్గులేని ప్రచారకులు
నిర్లక్ష్యపు జనాలు



ఏది లౌకికమో
ఏది అలౌకికమో

ఏది సహజమో
ఏది అసహజమో

దారి చూపాల్సిన
మార్గదర్శకులే
దారి తప్పితే
మార్గ మధ్యలో చీకటి కమ్మదా!?
తెల్లబారిన సమాజం ఫక్కున నవ్వదా...

ఇదే
మా దారి; రహదారి అంటూ
తొడలు చరచుకున్నా
గుండెలు గుద్దుకున్నా
వాచేది వారికేనేమో!?
వెనకబడేది
నవ్వుల పాలయ్యేదీ దేశం.

- దుర్గం మహేష్, 9700888972

సాహితీ వార్తలు

27న 'నానీల తీరాన' ఆవిష్కరణ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఎన్. లహరి రచించిన నానీల సంపుటి 'నానీల తీరాన' ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ నెల 27న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతి సమావేశ మందిరం మొదటి అంతస్తులో తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ డా॥ ఎన్.గోపి ముఖ్యఅతిథిగా వచ్చి పుస్తకాన్ని ఆవిష్కరించ నున్నారు. ఉస్మానియా తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా॥ ఎస్.రఘు సభాధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా డా॥ మామిడి హరికృష్ణ రానున్నారు. వివరాలకు 9885535506 నంబరు నందు సంప్రదించవచ్చు.

సాహిత్య విమర్శనా వ్యాసాలకు ఆహ్వానం

ప్రామాణికమైన విమర్శనా వ్యాసాలతో ఒక పుస్తకాన్ని ప్రచురించాలని 'పాలపిట్ట బుక్స్' సంస్థ సంకల్పించింది. 'సంశోధన' శీర్షికన ఈ వ్యాసాల పుస్తకం వెలువడుతుంది. వ్యాసంతో పాటు ఎంట్రీ ఫీజుగా రూ. 2000 పంపించాలి. ఆసక్తి కలిగిన వారు వ్యాసాలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, పాలపిట్ట బుక్స్, ఫ్లాట్ నెం: 2, బ్లాక్-6, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500044 చిరునామాకు లేదా palapitta-books@gmail.com మెయిల్‌కు ఆగస్టు 24 లోగా పంపవచ్చు. అక్టోబర్ నెలలో కొడవటిగంటి కుటుంబరావు జయంతి సందర్భంగా ఈ పుస్తకం విడుదల అవుతుంది. వివరాలకు 9848787284 నంబరు నందు సంప్రదించవచ్చు.

- గుడిపాటి

15న దేవరాజు మహారాజు 'సప్తతి' వేడుక

సాహితీ ప్రపంచంలో పరిచయం అక్కరలేని పేరు డా. దేవరాజు మహారాజు. వారి "సప్తతి" వేడుక ఈ నెల 15న ఉదయం 10 గం॥లకు మానవ వికాస వేదిక ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని సి.ఆర్. ఫౌండేషన్‌లో నిర్వహిస్తున్నారు. అగ్రశ్రేణి సంపాదకులు ఎ.బి.కె. ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సురవరం సుధాకర్‌రెడ్డి, ఆత్మీయ అతిథులుగా సుధామ, డా॥ జి.వి. రత్నాకర్, బి.సాంబశివ రావు హాజరు కానున్నారు. వివరాలకు డి.హనుమంత రావు 8247848044 నంబరు నందు సంప్రదించవచ్చు.

రేపు కవిసమ్మేళనం

తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'లౌకిక భారతం - మత సామరస్యం' అంశం మీద కవి సమ్మేళనం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 15న మంగళవారం మధ్యాహ్నం 2:30 ని॥లకు నిర్వహించనున్నారు. తంగిరాల చక్రవర్తి సభాధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమానికి అతిథులుగా పాశం యాదగిరి, అయినంపూడి శ్రీలక్ష్మి, ఏబూషి నరసింహ హాజరు కానున్నారు. వివరాలకు 9393804472, 8897765417, 9490099083 నంబర్ల నందు సంప్రదించవచ్చు.

సమాజానికి కనువిప్పు ఈ కవిత

జింబో ఆషామాషీగా ఏదిపడితే అది రాసే కవి కాదు. నిబద్ధత గల వ్యక్తి. న్యాయవాదిగా పనిచేసిన అనుభవం, తర్వాత మేజిస్ట్రేట్‌గా పనిచేశారు. వివిధ హోదాల్లో పని చేస్తూ జిల్లా జడ్జిగా రిటైర్ అయ్యారు. న్యాయార్థులై వచ్చిన కక్షిదారుల వేదనలకు పరితాపం చెంది కవితకు అక్షర రూపం ఇచ్చారు. ఈ అవ్యవస్థలో న్యాయం నలిగిపోతున్నది. గంతలు కట్టుకున్న న్యాయదేవత సాక్షిగా న్యాయమూర్తి స్థానంలో కూర్చుండి, తనకున్న పరిశీలనా దృక్పథంతో ఎంతో వేదన చెంది కవితకు ప్రాణం పోశాడనిపిస్తుంది.



ఈనాటి సమాజంలో న్యాయం ఎండమావిలా తయారైంది. కళ్ళతో చూస్తే న్యాయం దగ్గరగా కనబడుతుంది. కాని న్యాయం అందకుండా చేసే దుర్మార్గుల రాజ్యం కొనసాగుతుంది. ఇవ్వాళున్న వ్యవస్థలో మంచి కొరకు, మంచి సమాజం కొరకు పాటు పడుతున్న వాళ్లను కేసులు పెట్టి వేధిస్తున్న సంఘటనలు మనం నిత్యం చూస్తున్నాం. ఈ కవిత సమాజానికి కనువిప్పు కలిగేలా ఉంది. అందరు చదవాల్సిన కవిత.

"మనిషిని నిటారుగా / నడవకుండా చేయడానికి / వాడి వెన్నెముకని / విరవాల్సిన పనిలేదు"

మనిషి చక్కగా నిలబడాలన్నా, నడవాలన్నా, అతని వెన్నెముక పటిష్టంగా ఉండాలి. వెన్నెముక దెబ్బతిన్న ప్రతి వారికి అనుభవైకవేద్యమే. కానీ కవి జింబో ఒక మనిషిని లొంగదీసుకోవాలన్నా, అతనిని న్యాయం కోసం, ధర్మం కోసం, నిలబడి పోరాటం చేయకుండా ఉంచాలంటే అతని వెన్నెముకను విరవాల్సిన అవసరం లేదు. దానికి బదులుగా అతనిపై ఒక కేసు పెడితేచాలు. తద్వారా అతని వెన్నెముక బలహీనపడి అతని పోరాటపటిమ సన్నగిల్లుతుందని వివరిస్తున్నాడు. కవి జింబో ఈ కవితా పంక్తుల ద్వారా న్యాయస్థానాల్లో కేసులపై జరుగుతున్న వాస్తవ స్థితిగతుల వైపు మనం దృష్టి సారించే విధంగా చేసి మనలను జాగృతపరుస్తున్నాడు.

"మనిషిని వంగపెట్టడానికి / వాడి వీపు మీద రాళ్లు రప్పల్ని / ఎత్తాల్సిన పనిలేదు"

మనిషిని వంగపెట్టడానికి వాడి వీపు మీద రాళ్లు రప్పల్ని ఎత్తితే సరిపోతుంది అనే విషయం మన అందరికీ తెలుసు. కవి, జింబో న్యాయమూర్తిగా వేల కేసులను చూసి పరిశీలించి, ఒక్క కేసు పెడితే చాలు. మనిషిని వంగ పెట్టడానికి వాడి వీపు మీద రాళ్ల రప్పల్ని ఎత్తాల్సిన పనిలేదు అనే నిజాన్ని మనకు తెలియజేస్తున్నాడు.

"మనిషిని పిండి పిండి / చేయడానికి / వాడిని విసుర్రాయి కింద / నలపాల్సిన పనిలేదు"

"మనిషిని పిప్పి పిప్పి / చేయడానికి / చెరకు రసం మిషన్ / అవసరం లేదు"

ఒక్క కేసు పెడితే చాలు. మనిషిని పిప్పి పిప్పి చేయడానికి చెరకు రసం మిషన్ అవసరం లేదు అనే నిజాన్ని మనకు తెలియజేస్తున్నాడు.

"మనిషిని నిర్వీర్యం / చెయ్యడానికి / చిత్ర హింసల ప్రయోగాలు / రుచి చూపించాల్సిన పని లేదు"

మనిషిని నిర్వీర్యం చెయ్యడానికి చిత్ర హింసల ప్రయోగాలు రుచి చూపించాల్సిన పని ఉంది అని మన అందరికీ తెలుసు. పోలీసు అధికారులు చిత్ర హింసలు పెట్టి మరియమ్మ అనే దళిత సామాజిక వర్గానికి చెందిన మహిళ, ఈ మధ్యనే ముస్లిం వర్గానికి చెందిన యువకుడు ఖదీర్ ఖాన్ ఏదో నేరం చేశాడని పోలీసు స్టేషన్ లోనే చిత్రహింసలు పెట్టి చంపివేసిన సంఘటనలు మనమెరిగినదే. పోలీసులు చిత్ర హింసలు పెట్టి థర్డ్ డిగ్రీ పద్ధతులు ఉపయోగించి పోలీసులు నేరం ఆరోపించబడిన వ్యక్తులను చంపి వేస్తున్న సంఘటనలు మనం నిత్యం చూస్తున్నాం. బ్రిటిష్ కాలం నాటి పోలీసుల్లాగే ప్రవర్తిస్తూ అమాయకులను పోలీస్ స్టేషన్‌లోనే విచారణకు గురిచేస్తూ చంపేస్తున్నారు.

"మనిషిని అణగదొక్కడానికి / రోడ్డు రోలరు / అంత కంటే అవసరం లేదు"

ఒక్క చిన్న కేసు చాలు వాడి సున్నితత్వాన్ని బట్టి మనిషి భయంలోకి వెళ్లిపోతాడు. ఆందోళనకు గురి అవుతాడు అనే నిజం మనకు తెలియజేస్తున్నాడు.

"అది అన్నలకు / అన్నం పెట్టిన కేసే కావచ్చు"

ఆకలి అయిన వాడికి అన్నం పెడితే నేరమా? ఆ కేసు పేరిట పోలీసుల దర్యాప్తులు, విచారణకు పిలుపులు, వేధింపులు భరించలేకపోతారు. కేసుల పేరిట వాణ్ని నిర్వీర్యం చేస్తారు.

"అన్నం పెట్టలేదనే / మనోవర్తి కేసే కావచ్చు"

అందులో నిజానిజాలు తేల్చక ముందే, కేసు పెట్టగానే ఎంత బుగులు, ఎంత దిగులు, కలవరం ఉంటుందో మనమంతా ఎరిగినదే.

"కట్నం అడిగిన కేసే కావచ్చు"

నిజంగా కట్నం అడిగిన కేసుల్లో అమ్మాయి తల్లిదండ్రులు అదనపు కట్నం లాంఛనాలు ఇచ్చే స్తోమత లేనందువలన కుములుతుంటారు.

అదనపు కట్నం తీసుకు రానందుకు భర్త, అత్తా, మామలు, ఆడ పడుచు, మరిది, అమ్మాయిని హింస పెట్టి కిరోసిన్ పోసి చంపుతున్న ఘటనలు కోకొల్లలు.

"కానుకలు దొంగిలించిన కేసే కావచ్చు" ఎవరు కానుకలు దొంగిలించారు? అసలైన వ్యక్తిని పట్టుకోరు. అమాయకులపై కేసు పెట్టి వేధిస్తారు.

"తన్నులు తిన్న కేసే కావచ్చు" ఎందుకు తన్నులు తిన్నారు? ఇవ్వాళ క్రౌర్యం పెరిగి అమాయకులను హింసించడం జరుగుతున్నది. మానవ హక్కుల హననం రోజు జరుగుతున్నదే. రాజ్యాంగం కల్పించిన, జీవించే హక్కును కాలరాచే చర్యలు నిత్యం పత్రికల్లో చూస్తూన్నాం.

"తన్నిన కేసే కావచ్చు / కన్ను కొట్టిన కేసే కావచ్చు / కన్ను పీకేసిన కేసే కావచ్చు / బాకీ తీసుకున్న కేసే కావచ్చు / బార్డర్ పంచాయితీ కావచ్చు"

బార్డర్ పంచాయితీ కేసులు గ్రామాల్లో, పట్టణంలో నలుగుతూ ఉంటాయి. కుట్ర కేసు కావచ్చు. దేశ ద్రోహానికి పాల్పడ్డాడని అమాయకుల పై తప్పుడు కుట్ర కేసులు పెట్టడం ఆనవాయితీగా మారింది.

ఖూనీ కేసు కావచ్చు. ఏదో ఒక్కటి వేధించడానికి ఏదో ఒక్కటి కేసులో ఇరికించి అమాయకులను ఇబ్బంది పెడతారు.

"తల నరికిన కోడిపెట్ట మొండెంలా మనిషి కొట్టుకోవడానికి తల లేని మనిషిని చేయడానికి తల నరికిన కోడిపెట్ట మొండం కూడా ప్రాణం ఉన్నట్లు బాధతో కొట్టుకుంటుంది. ప్రాణం తీశారని కోడి విలవిలలాడుతుంది.

తల లేని మనిషిని చేసి కేసులు పెట్టి విలవిల లాడిస్తున్నారు. ఇవ్వాళ ఉన్న వ్యవస్థలో న్యాయం ఎండ మావిలా తయారయింది. ఎండమావిలో ప్రయాణిస్తుంటే మనకు నీరు దగ్గరగా చేరువలో ఉన్నట్టు అనిపిస్తుంది. మనం అక్కడికి వెళితే ఏమీ ఉండదు. ఒక్క చోట మాట్లాడుతుంటే విన్నాను. న్యాయస్థానాలు లేవని మాట్లాడుతున్నారు. ఇవ్వాళ న్యాయం న్యాయస్థానంలో దొరకదని అంటున్నారు. ప్రజలు ఎంతో బాధతో న్యాయస్థానాల్లో న్యాయం లభించదని ఘంటాపథంగా మాట్లాడుతుంటే ఆశ్చర్యపోయాను. వారు అనే మాటలను గూర్చి ఆలోచించవలసి వచ్చింది.

న్యాయస్థానాలు నమ్మకం కోల్పోయాయి అనిపించింది. అప్పుడప్పుడు న్యాయ స్థానాలు ప్రజల తరపున నిలుస్తూ చక్కటి తీర్పులు ఇస్తున్నాయి. న్యాయస్థానాలను మనం కాపాడుకుంటేనే భావితరాల జీవితాలు సౌఖ్యంగా ఉంటాయి. లేకుంటే బాధలతో నిండిపోతాం.

"కేసులు కేసుల కోసమే పెడ్తారు అనేది వాస్తవం. మనిషిని లొంగ తీయడానికి పెడ్తారు. భయంతో మనిషి లొంగి పోతాడనే ఉద్దేశ్యంతో కేసు పెడ్తారు. సమాజంలో జరుగుతున్న వాస్తవాన్ని కళ్ళకు కట్టినట్టు చూపించారు.

"కోర్టుని దీపం చేసి / మనిషిని పురుగుని చేసి" వినోదించడానికి పెడ్తారు. మనం దీపం వెలిగిస్తే దీపం చుట్టు పురుగులు చేరతాయి. దీపం దగ్గరకు చేరి పురుగులు మాడిమసై పోతాయి. కోర్టుల చుట్టు తిరిగిన మనిషికి న్యాయం అందడం లేదు. న్యాయమందకుండానే మనిషి కోర్టుల చుట్టూ తిరిగి దీపపు పురుగుల్లా మాడి మసై పోతున్నాడు. ఇవ్వాళ న్యాయం ను కాపాడు కోవాల్సిన ఆవశ్యకతను కవి తెలియ జేశాడు. ఒక్క కేసు చాలు కవిత సమాజానికి స్ఫూర్తిదాయకంగా ఉంది.



- నరేంద్ర సందినేని

దర్వాజ పేజీపై మీ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, రచనలను darwajapage@gmail.com కు పంపించగలరు. చిరునామా : దర్వాజ, నవతెలంగాణ, ప్లాట్‌నెం. 21/1, అజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500020

ఆత్మకథలు అందరూ రాయాలి

'నిఖిల లోకం, సాహిత్య సంగమం' పుస్తకావిష్కరణలో పలువురు వక్తలు

- దిగంబర సంపుటే నాకు స్ఫూర్తి :కె.శివారెడ్డి
- నిఖిలేశ్వర్ ఆత్మకథ రెండో భాగమూ రాయాలి: కె.శ్రీనివాస్
- నాకూ అసంతృప్తిగానే ఉంది : కవి నిఖిలేశ్వర్



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

'ఆత్మకథలు అందరూ రాయాలి. ముఖ్యంగా ప్రముఖులు తప్పనిసరిగా రాయాల్సిందే. అవే నేటి తరానికి స్ఫూర్తి. ప్రేరణగా నిలుస్తాయి' అని పలువురు వక్తలు అన్నారు. బాగ్‌అంబర్‌పేట్‌లో ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కవి నిఖిలేశ్వర్ రచించిన 'నిఖిల లోకం, సాహిత్య సంగమమం' పుస్తకాలను కవి నగ్నముని ఆవిష్కరించారు. అనంతరం కె.శివారెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ దిగంబర సంపుటినే నాకు స్ఫూర్తి, ప్రేరణ కల్గించాయని అన్నారు. ప్రేరణ కల్గించిన వ్యక్తిని, పుస్తకాలను మరిచిపోకూడదని, మరిచిపోతే ద్రోహం అవుతుందన్నారు. వస్తువు మారితే భాష కూడ మారాలనీ, మారితే విప్లవమవుతుందనీ, మారకపోతే బాధ అవుతుందనీ, దీనిలో చాలా వెనుకబడి ఉన్నామని తెలిపారు. నగ్నముని మాట్లాడుతూ ఆత్మకథలో కొత్త విషయాలు వెలుగులోకొస్తాయని అన్నారు. 40ఏండ్ల పాటు అసెంబ్లీలోనే పనిచేశానని గుర్తుచేశారు. దిగంబర కవిత్వానికి రాజకీయ అనుభవం కూడ కలిసొచ్చిందన్నారు. నిఖిల లోకం పుస్తక పరిచయకర్త డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అందరి ఆత్మకథలు సంచలనాలు కావన్నారు. కొన్ని చరిత్రను పరిచయం చేస్తాయన్నారు. 'సాహిత్య సంగమం' పుస్తక పరిచయకర్త జతిన్‌కుమార్ మాట్లాడుతూ సమాజానికి ప్రేరణనిచ్చిన 35 మంది వ్యక్తుల అనుభవాల సారాంశమే 'సాహిత్య సంగమం' అన్నారు. సమకాలిన పరిస్థితుల్లో ఆత్మకథను రాసుకోవడం కష్టమేననీ, నిఖిలేశ్వర్ మెత్తటి మనిషనీ, కానీ ఆయన అభిప్రాయం మాత్రం గట్టిగానే ఉంటుందన్నారు. కవులు కాకపోయిన కవిత్వం రాసే కవులు, రచయితలకు అండగా నిలిచిన దేవులపల్లి వెంకట్రామయ్య, తరిమెల నాగిరెడ్డి ప్రస్తావన స్ఫూర్తినిచ్చిందన్నారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడూతూ నిఖిలేశ్వర్ ఆత్మకథ 'నిఖిల లోకం' పుస్తకానికి తాను ముందు మాట రాశానని, అసంపూర్తిగానే ఉందనీ, రెండో భాగమూ రాయాలని అన్నారు. తన గురించి తాను గొప్పగా చెప్పుకోలేని మనిషని, ఆయన వ్యక్తిత్వంలో తెలంగాణ తనం ఉట్టిపడిందన్నారు. కవి ఓల్గా మాట్లాడుతూ నిఖిలేశ్వర్, జ్వాలముఖి వేసిన నాటకం అందరిని ఆకట్టుకుందన్నారు. నిఖిలేశ్వర్, ఆయన భార్య యామినితో ఎంతో అనుబంధం ఉండేదని గుర్తుచేశారు. ప్రముఖ విశ్లేషకులు తెలకపల్లి రవి మాట్లాడుతూ విగ్రహంలా ఉన్న నిఖిలేశ్వర్‌కు నిగ్రహం కూడా ఉందన్నారు. ఆయన అరమరికల్లేని మనిషన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ లెనిన్ శతజయంతి సభలో 'ఎరుపే నిజం..నిజం..నిజం' అని జ్వాలముఖి అన్నారని, తర్వాత వచ్చిన నిఖిలేశ్వర్ కూడా 'మా మిత్రుడు జ్వాలముఖి చెప్పిందే నిజం..అదే నిజం...అదే నిజం. లెనిన్ మీ వాడు, మా వాడు, మన అందరివాడు' అన్నారని గుర్తుచేశారు. వామపక్ష ప్రజాస్వామిక కవుల సంఘంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. కవి నందిని సిధారెడ్డి మాట్లాడుతూ శివారెడ్డి–దేవిప్రియ, జ్వాలముఖి–నిఖిలేశ్వర్ జంట కవులుగా పేరుగాంచారని గుర్తుచేశారు. వారి మాదిరిగానే తాము రఘునాథ్–సిధారెడ్డి జంటగా ఏర్పడ్డామని తెలిపారు. నిఖిలేశ్వర్ ఆకలి, అప్యాయత తెలిసినవారని కొనియాడారు. ఆయన్ను ఇష్టపడ్డా..ప్రేమించా..ఆయన కవిత్వాన్ని ఆస్వాదించానని చెప్పారు. ఆయన రాసిన పుస్తకంలో 'రాత్రిళ్లో క్షుద్రత్వం నగరంలోని వేశ్యకు తెలుసు...అడవిలోని అమరత్వం గెరిల్లాకు తెలుసు' ఎంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. జీవన్‌కుమార్ మాట్లాడుతూ యుద్ధం, విప్లవంలో కవుల పాత్ర ఎనలేనిదన్నారు. కవి నిఖిలేశ్వర్ మాట్లాడుతూ 'నా ఆత్మకథలో ఎంతో దాచిపెట్టాను. అధ్యాత్మికం నుంచి మార్క్సిస్టు వరకు ఎన్నో అనుభవాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఉద్యమం తననెంతో తీర్చిదిద్దందన్నారు. కుటుంబ సభ్యులవల్లనే ఇప్పటికీ సజీవంగా, ఆరోగ్యంగా ఉన్నానని తెలిపారు. అంతకుముందు ప్రజా వాగ్గేయకారుడు గద్దర్, సియాసత్ మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్‌లకు నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో నిఖిలేశ్వర్ కుమారులు రాహుల్, సమీర్, కుటుంబ సభ్యులు, కవులు, రచయితలు తదతరులు పాల్గొన్నారు.

ఎంపీలో అవినీతిపై పోస్టులు

- ప్రియాంక గాంధీ, కమల్‌నాథ్‌లపై ఎఫ్ఐఆర్



భోపాల్ : మధ్యప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వ అవినీతిపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ ప్రియాంకా గాంధీ, ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్‌లపై కేసులు నమోదయ్యాయి. శనివారం అర్ధరాత్రి సమయంలో వారిపై ఎఫ్ఐఆర్‌లు రిజిస్టరయ్యాయి. ప్రియాంక, కమల్‌నాథ్‌లకు వ్యతిరేకంగా రాష్ట్ర బీజేపీ నాయకులు ఫిర్యాదులు చేశారు. భారతీయ శిక్షా స్మృతి(ఐపీసీ)లోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. దీనిపై కమల్‌నాథ్ స్పందించారు. "వారిని ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేసుకోనివ్వండి. వారు ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగలరు" అని కమల్‌నాథ్ అన్నారు. '50 శాతం కమీషన్' అంటూ మధ్యప్రదేశ్ ప్రభుత్వ అవినీతిపై ప్రియాంక, కమల్‌నాథ్‌లు చేసిన ట్విట్టర్ పోస్టులను ఇతర కాంగ్రెస్ నాయకులు రీట్వీట్ చేశారు.

నిరసన చేసిన ఆ ముస్లింలపై ఎన్ఎస్ఏ ప్రయోగం

- మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ : ఇస్లాం మతం విషయంలో సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టిన వ్యక్తిపై వివాదాస్ప నినాదాలు చేసిన కొందరు ముస్లింలపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం కఠినమైన జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ)ను ప్రయోగించనున్నది. రాష్ట్రంలోని రత్లాం జిల్లాలో కొంతమందిపై ఎన్ఎస్ఏ కింద శిక్షార్హమైన చర్యలు తీసుకుంటామని ఆ రాష్ట్ర మంత్రి నరోత్తమ్ మిశ్రా తెలిపారు.

ఈనెల 9న రత్లామ్‌లోని దీన్ దయాళ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీసు అవుట్‌పోస్ట్ వెలుపల ముస్లిం సమాజానికి చెందిన పెద్ద సమూహం గుమిగూడి ఇన్‌స్టాగ్రామ్‌లో తమ విశ్వాసానికి వ్యతిరేకంగా అభ్యంతరకరమైన కంటెంట్‌ను పోస్ట్ చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదరు వ్యక్తిపై కొన్ని వివాదాస్పద నినాదాలను వారు వినిపించారని పోలీసులు తెలిపారు. అయితే, ఈ నినాదాలు చేసిన నిరసనకారులను అరెస్టు చేస్తామనీ, ఎన్ఎస్ఏ కింద వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించటం గమనార్హం. మధ్యప్రదేశ్‌లోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదనీ, ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నదని సామాజికవేత్తలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. చంపుతామంటూ బహిరంగ బెదిరింపులకు దిగుతున్న హిందూత్వ శక్తులపై చర్యలు తీసుకోవటంలో మీనమేషాలు లెక్కిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. సంఘ్ సిద్ధాంతంతో ఒక వర్గాన్ని అణచివేయాలని చూస్తున్నదని వారు ఆరోపించారు.

మా గ్రామంలోకి రావద్దు

చండీఘర్ : హర్యానాలోని నూహ్‌లో గత నెల 31న చెలరేగిన మతపరమైన హింసాకాండ నేపథ్యంలో తమ గ్రామాలలోకి ముస్లింల ప్రవేశాన్ని నిషేధిస్తూ ఆ రాష్ట్రంలోని కొన్ని గ్రామ పంచాయితీలు తీర్మానాలు ఆమోదించాయి. వీటిపై విమర్శలు చెలరేగడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఆయా పంచాయితీలు, సర్పంచులకు షోకాజ్ నోటీసులు పంపింది. హర్యానా గ్రామ పంచాయితీరాజ్ చట్టంలోని సెక్షన్ 51 ప్రకారం ఏడు పంచాయితీలు, వాటి సర్పంచులకు సంబంధిత జిల్లా అధికారులు షోకాజ్ నోటీసులు పంపారని అధికారులు తెలిపారు. ఈ సెక్షన్ ప్రకారం పంచాయితీ పాలకవర్గాన్ని రద్దు చేయవచ్చు. లేదా సర్పంచ్‌ని పదవి నుండి తొలగించవచ్చు. పంచాయితీల నుండి సమాధానం అందిన తర్వాత వాటిని పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. మత సామరస్యాన్ని దెబ్బ తీసేందుకు ప్రయత్నించే వారిని ఉపేక్షించబోమని, తప్పనిసరిగా చర్య తీసుకుంటామని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. కాగా రేవరి, జజ్జర్, మహేంద్రఘర్ జిల్లాలలోని పలు గ్రామ పంచాయితీలకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయని ఓ వార్తా పత్రిక తెలిపింది. అయితే వీధి వ్యాపారుల పూర్వాపరాలు తెలుసుకునేందుకే షోకాజ్ నోటీసులు జారీ చేశామని సర్పంచ్‌లు వివరణ ఇచ్చారు. వీధి వ్యాపారులలో ఎక్కువ మంది ముస్లింలే కావడం గమనార్హం.

హవాయిలో 100 దాటిన కార్చిచ్చు మృతులు

హొనొలులు : హవాయి ద్వీపంలోని లాహైనా, మౌయిలు కార్చిచ్చుతో బూడిద కుప్పలుగా మారాయి. ఇప్పటివరకు ఈ ఘటనలో మరణించినవారి సంఖ్య 100 దాటినట్లు సంబంధిత అధికారులు ఆదివారం తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం వీలుందన్నారు. గత 100 ఏళ్లలో ఇంతటి తీవ్రమైన ప్రమాదం ఎన్నడూ చూడలేదని అమెరికాలోని ఫైర్ అడ్మినిస్ట్రేటర్ లోరీ మూర్ మెరిల్లీ పేర్కొన్నారు. "అగ్ని ప్రమాద తీవ్రతను తక్కువగా అంచనా వేశాము" అని హవాయి కాంగ్రెస్ మహిళా నేత జిల్ పేర్కొన్నారు. అగ్ని ప్రమాదం వల్ల విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడిందని అన్నారు. హవాయి ఎదుర్కొన్న అతిపెద్ద ప్రకృతి విపత్తు ఇదేనని మోయి గవర్నర్ జోష్ గ్రీన్ శనివారం పేర్కొన్న సంగతి తెలిసిందే. 2,200 నిర్మాణాలు పూర్తిగా కాలిపోయాయన్నారు. ఆస్తినష్టం సుమారు 6 బిలియన్ డాలర్లకుపైగా ఉంటుందని చెప్పారు.

సోషల్ మీడియా డీపీగా జాతీయ జెండా

- దేశ ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు
- ఆగస్టు 15 నుంచి 20 వరకు సెల్ఫీ పాయింట్లు



నవతెలంగాణ–న్యూఢిల్లీ బ్యూరో

77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆగస్టు 13 నుంచి 15 వరకు కేంద్రం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా దేశ ప్రజలకు ప్రధాని మోడీ ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. ప్రజలంతా తప్పకుండా తమ సోషల్ మీడియాల్లో డిపిగా జాతీయ జెండాను పెట్టుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం ఉదయం ట్వీట్ చేశారు. దేశం, మన మధ్య బంధాన్ని పెంచుకోవడానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని ప్రధాని తెలిపారు."స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో మనమంతా హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోషల్ మీడియా ఖాతాల డీపీలో జాతీయ జెండాను ఉంచుదాం. దేశానికి, మనకు మధ్య బంధాన్ని పెంపొందించే ఈ కార్యక్రమానికి మన వంతు మద్దతునిద్దాం"అని ప్రధాని మోడీ ట్వీట్లో పేర్కొన్నారు.

12 సెల్ఫీ పాయింట్లు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కొన్ని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పలు చోట్ల సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసి.. పోటీలు నిర్వహించి బహుమతులు కూడా అందించనుంది. ఈ విషయాన్ని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. 'వివిధ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి సెల్ఫీ పాయింట్లను దేశ రాజధానిలోని 12 ప్రదేశాల్లో ఏర్పాటు చేశాం. ఆ పాయింట్ల వద్ద ఫోటోలు తీసుకొని 'మై గవ్' పోర్టల్లో అప్‌లోడ్ చేయవచ్చు. ఈ పోటీలు ఆగస్టు 15 నుంచి 20 వరకు జరుగుతాయి. ఒకటి కంటే ఎక్కువ ఫోటోలను కూడా పంచుకోవచ్చు. సెల్ఫీలు పంపిన వారిలో 12 మందిని ఎంపిక చేసి ఒకొక్కరికి రూ.10 వేలు చొప్పున బహుమతి అందిస్తాం' అని రక్షణ శాఖ పేర్కొంది.

77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఉత్తరాఖండ్ లో ఓ మారుమూల గ్రామానికి చెందిన మహిళకు ఆహ్వానం పంపారు. ఆమె గత ఏడాదిలో మోడీకి యాపిల్ పచ్చడి పంపిన మహిళ. అయితే ఈ అతిథుల్లో గ్రామ సర్పంచులు (వైబ్రెంట్ విలేజెస్), పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం, పీఎం కౌశల్ వికాస్ యోజన పథకం లబ్దిదారులు కూడా ఉన్నారు. వీరితో పాటూ ఉపాధ్యాయులు, నర్సులు, మత్స్యకారులు, ఖాదీ రంగానికి చెందిన శ్రామికులు తదితరులను వేడుకలకు ఆహ్వానించినట్లు కేంద్ర రక్ష మంత్రిత్వ శాఖ తెలిపింది. 15 (మంగళవారం)న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ప్రధాని మోడీ జాతీయ పతాకాన్ని ఎగురవేసే కార్యక్రమంలో వీరందరూ పాల్గొంటారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆగస్టు 15 వేడుకలకు 1,800 మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించింది. దీంతోపాటు 17,000 మంది ఆహ్వానితులకు ఈ ఆహ్వానాలు అంద జేశారు.

స్వతంత్ర బాహ్య విచారణ జరిపించాలి

- హిండెన్‌బర్గ్ ఆరోపణలపై డెలాయిట్
- అదానీ గ్రూపు నుంచి ఆడిటర్ పదవికి రాజీనామా



న్యూఢిల్లీ : అదానీ గ్రూప్ కంపెనీలో అక్రమాల భాగోతం మరోసారి తెరపైకి వచ్చింది. అదానీ పోర్టుల వ్యవహారాలను క్షుణ్ణంగా పరిశీలించే లండన్‌కు చెందిన ప్రముఖ ఆడిట్ కన్సల్టెంగ్ సంస్థ డెలాయిట్ ఆడిటర్‌గా వైదొలగటానికి ముందు అదానీ గ్రూపుపై అమెరికన్ షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై స్వతంత్ర బాహ్య విచారణ జరిపించాలని కోరింది. అదానీ అవినీతి, అక్రమాలపై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలకు ఇది మరింత బలం చేకూర్చుతోందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మోడీ ప్రభుత్వం దన్నుతో హిండెన్‌బర్గ్ రిపోర్టును బేఖాతరు చేసిన అదానీ గ్రూపు ఇప్పుడు డెలాయిట్ చేసిన సూచనను కొట్టిపడేసింది. ఈ ఆరోపణలు ఏవీ ఆర్థిక నివేదికలపై ఎటువంటి ప్రభావమూ చూపలేదని అదానీ గ్రూపు తెలిపింది. ఆడిటర్ పదవికి రాజీనామా చేయటం కోసం డెలాయిట్ చూపిన కారణాలేవీ నమ్మశక్యంగా లేవని అదానీ గ్రూపు పేర్కొంది. డెలాయిట్ రాజీనామా వెనక పెద్ద కథే ఉందని, స్టాక్ మార్కెట్‌పై ఇది ప్రభావం చూపే అవకాశముందని పలువురు నిపుణులు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రధాని నరేంద్రమోడీ కానీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కానీ ఎలాంటి చర్యలకు ఆదేశించకపోవడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు.

కొన్ని నెలల క్రితమే ఆడిటర్‌గా పదవి పొడిగింపు

కొన్ని నెలల క్రితమే ఆడిటర్‌గా సమయం పొడిగింపు జరిగిన తర్వాత.. అదానీ గ్రూపుకు సేవలు అందించటం నుంచి డెలాయిట్ వైదొలగటం మార్కెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఇది అదానీ గ్రూపుపై కొంత ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేశారు.

'మేము అదానీ ఇతర కంపెనీలకు చట్టబద్ధమైన ఆడిటర్లము కాదు'

ఏపీసెజ్ ఆడిటర్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు ఆగస్ట్ 12 రాజీనామా లేఖలో డెలాయిట్ పేర్కొన్నది. "ఎందుకంటే మేము గణనీయమైన సంఖ్యలో ఇతర అదానీ గ్రూప్ కంపెనీలకు చట్టబద్ధమైన ఆడిటర్లం కాదు" అని అందులో వివరించింది. ఈ ఏడాది మార్చి, జూన్ నెలలతో ముగిసిన త్రైమాసికాల ఆర్థిక నివేదికల ఆడిట్‌లో తమ అర్హత కలిగిన అభిప్రాయాన్ని అందించినట్టు పేర్కొన్నది. ఏపీసెజ్.. 2024లో తన తదుపరి వార్షిక సాధారణ సమావేశం జరిగే తేదీ వరకు డెలాయిట్ స్థానంలో బీఓడీ ఇంటర్నేషనల్ స్వతంత్ర సభ్య సంస్థ అయిన ఎంఎస్‌కేఏ అసోసియేట్స్‌ను తన చట్టబద్ధమైన ఆడిటర్‌లుగా నియమించింది. కంపెనీ ఈ విషయాన్ని ఒక ఫైలింగ్‌లో తెలిపింది.

2017 నుంచి ఏపీసెజ్ ఆడిటర్‌గా డెలాయిట్

2017 నుంచి ఏపీసెజ్ ఆడిటర్‌గా ఉన్న డెలాయిట్‌కు గతేడాది జులైలో మరో ఐదేండ్ల పదవీకాలం పొడిగించబడింది. అయితే అదానీ గ్రూపుపై సంస్థ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై డెలాయిట్ ఆందోళన వ్యక్తం చేసింది. అయితే అదానీ గ్రూప్ అవన్నీ నిరాధారమైనవని బుకాయించింది. మోడీ ప్రభుత్వం కూడా అదానీని పూర్తిగా వెనకేసుకొచ్చింది.

స్వతంత్ర బాహ్య విచారణ లేనప్పుడు, సెబీ ద్వారా జరుగుతున్న విచారణ ఇంకా పెండింగ్‌లో ఉన్నందున తాము ఏమీ వ్యాఖ్యానించలేమని డెలాయిట్ తెలిపింది.

పెరుగుతున్న ఎరువుల ధరలు

కలవరపడుతున్న కమలనాథులు



న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘర్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఈ రాష్ట్రాలలో ఎలాగైనా అధికారాన్ని కైవసం చేసుకొని, ఆ ఊపుతో లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం కావాలని చూస్తున్న బీజేపీ అంతర్జాతీయంగా పెరుగుతున్న ఎరువులు, వాటి ముడి సరుకుల ధరలను చూసి బెంబేలెత్తుతోంది. దిగుమతి చేసుకుంటున్న టన్ను యూరియా ధర గత నెలలో 318–320 డాలర్ల నుండి 395–410 డాలర్లకు పెరిగింది. జూన్ చివరలో 285–290 డాలర్లుగా ఉన్న ధర ఆ తర్వాత భారీగా పెరిగింది. ఇక డీఏపీ ధర కూడా పెరుగుతోంది. జూలై రెండో పక్షంలో 435–440 డాలర్లుగా ఉన్న టన్ను ధర రెండు వారాలలోనే 480 డాలర్లకు చేరింది. ఇప్పుడు ఏకంగా 560 డాలర్లు పలుకుతోంది.

డీఏపీ తయారీలో ఉపయోగించే అమ్మోనియా ధర సైతం పైపైకి ఎగబాకుతోంది. గత 45 రోజుల వ్యవధిలోనే దీని టన్ను ధర 300–310 డాలర్ల నుండి 400–405 డాలర్లకు పెరిగిపోయింది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ఎరువుల ధరలు బాగా పెరిగాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇదే ధోరణి కొనసాగితే అంతర్జాతీయ సరఫరాదారులు నిర్ణయించుకున్న దిగుమతి ధరలో తిరిగి మార్పులు చేసే అవకాశం ఉన్నదని వివరించాయి. ఇదిలావుండగా మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ధర మాత్రం తగ్గుతోంది. మార్చిలో 590 డాలర్లుగా ఉన్న టన్ను ధర ఏప్రిల్–జూన్ మధ్యకాలంలో 422 డాలర్లకు తగ్గింది.

పెరుగుతున్న ఎరువుల ధరల కారణంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రధానంగా రెండు సమస్యలను ఎదుర్కొంటోంది. మొదటిది ఆర్థికపరమైనది. 2023–24 కేంద్ర బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీకి రూ.1,75,100 కోట్లు కేటాయించింది. ఇందులో ఏప్రిల్–జూలై త్రైమాసికంలో కేవలం రూ.45,112.53 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి. మిగిలిన మొత్తాన్ని మిగిలిన తొమ్మిది నెలల కాలంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. అంటే సబ్సిడీ బిల్లు పెరుగుతుంది. ఇక రెండో కారణం రాజకీయాలు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై ఎరువుల ధరలు ప్రభావం చూపుతాయని బీజేపీ ఆందోళన చెందుతోంది. రైతులు కన్నెర్ర చేస్తే ఎన్నికలలో విజయం సాధించడం మాట అటుంచి ఘోర పరాభవాన్ని మూటకట్టుకోవాల్సి వస్తుంది.

పాకిస్తాన్‌లో చైనా ఇంజినీర్లపై తీవ్రవాదుల దాడి

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లోని చైనాకు చెందిన ఇంజినీర్ల కాన్వాయ్‌పై తీవ్రవాదులు దాడి చేశారు. పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లో ఓడరేవు నగరమైన గ్వాదర్‌లో ఆదివారం ఈ దాడి జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రవాదులను కాల్చిచంపినట్లు అధికారులు తెలిపారు. చైనా ఇంజనీర్‌లకు ఎలాంటి గాయాలు కాలేదని అన్నారు. చైనా –పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్ (సిపిఇసి)లో పెద్ద సంఖ్యలో చైనీయులు పనిచేస్తున్నారు. గ్వాదర్‌లో చైనా ఇంజినీర్లకు చెందిన కాన్వాయ్‌పై బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) కాల్పులు జరిపినట్లు తెలిపారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది దాడిని ప్రతిఘటించాయని, సుమారు రెండు గంటల పాటు కాల్పులు చోటుచేసుకున్నాయని అన్నారు. ఓ చైనా ఇంజినీరు, భద్రతా సిబ్బంది ఒకరు గాయపడినట్లు సమాచారం. ఈ కాల్పుల్లో ఇద్దరు తీవ్రవాదులు మరణించినట్లు తెలిపారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పాకిస్తాన్ సెనేటర్ సర్ఫరాజ్ బుగ్తీ పేర్కొన్నారు.

మూడేండ్ల తర్వాత గ్రీవెన్స్

- నేటి నుంచి ప్రజా సమస్యలను విననున్న కలెక్టర్
- కొవిడ్–19తో మూగబోయిన ప్రజావాణి
- ఇక నుంచి ప్రతి సోమవారం నిర్వహణ
- ప్రతి దరఖాస్తుదారుడి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు
- హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఏర్పాట్లు



నవతెలంగాణ–సిటీబ్యూరో

గడిచిన మూడేండ్లుగా హైదరాబాద్ కలెక్టర్ కార్యాలయంలో మూగబోయిన ప్రజావాణి నేటి నుంచి ప్రారంభం కానుంది. కరోనా వైరస్ తీవ్రత కారణంగా 2020 మార్చి నుంచి ప్రజావాణికి బ్రేక్ పడింది. మధ్యలో ఈ ఏడాది మే మాసంలో రెండు వారాలపాటు ప్రజావాణి నిర్వహించి.. కలెక్టరేట్ తరలింపుతో బంద్ పెట్టారు. మళ్లీ ఇన్నాండ్ల తర్వాత ప్రతి వారం ప్రజావాణి నిర్వహించేందుకు హైదరాబాద్ జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. ఇందులో వచ్చే ప్రతి దరఖాస్తుదారుడి సమస్యలను పరిష్కరించే విధంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలతో అధికారులు ప్రజావాణిని పకడ్బందీగా చేపట్టనున్నారు. హైదరాబాద్ జిల్లాలో కోవిడ్–19 ప్రభావంతో ప్రజావాణి నిర్వహించకపోవడంతో నగరవాసులు తమ సమస్యలు ఎవరికి విన్నవించుకోవాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రజావాణి లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు తమ అర్జీలను పట్టించుకునేవారు కాదు. దీంతో సమస్యలు ఎక్కడికక్కడ అపరిష్కృతంగా మిగిలిపోయాయి. ముఖ్యంగా డబుల్ బెడ్ రూం ఇండ్లు, సదరం సర్టిఫికెట్స్, ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సంక్షేమ రుణాలు, దళితబంధు, విద్యార్థుల స్కాలర్‌షిప్స్, సర్టిఫికెట్లు తదితర సమస్యలపై నిత్యం ప్రజలు కలెక్టరేట్‌కు వస్తుంటారు. గ్రీవెన్స్ సెల్ నిర్వహించకపోవడంతో జనం తమ అర్జీలు ఎవరికి సమర్పించాలో తెలియక అక్కడున్న సిబ్బందికి ఇచ్చి వెళ్లేవారు. అలా ఇచ్చే దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఏమైనా అత్యవసర సమస్యలు ఉంటే కలెక్టర్‌ను నేరుగా కలిసి తమ గోడు వెళ్లబోసుకునేవారు. మళ్లీ ఇన్నాండ్ల తర్వాత ప్రజావాణి పున:ప్రారంభమవుతుండటంతో దరఖాస్తుదారులు కలెక్టరేట్‌కు క్యూ కట్టనున్నారు. సాధారణ రోజుల్లోనే ప్రజావాణికి పెద్దఎత్తున్న జనం బారులు తీరుతుంటారు. ఇకపై ప్రభుత్వం చేపడుతున్న కీలక సంక్షేమ పథకాలైన గృహలక్ష్మి, దళితబంధు, బీసీ, మైనార్టీలకు రూ.లక్ష సాయం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, డబుల్ ఇండ్లకు సంబంధించిన దరఖాస్తులు భారీగా రానున్నాయి. వీటితో పాటు నోటరీ భూముల క్రమబద్ధీకరణ, ఇతర భూసమస్యలతో పాటు ఇతర సంక్షేమ పథకాల కోసం అర్జీదారులు నేటి నుంచి ప్రతి సోమవారం కలెక్టరేట్ బాట పట్టనున్నారు.

ముచ్చటగా రెండు వారాలు..!

కరోనా నేపథ్యంలో అన్ని కలెక్టరేట్ల మాదిరిగా హైదరాబాద్‌లో సైతం 2020 మార్చి నెల నుంచి ప్రజావాణి కార్యక్రమం నిలిచిపోయింది. ఆ ఏడాది ఆగస్టు నుంచి ఈ–ఆఫీస్ ద్వారా కాగితరహిత పాలనకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత కలెక్టరేట్ ప్రవేశమార్గం వద్ద ప్రత్యేక బాక్స్ ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించగా.. మండలాల్లోనూ తహసీల్దార్ల ఆఫీసుల్లో బాక్స్‌లు, వాట్సాప్, ఈ–మెయిల్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించారు. కరోనా వైరస్ ప్రభావం తగ్గిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్లలో ప్రజావాణి కార్యక్రమం పునరుద్ధరించారు. కానీ హైదరాబాద్ జిల్లాలో పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. అయితే, గత మే నెలలో 8, 15వ తేదీల్లో రెండు వారాలపాటు ప్రజావాణి నిర్వహించారు. ఆ తర్వాత అబిడ్స్‌లోని కలెక్టరేట్‌ను ప్రస్తుత రంగారెడ్డి కలెక్టరేట్‌కు తరలిస్తున్నామనే సాకుతో నిలిపివేశారు.

దాదాపు మూడేండ్ల నుంచి గ్రీవెన్స్ సెల్ లేకపోవడంతో దరఖాస్తుదారులు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌కు రానున్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి

హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజావాణి నిర్వహిస్తున్నాం. దరఖాస్తులతో వచ్చిన అర్జీదారుల సమస్యలను తెలుసుకొని తగిన చర్యలు తీసుకుంటాం. ప్రాధాన్యత గుర్తించి వచ్చిన విజ్ఞప్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించాం.

కాలనీ అభివృద్ధికి కృషి చేస్తా : కార్పొరేటర్



నవతెలంగాణ- వనస్థలిపురం

కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాయత్రీ నగర్ ఫేస్ 2 కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం సభ్యులు ఆదివారం కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్యవర్గం సభ్యులు కాలనీ అభివృద్ధి, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన కార్పొరేటర్..త్వరలోనే కాలనీలోని ప్రతి సమస్యనూ పరిష్కారించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

10కే రన్‌ను ప్రారంభించిన శ్రీనివాస్ గుప్త



నవతెలంగాణ- నాగోల్

హైదరాబాద్ నగరంలోని నెక్లెస్ రోడ్‌లో ఉన్న ట్యాంక్ బండ్ వద్ద లైఫ్ ఏపీ ఆధ్వర్యంలో ఆదివారం 10కే రన్ ఇండిపెండెన్స్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ 10కే రన్‌ను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్త ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నీలేష్ యాదవ్, రఘు, శివ, రీచర్డు వేణు, పలువురు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో మేజర్ సమస్యల్లేవ్



- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-వనస్థలిపురం

ఇతర డివిజన్లతో పోల్చుకుంటే వనస్థలిపురం డివిజన్‌లో మేజర్ సమస్యలు లేవని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఆదివారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని క్రాంతి హిల్స్ కమ్యూనిటీ హాల్లో వివిధ కాలనీ సంక్షేమ సంఘం సభ్యుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డివిజన్‌లో ఉన్న చిన్న చిన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. దాదాపు అన్ని కాలనీల్లో రోడ్ల నిర్మాణ పనులు పూర్తి అయినట్లు తెలిపారు. గతంలో వేసిన డ్రైన్స్ స్థానంలో నూతన డ్రైన్స్ నిర్మిస్తామన్నారు. యోగా చేసుకోవడానికి మహిళలకు, పురుషులకు వేరువేరుగా నిర్మాణాలు చేపడుతామని అన్నారు. లోవోల్టేజ్ సమస్యలు, కరెంట్ పోల్స్ ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి..నూతన ట్రాన్స్ఫార్మర్స్, కరెంటు పోల్స్‌లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దెబ్బతిన్న బీటీ, సీసీ రోడ్ల స్థానంలో నూతన రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ స్థలం ఉన్న కాలనీల యందు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఓపెన్ జిమ్స్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. వర్షపునీరు చేరడం వలన కొన్ని కాలనీలు ముంపునకు గురయ్యాయని ..ఈ సమస్య పరిష్కారం కోసం బాక్స్ డ్రైన్స్ పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. వృధాగా ఉన్న పార్కులను అభివృద్ధి చేసి, అందులో బోరు వేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్, ఉద్యమకారులు కుంట్లూరు వెంకటేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని శ్రీధర్ గౌడ్, ఖైసర్, మధు గౌడ్, జైపాల్ రెడ్డి, ఆనంద్ రాజ్, పీ.వీ.రావు, నవీద్, సంతోష్ వివిధ కాలనీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వివిధ పార్టీల నుండి కాంగ్రెస్‌లోకి చేరికలు



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి సమక్షంలో గడ్డి అన్నారం సీనియర్ నాయకులు బద్దుల వెంకటేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు బద్దుల వేణు యాదవ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం వివిధ పార్టీల నుండి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మల్ రెడ్డి రాంరెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తర్వాత రాంరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. నిత్యావసర ధరలు ఆకాశానంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్లు లేని వారికి ఇండ్లు కట్టిస్తామన్నారు. రూ.500లకే గ్యాస్ సిలెండర్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, నర్సింహా యాదవ్, మంజుల రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మళ్లారపు శ్రీనివాస్, శశిధర్ రెడ్డి, మక్సూద్ అలీ, రమేష్ నాయక్, జైపాల్ రెడ్డి, వెంకట్ రామ్ రెడ్డి, సత్యనారాయణ, చంద్ర యాదవ్, గోవర్ధన్, ఝాన్సీ, వసంత, సాయి, శివ, రాము, శ్రీను, ఇమ్రాన్, సూర్య, నరేందర్, మల్లేష్, సుమన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతీక తీజ్



- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్ పేట్

గిరిజనుల సంస్కృతి సాం ప్రదాయాలను ప్రతీక తీజ్ ఉత్స వాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డిలు అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 13వ డివిజన్ బాలాజీ నగర్‌లో మేరమ్మ యాడి అసో సియేషన్ ఆధ్వర్యంలో జరిగిన బంజారాల 'తీజ్ ఫెస్టివల్' ఉత్సవాలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో కుల, మతాలకు అతీతంగా పండువలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తు న్నారని కొనియాడారు. దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎస్.బాలు నాయక్, మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, మాజీ సర్పంచ్ బొర్ర జగన్ రెడ్డి, ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి, మాధవరెడ్డి, నాయకులు శ్రీనివాస్ యాదవ్, గిరిజన నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా బస్ పాసులు అందజేసిన మల్‌రెడ్డి



నవతెలంగాణ -ఎల్బీనగర్

కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి తన సొంత నిధులతో 1200 మంది వికలాంగులకు ఉచితంగా ఆదివారం బస్ పాసులను అందజేశారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ ఎవరు కూడా వికలాంగులపై చిన్న చూపు చూపవద్దని సూచించారు. సమాజంలో అందరితో పాటు వీరి అభివృద్ధిని కాంక్షించాలని కోరారు. సామాజిక సమైక్యతలో భాగంగా వికలాంగులు, సాధారణ వ్యక్తుల మధ్య వివాహాలను ప్రోత్సహించాలని అన్నారు. వికలాంగుల పిల్లలలో ఉత్సాహం నింపడానికి ఆటల పోటీలను నిర్వహించాలి. వీటి వలన వారిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. ఇంకా బ్రెయిలీ పలకలు, లాప్‌టాప్స్, స్మార్ట్ ఫోన్లు, ప్రభుత్వ పథకాలు వంటివి అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగులకు ఇల్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు.

హైదరాబాద్-2 అసిస్టెంట్ డిపో మేనేజర్ ఉషాశ్రీ మాట్లాడుతూ..దివ్యాంగులకు బస్ పాసులు ఇప్పించాలని మల్ రెడ్డి రాంరెడ్డిని సంప్రదించినప్పుడు తాను సానుకూలంగా స్పందించి తక్షణమే వాటిని ఇప్పించారని తెలిపారు. ఇంకా అవసరమైతే ఎక్కువ మందికి పాసులు ఇప్పించడానికి సిద్ధంగా ఉన్నందుకు రాంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

హయత్ నగర్ డిపో మేనేజర్ రఘు మాట్లాడుతూ మల్ రెడ్డి బ్రదర్స్ పేదల కోసం పరితపించే నాయకులని, ఆర్టీసీ విషయంలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. మల్ రెడ్డి రాంరెడ్డి తన సొంత నిధులతో తుర్కయంజాల్ లో బస్సు షెల్టర్, హయత్ నగర్‌లో శిథిలావస్థలో ఉన్న బస్ షెల్టర్ పునర్నిర్మాణం చేశారని గుర్తు చేశారు.

దివ్యాంగుల నాయకురాలు దివ్య మాట్లాడుతూ బస్సులు ఎక్కేటప్పుడు డ్రైవర్లు వికలాంగులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, శ్రీపాల్ రెడ్డి, వేణు యాదవ్, నర్సింహా యాదవ్, మంజుల రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మక్సూద్ అలీ, రమేష్ నాయక్, జైపాల్ రెడ్డి, హైదరాబాద్-2 డిపో మేనేజర్ కృష్ణ మూర్తి, అసిస్టెంట్ డిపో మేనేజర్ ఉషాశ్రీ, అంజయ్య, శివరాజా, ప్రమోద్, హయత్ నగర్ డిపో మేనేజర్ రఘు, మహిపాల్, నాగమణి, విద్యావతి, వసంత, సుజాత, సూర్య నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరీ బాధ్యత

- ఉప్పల శ్రీనివాస్ గుప్తా



నవతెలంగాణ -వనస్థలిపురం

పర్యావరణ పరిరక్షణ మన అందరీ బాధ్యత అని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. వనస్థలిపురం, వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం స్త్రీ హస్తిన మహిళా మండలి, జాగృతి పర్యావరణ పరిరక్షణ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుమారు 200 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో నా పాత్ర అనే కార్యక్రమం పై స్వీయ విశ్లేషణ, అభిప్రాయం వ్యక్తం చేస్తూ...ఆన్లైన్‌లో ఈ నెల ఒకటి నుంచి తొమ్మిది వరకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేసినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం మన తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ హరితహారం లాంటి గొప్ప కార్య క్రమం చేపట్టి..కోట్లాది మొక్కలను నాటించినట్లు కొనియా డారు. రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో చెట్లు నాటే కార్యక్రమాన్ని భగీరథ ప్రయత్నంలా కొనసాగించడం చాలా అభినందనీయం అన్నారు. పర్యావరణం రాను రాను క్షీణిస్తోందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరీపై ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని, వాట్సాప్ ద్వారా పంపిం చాలని గ్రీన్ ఛాలెంజ్ విసిరారు. ఈ కార్యక్రమంలో భావన శ్రీనివాస్, డాక్టర్ పూర్ణశాంతి, లక్ష్మి, ఇస్మాయిల్ వెంకట్రావు విద్యార్థులు, తల్లీదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కో ఆపరేటివ్
సొసైటీ డైరెక్టర్‌గా మహిపాల్ నాయక్



నవతెలంగాణ - బడంగ్ పేట్

రాచకొండ పోలీస్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికల్లో...ఎస్టీ, ఎస్సీల పక్షాన రాచకొండ పరిధిలోని పోలీస్ డిపార్ట్మెంట్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్‌గా గుర్రంగూడకు చెందిన మహిపాల్ నాయక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం రాచకొండ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని మహిపాల్ నాయక్ అందుకున్నారు. ఈ సందర్భంగా మహిపాల్ నాయక్ మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో జరిగిన పోలీస్ సొసైటీ ఎన్నికల్లో నాకు మద్దతు ఇచ్చి.. నా విజయం కోసం కృషి చేసిన పోలీస్ మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పోలీసుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గాడ్గే
రజక సంఘం ఆధ్వర్యంలో బస్తీబాట



నవతెలంగాణ -నాగోల్

హైదరాబాద్ నగరంలో రజకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలుసుకునేందుకు తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెద వుర బ్రహ్మయ్య ఆధ్వర్యంలో బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివారం నాగోలు డివిజన్లోని సాయి నగర్ కాలనీ, లలిత నగర్ కాలనీ, ఆదర్శ నగర్ కాలనీ, ఆపరేటివ్ బ్యాంకు కాలనీ, గణేష్ నగర్ కాలనీ, బండ్లగూడ తోపాటు పలు కాలనీల్లో ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో తిరుగుతూ రజకులకు ప్రభుత్వ పథకాల గురించి వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత 250 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించుకోవాలని రజకులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న గృహ లక్ష్మి, బీసీ బంధు, తదితర ప్రభుత్వ పథకాలకు సకాలంలో దరఖాస్తులు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని అనానరు. కలిసికట్టుగా ఐక్యంగా సమిష్టితో ప్రభుత్వంతో పోరాడి మన హక్కులను, సమస్యలను సాధించుకునేందుకు రాజకీయాలకు అతీతంగా రజకులంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ బస్తీ బాటలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్నాల మడేలు, సంయుక్త కార్యదర్శి పడ్నాల రాములు, గ్రేటర్ అధ్యక్షులు పగడాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రుచికరమైన వంటకాలతోనే ప్రజాదరణ

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి





నవతెలంగాణ- బడంగ్ పేట్

నేటి సమాజంలో రుచికరమైన వంటకాలతోనే ప్రజాదరణ పొంది ఆర్థికాభివృద్ధి చేకూరుతుందని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సుల్తాన్ పూర్ ఎయిర్ పోర్ట్ రోడ్‌లో నూతనంగా నిర్మించిన లాస్ట్ ఎగ్జిట్ డ్రైవ్ ఇన్ రెస్టారెంట్‌ను మేయర్ ప్రారంభించి మాట్లాడారు. చదువుకున్న నిరుద్యోగ యువకులు ఎంతో మంది యువకులకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌వి ప్రజా వ్యతిరేక విధానాలు'



నవతెలంగాణ - ఎల్బీనగర్

బీఆర్‌ఎస్ పార్టీవి ప్రజా వ్యతిరేక విధానాలు అని సామ రంగా రెడ్డి అన్నారు. ఇంటింటికీ బీజేపీ అనే కార్యక్రమాన్ని గడ్డిఅన్నారం డివిజన్‌లో సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో సరూర్ నగర్ చెరువు శారదా థియేటర్ దగ్గర నుండి శ్రీ కోదండరాం నగర్, పీ అండ్ టీ కాలనీలో కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డితో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సామ రంగా రెడ్డి మాట్లాడుతూ..తొమ్మిది సంవత్సరాల కేంద్ర ప్రభుత్వ సుపరిపాలనలో ప్రజలు సురక్షితంగా ఉన్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసపూరితమైన పాలన అందిస్తూ, ప్రజలను మోసం చేయడమే అజెండాగా పరిపాలన కొనసాగిస్తుందని విమర్శించారు. కోదండరాం నగర్ కాలనీలో ముంపు సమస్య ఎక్కువగా ఉందన్నారు. దీనికి కారణం చెరువులకు పరిరక్షణ లేకపోవడం అని విమర్శించారు. తెలంగాణాలో మొత్తం గొలుసుకట్టు చెరువులు కబ్జాలకు గురవుతున్నాయని ఆరోపించారు. అందుకే హస్తినాపురం లోని 16 ఎకరాల చేపల చెరువు కబ్జాకి గురై వర్షం వచ్చిన ప్రతి సారీ శ్రీ కోదండరాం నగర్ కాలనీ, పీ అండ్ టీ కాలనీలు నీట మునుగుతున్నాయన్నారు. ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కోసం సభలు, సమావేశాలు పెట్టి, బాక్స్ డ్రైన్ నాలాలు కనీసం 30శాతం కూడా పూర్తి చేయకుండా అంతా అభివృద్ధి చేశామని స్థానిక ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. గ్రావిటీ లెవల్ సరిపోకపోవడంతో లెవల్స్ కలవక బాక్స్ డ్రైన్ నాలాలు నిరుపయోగంగా ఉండిపోతున్నాయన్నారు. దీంతో కాలనీలు నీట మునిగి ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తున్నాయని..8 సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసుకున్న డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిశీలన, బీసీ బంధు, గృహలక్ష్మి వంటి స్కీంలతో మరోసారి మోసానికి తెర లేపారన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికలలో బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జయ ప్రకాష్ శ్రవణ్ గౌడ్, శ్రీధర్ రెడ్డి, పుట్ట ఓంకార్ బండి నిర్మల, శివ రామ్, సందీప్, రామ్ రెడ్డి, జయ లక్ష్మి, రాజేశ్వరి, లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సరూర్ నగర్‌లో ఇంటింటికీ కాంగ్రెస్



నవతెలంగాణ - ఎల్బీనగర్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం సరూర్ నగర్ డివిజన్‌లో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ అనే కార్యక్రమాన్ని నిర్వహించినారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతన్నారని.. ప్రజలను చైత్యవంతం చేయడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తెలిపారు. డివిజన్‌లో భగత్ సింగ్ నగర్ ఫేస్ 1, ఫేస్ 2, శంకర్ నగర్ అండ్ ఇంద్ర హిల్స్, వికాస్ నగర్, క్రాంతి నగర్, జేబీ కాలనీ, డాక్టర్స్ కాలనీ, హుడా కాంప్లెక్స్, హుడా కాలనీ, పంజల అనిల్ కాలనీ, చెలకు తోట కాలనీ, అంబేద్కర్ నగర్ కాలనీ, నరసింహ పూరి కాలనీలలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిక్కుళ్ళ శివ ప్రసాద్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లెంకి ధనరాజ్ గౌడ్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ గుల్షన్, సెక్రటరీ, ఇమ్రాన్ అలీ, తాండ్ర భాస్కర్, ఐతరాజు రమేష్, సంతోష్ కుమార్, అరుణ, సుశీల, రవళి, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందించాలి

- జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ అరుణ్ హల్దర్



నవతెలంగాణ - మీర్ పేట్

మలక్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి.. మరణించిన బాధిత కుటుంబానికి వెంటనే నష్టపరిహారం అందించాలని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ అరుణ్ హల్దర్, జాతీయ ఎస్సీ కమిషన్ రీజినల్ డైరెక్టర్ సునీల్ కుమార్ బాబు హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం మీర్ పేట్ కార్పొరేషన్ పరిధిలోని మురళీ కృష్ణ నగర్‌లో ఉన్న మృతుడు విజయ్ కుటుంబాన్ని వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 రోజుల కిందట మలక్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో విజయ్ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించి.. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మరణించారని విచారం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ చట్టప్రకారం బాధిత కుటుంబానికి వెంటనే పరిహారం అందించాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరారు. మృతుడు విజయ్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, పెన్షన్, నిత్యవసర సరుకులు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, తక్షణ సాయం కింద 4లక్షల 15 వేల 500 రూపాయల నగదును వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం నిందితులను కఠినంగా శిక్షించాలని సౌత్ జోన్ డీసీపీ రూపేష్ ఐపీఎస్‌ను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అన్ని రకాలుగా జాతీయ ఎస్సీ కమిషన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కందుకూర్ ఆర్డీవో సూరజ్, బాలాపూర్ ఎమ్మార్వో మాధవి రెడ్డి, మీర్ పేట్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఇతర శాఖల అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన బాధ్యులను శిక్షించాలి



నవతెలంగాణ - మీర్‌పేట్

మణిపూర్ రాష్ట్రంలో క్రిస్టియన్ మహిళలపై లైగింక దాడులకు పాల్పడుతున్న వ్యక్తులను వెంటనే గుర్తించి..చట్టపరంగా శిక్షించాలని బడంగ్ పేట్, మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ యునైటెడ్ క్రిస్టియన్ చర్చెస్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం మణిపూర్ ఘటనకు నిరసనగా మీర్ పేట్ చౌరస్తా నుండి లలిత నగర్ చౌరస్తా, బీజేపీ క్వార్టర్స్ బాలాపూర్ చౌరస్తా, బడంగ్ పేట్ అంబేద్కర్ విగ్రహం వరకు యునైటెడ్ క్రిస్టియన్ చర్చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్స్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డిలు మాట్లాడుతూ.. మణిపూర్ రాష్ట్రంలో క్రిస్టియన్ మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, అరాచకాలకు అంతులేకుండా పోయిందన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. భారతదేశం అన్ని మతాలకు సమానమన్నారు. క్రైస్తవులకు మణిపూర్ రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి క్రైస్తవులకు రక్షణగా ఉండాలని కోరారు. ఈ ర్యాలీలో పాస్టర్ జే ఇమ్మానియేల్, రాజారత్నం, మస్కు రమేష్, జాషువా, సాయిలు, ఓనిసిఫర్, మీర్ పేట్ కార్పొరేషన్ క్రిస్టియన్ అశోక్, ప్రధాన కార్యదర్శి అరుణ జ్యోతి, పాస్టర్ దయాకర్ లాజర్, క్రైస్తవ సంఘాలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

లోటస్ ల్యాబ్ విద్యాసంస్థల 3కే రన్



నవతెలంగాణ -వనస్థలిపురం

లోటస్ ల్యాబ్ పబ్లిక్ స్కూల్స్ వనస్థలిపురం, కమలానగర్, హయత్ నగర్, తుర్కయంజాల్ బ్రాంచీల విద్యార్థులు, సిబ్బంది, విద్యార్థుల తల్లీదండ్రులు సుమారు 200 మందితో 3కే రన్ అనే కార్యక్రమాన్ని ఆదివారం వనస్థలిపురం లోటస్ ల్యాబ్ పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్స్ కొప్పుల నరసింహారెడ్డి, నవజీవన్ రెడ్డి, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త మౌలానా బాబా, పాఠశాల చైర్మన్ ఏ. శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ మంజులా రెడ్డిలు హాజరయ్యారు. పాఠశాల చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మాట్లాడుతూ ఈ 3కే రన్ సాయిబ్ నగర్, వైదేహి నగర్, ఎస్ కే డీ నగర్, ఎన్జోస్ కాలనీ మీదగా మూడు కిలోమీటర్లు సాగిందన్నారు. జాతీయ విద్యా విధానం ముందుకు తీసుకెళ్లడం, బట్టి విధానానికి స్వస్తి పలికి పాఠశాలలు పరిశోధన, ఆచరణ విధానాలకు నాంది పలకాలని అన్నారు. తల్లీదండ్రులు మార్కుల విద్యకు బదులు నాణ్యత, విలువలతో కూడిన విద్యను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల జోనల్ ప్రిన్సిపాల్ ఉషాకిరణ్, జోనల్ వైస్ ప్రిన్సిపాల్ ఫాతిమా, ప్రిన్సిపాల్స్ మహాలక్ష్మి, లక్ష్మీ, ప్రియా, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

'శరవేగంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులు'



నవతెలంగాణ- బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న శ్రీరాం కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని 18వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం శ్రీరామ కాలనీ 18వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానికులతో కలిసి కౌన్సిలర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ జల్‌పల్లి మున్సిపల్‌లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఇప్పటికే కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులను మంజూరు చేసిందని కొనియాడారు. ముఖ్యంగా పలు కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, మిషన్ భగీరథ పథకంలో ఇంటింటికీ తాగునీటి సరఫరా పైపులైన్ నిర్మాణ పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. శరవేగంగా సాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



నవతెలంగాణ-కాప్రా

జమ్మిగడ్డలోని భరత్ నగర్ కాలనీకి చెందిన తిప్పరపోయిన చందు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలతో ట్రస్ట్ సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రస్ట్ ద్వారా బండారి లక్ష్మారెడ్డి అనేక సేవా సామజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు లక్ష్మీనారాయణ, జానకి రాములు, నర్సింహా, వెంకటేశ్, సత్యనారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జనప్రియ అపార్ట్‌మెంట్‌లో సిల్వర్ జూబ్లీ వేడుకలు



నవతెలంగాణ-ఉప్పల్

రామంతపూర్ డివిజన్‌లోనిన జనప్రియ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలకు మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్ణ నాగేశ్వరావు, ఉప్పల్ సీఐ గోవిందరెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్ణ మాట్లాడుతూ.. అపార్ట్‌మెంట్‌లోని సభ్యులందరూ ఐక్యమత్యంతో కలిసిమెలిసి ఉండాలని సూచించారు. సమస్యలను పరిష్కరించుకునేలా అందరూ ఒకే తాటిపై ఉండాల న్నారు. జనప్రియ అపార్ట్‌మెంట్‌లోని సమస్యలను పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని జీఆర్ రెడ్డి నగర్, బీజే ఆర్ నగర్, స్వామి రెడ్డి నగర్, భగత్ నగర్, సాయి లోక్ కాలనీ, జై కిసాన్ నగర్, దేవీనగర్, శివ సాయి నగర్, విరాట్ నగర్, మారుతీనగర్, జై జవాన్ కాలనీల్లోని బస్తీ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పాదయాత్ర చేశారు. ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని జీహెచ్ ఎంసీ అధికారులను ఆదేశించారు. జీఆర్‌రెడ్డి నగర్‌లో సీనియర్ సిటిజన్ బిల్డింగ్, కమ్యూనిటీ హాల్ నిర్మించాల ని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. బీజేఆర్ నగర్‌లో బోర్‌వెల్స్ రిపేర్ చేయించి, పురాతన డ్రయినేజీ పైపులైను ఆధునీకరణ, సీసీరోడ్లు నిర్మాణం చేయాలని కోరారు. వంగిపోయిన స్తంభాలను ఆధునీ కరించి వేలా డుతున్న విద్యుత్ వైర్లను సరి చేయిం చాలన్నారు. పారిశు ధ్య నిర్వహణ, విద్యుత్ దీపాల ఏర్పాటు చేయించాలని కోరారు. జమ్మిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వెయిటింగ్ హాల్ కోసం షెడ్ నిర్మాణం చేయించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే వెంట ఏఎస్‌రావు నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్దాపురం కుమార స్వామి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు, గుండారపు శ్రీనివాస్ రెడ్డి, బేతాళ బాలరాజు, కందుల లక్ష్మీనారాయణ ఏనుగు సీతారాం రెడ్డి మురళీ పంతుల, స్థానిక కాలనీవాసులు ఉన్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణం అభినందనీయం

శివసాయి నగర్ సంక్షేమ సంఘం, కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం అన్ని హంగులతో నిర్మించుకోవడం అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి శివ సాయి నగర్‌లోని శివ సాయి దేవాలయ ప్రాంగాణంలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, కాసం మైపాల్ రెడ్డి, సంక్షేమ సంఘం ప్రతినిధులు, బర్ల రామచంద్రారెడ్డి, కొండగళ్ల అశోక్, నారాలక్ష్మీనారాయణ, చక్రపాణి ఉన్నారు.



కిడ్నీలు, ప్రోస్టేట్ ఆరోగ్యం విషయంలో జాగ్రత్త

- 50 దాటాక ప్రతియేటా పరీక్షలు తప్పనిసరి
- బీపీ అదుపుతో కిడ్నీలు చాలా వరకు సురక్షితం
- చింతలకుంటలో ఏఐఎన్‌యూ వైద్యుల సూచనలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇటీవలి కాలంలో తరచూ ప్రోస్టేట్ సంబంధిత సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని, వీటి విషయంలో అప్రమత్తంగా ఉంటూ తగిన వైద్య పరీక్షలు చేయించుకోవడమే మార్గమని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) వైద్యులు సూచించారు. చింతలకుంటలోని వాసవీ శ్రీనిలయం గేటెడ్ కమ్యూనిటీలో ఆదివారం అవగాహనా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాదాపు వంద మంది హాజరవ్వగా, అందరికీ పీఎస్ఏ (ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్) పరీక్షలు, సీరం క్రియాటినైన్ పరీక్షలు చేశారు. అనంతరం ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ యూరాలజిస్టు డాక్టర్. సుభాష్ చంద్రబోస్, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టు డాక్టర్. శ్రీకాంత్ ఈ అంశాలపై కమ్యూనిటీ వాసులకు అవగాహన కలిగించారు. డాక్టర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ, "మూత్రం సరిగా రాకపోవడం, పూర్తిగా ఆగిపోవడం, లేదా మూత్రంలో రక్తం కనిపించడం లాంటి సమస్యలు ఉంటే దాన్ని ప్రోస్టేట్ సమస్యగా గుర్తించాలి. తల్లిదండ్రుల్లో ఎవరికైనా ప్రోస్టేట్ క్యాన్సర్ ఉంటే పిల్లలకూ వచ్చే అవకాశం ఉంటుంది. ఇటీవలి కాలంలో 60 ఏండ్లు దాటిన వారికి ఈ తరహా సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ క్యాన్సర్ రావడానికి కారణం ఇదీ అని స్పష్టంగా చెప్పలేం. అయితే, పీఎస్ఏ పరీక్ష మాత్రం 50 ఏండ్లు దాటిన వారంతా ఏడాదికోసారి పరీక్ష చేయించుకుంటే ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి, తగిన చికిత్సలు చేయవచ్చు. కొందరిలో ప్రోస్టేట్ బాగా పెరిగిపోయి మూత్రవిసర్జనకు అడ్డుపడుతోంది. దీనికీ శస్త్రచికిత్స చేయాలి. ముందస్తు చికిత్సతోనే సత్వర ఫలితాలు వస్తాయి" అని సూచించారు. కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టు డాక్టర్ బి.శ్రీకాంత్ మాట్లాడుతూ, "కిడ్నీ జబ్బులు నానాటికీ పెరుగుతున్నాయి. మన దేశంలో ప్రతి పది మందిలో ఒకరికి క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ) ఉంటోందని అంచనా. ప్రతియేటా 2.30 లక్షల మంది డయాలసిస్ స్థాయికి వెళ్తున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం వల్ల ఈ వ్యాధి ఎక్కువగా సంభవిస్తోంది. మధుమేహ బాధితుల్లో 40శాతం మందికి కిడ్నీ సమస్యలు వస్తున్నాయి. క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ) లక్షణాలు చాలా మందికి కనిపించవు. అవి తెలిసే సరికే వ్యాధి తీవ్రత పెరుగుతుంది. కిడ్నీ పనితీరు 50శాతం పడిపోతేనే సీరం క్రియాటినైన్ కూడా పెరిగినట్టు చూపిస్తుంది. అప్పటి వరకు అదీ మామూలుగానే ఉంటుంది. కొందరికి యూరిన్ ప్రోటీన్ టెస్ట్ తెలిస్తే ముందే వ్యాధి విషయాన్ని తెలుసుకోవచ్చు. బీపీ, షుగర్ ఉన్నవారు ప్రతియేటా సీరం క్రియాటినైన్, యూరిన్ ప్రోటీన్ టెస్ట్ చేయించుకోవాలి. లక్షణాలు లేకపోయినా చేయించుకోవడం మంచిది. దీనివల్ల వ్యాధిని ముందుగానే గుర్తించి, మందులు తీసుకుంటే డయాలసిస్ వరకు పోకుండా కాపాడుకోవచ్చు" అని వివరించారు.

జమ్మిగడ్డలో 63వ వారం అంబేద్కర్ జ్ఞానమాల



నవతెలంగాణ-కాప్రా

అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధి తాడూరి గగన్ కుమార్ ఆధ్వర్యంలో జమ్మిగడ్డ బీ.జే.ఆర్ కాలనీలో చేపట్టిన అంబేద్కర్ జ్ఞానమాల 63 వ వారానికి చేరింది. ఆదివారం ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ..అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జ్ఞానమాల టీం సభ్యులు రహీం, నరసింహ చారి, కొండల్, దయానంద్, నరేందర్ రావు, నాగేష్, కాంతారావు, అరుణ్ కుమార్ చిన్నారావు శ్రీనివాస్ శేఖర్ మహేష్ జాషువా రాములు, వెంకటయ్య, బాబు, మాణిక్ పంతులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా మధుర చారిటబుల్ ట్రస్ట్



నవతెలంగాణ-ఉప్పల్

పేద ప్రజలకు అండగా మధుర చారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ ఉంటుందని మధుర చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ రాగి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం రామంతపూర్ వెంకారెడ్డి నగర్‌లో మధుర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్ లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. కిమ్స్, సన్ షైన్ హాస్పిటల్స్‌లో అనుభవజ్ఞులైన 30 మంది డాక్టర్లతో ఆధునాతన వైద్య పరికరాలతో పరీక్షలు చేశారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..నియోజకవర్గంలో అన్ని డివిజన్స్‌లో ఇలాంటి సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తామన్నారు. ట్రస్ట్ ద్వారా మహిళలకు ఉపాధి కల్పన ధ్యేయంగా కుట్టుమిషన్లు, అల్లికలు, ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు, విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు నగదు బహుమతులు, విదేశీ చదువులకు ప్రోత్సాహకాలు అందిస్తూ, నిరుద్యోగులకు ఉపాధి కల్పన ధ్యేయంగా మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మొహమ్మద్ రఫీక్, కాలేరు జే నవీన్, షేక్ మదర్ వలీ, మల్లేష్ యాదవ్, గడ్డం నరసింహ, రవీందర్ రెడ్డి, నరేందర్ ముదిరాజ్, కరాటే రాఘవ, నర్సింగ్ ముదిరాజ్, హరీష్ ఉన్నారు.

మణిపూర్‌లో హింసను ఆపాలని శాంతి ర్యాలీ



నవతెలంగాణ-కీసర

మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసను అపాలంటూ క్రైస్తవులు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ శాంతి ర్యాలీని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. దమ్మాయిగూడ చౌరస్తాలో మున్సిపల్ చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ ముగించారు. కార్యక్రమంలో కాపరి పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవరెండ్ గాబ్రియల్, సెక్రటరీ పాల్ డేవిడ్, దమ్మాయిగూడ క్రిస్టియన్ సెల్ ప్రెసిడెంట్ పి.హర్షవర్థన్, సెక్రటరీ ఫిలీఫ్ మాదాసు, కౌన్సిలర్ పంగ హరిబాబు, మంగలపురి వెంకటేష్, బీఆర్ఎస్ నాయకుడు కొత్త భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మారుతీ కాలనీ సభ్యులకు శ్రీదేవి శుభాకాంక్షలు

నవతెలంగాణ-కాప్రా

నూతనంగా ఎన్నుకోబడిన మారుతీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ప్రమాణ స్వీకారానికి చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి హాజరై కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 9 ఏండ్ల క్రితం మారుతీ కాలనీకి ప్రస్తుత మారుతీ కాలనీకి ఆస్మాన్,జమీన్ ఫరక్ ఉందన్నారు. కాలనీలో దాదాపు అన్ని సమస్యలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. మిగిలిన ఏమైనా ఒక రెండు పనులు ఉంటే వాటిని త్వరలోనే పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు పాత కమిటీ సభ్యులు అందరూ కలిసి కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మారుతీ కాలనీ అధ్యక్షులు ధీరావత్ శ్రీనివాస్, సలహాదారులు డి. హనుమంత నాయక్, గౌరవాధ్యక్షులు ఎం. రమేష్ వంశరాజ్,ప్రధాన కార్యదర్శి కడింగుల నవీన్ బాబు (నాయీ),



ఉపాధ్యక్షులు డి.రెడ్డి నాయక్, కిషోర్, సంయుక్త కార్యదర్శులు ఆర్ రమణ చారి, డి వీరన్న, సిహెచ్ శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులు ఎన్ అరుణ, వి రెడ్డి నాయక్,డి.గోవిందరావు, కమిటీ సభ్యులు ఎం విజయ్ కుమార్, ఎ.మోహన్‌రావు, డి.బాలు నాయక్, యం. బుజ్జి,డి.శ్యాం నాయక్, డి.దస్తగిరి, ఎండీ. సమాద్, జి.బాలాజీ, ఎం.రమేష్, కోశాధికారి జి.నరసింహ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మున్నీ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఘట్కేసర్

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కాచవాని సింగారం గ్రామ సర్పంచ్ కొంతం వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం కాచవాని సింగారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో వెంకటాపూర్ నీలిమ హస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాతావరణ, తినే ఆహారం, ఇలా ప్రతిదీ కాలుష్యం కావడంతో కొత్త కొత్త వ్యాధులు వస్తున్నాయని చెప్పారు. వయస్సులతో సంబంధం లేకుండా వస్తున్న వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడూ వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. నీలిమ హస్పిటల్ యాజమాన్యం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ వైద్య శిబిరంలో 528 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు



అందజేసినట్లు నీలిమ హస్పిటల్ సీఈవో నీలిమ తెలిపారు. నీలిమ కార్డులతో 50 శాతం తగ్గింపుతో గర్భిణీలకు ప్రతి నెలా 9న ఉచిత వైద్య సేవలు పొందడానికి 9 కార్డులు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హస్పిటల్ సిబ్బంది, భరత్‌రెడ్డి ప్రశాంత్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేత



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రావల్‌కోల్ గ్రామంలో ఎన్ఎస్‌యూఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మామిడ్ల రాహుల్ యాదవ్ గారి తండ్రి మామిడ్ల చంద్రయ్య జ్ఞాపకార్థం ఆదివారం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన శ్రీకాంత్ జట్టుకు రూ.10వేల బహుమతి, రన్నర్‌గా నిలిచిన శ్రీధర్ జట్టుకు రూ.5 వేలు బహుమతిగా అందజేశారు. విజేతగా నిలిచిన జట్టు సభ్యులందరికీ జెర్సీలను అందజేసినట్టుగా తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేందర్, వైస్ ఎంపీపీ గోపని వెంకటేష్, వార్డు సభ్యుడు రాము గౌడ్, మాజీ ఎంపీటీసీ నాగమణి, కో ఆప్షన్ సభ్యుడు నర్సింగ్ రావు, మాజీ వార్డు సభ్యుడు స్వామి,యూత్ సభ్యులు హరత్, సందీప్, రామకృష్ణ, కృష్ణ, గోపి పాల్గొన్నారు.

ఎస్.వై.ఆర్ ఫౌండేషన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

ఎస్.వై.ఆర్ ఫౌండేషన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్ సామల యాదిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పోచారం మున్సిపాల్టీ పోచారం 18వ వార్డు పరిధిలో ఎస్. వై. ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాదాపు రూ.2లక్షల 10వేలతో మల్లికార్జున వడ్డెర సంఘం వద్ద గుడికి రంగులు, గుడి ఆవరణలో షెడ్డు నిర్మాణం, సీసీరోడ్డును ఆదివారం ఎస్. వై. ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ సామల యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సామల సందీప్ రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం 500 మందికి అన్న దానం చేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ యాదిరెడ్డి మాట్లాడుతూ.. ఎస్ వై ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఘట్కేసర్ సహకార సంఘం వైస్ చైర్మెన్ బద్దం అనంతారెడ్డి, కౌన్సిలర్ మెట్టు బాల్ రెడ్డి, సామల కొండల్ రెడ్డి, సామల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీన నాయకులు బద్దం జగన్ మోహన్ రెడ్డి, బద్దం నర్సింహా రెడ్డి, సభ్యులు మెట్టు మహేందర్ రెడ్డి, ఆకిటి సుధీర్ రెడ్డి, నెల్లుట్ల సత్యనారాయణ, సామల జైపాల్ రెడ్డి,గుండె స్వామి తదితరులున్నారు.

అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు



నవతెలంగాణ- మేడ్చల్

తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసే బీఆర్ఎస్ పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఆదివారం మేడ్చల్ మండలం డబిల్‌పూర్ గ్రామ ఉప సర్పంచ్ సత్యనారాయణ, మరో 50 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి మల్లారెడ్డి నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి మంత్రి మల్లారెడ్డి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్ లోకి భారీ చేరికలు జరుగుతున్నాయని తెలిపారు.బీజేపీ, కాంగ్రెస్ పార్టీలో నాయకులకు మనుగడలేదన్నారు. కార్యక్రమం లో జిల్లా కో ఆప్షన్ సభ్యుడు గౌస్, మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు భాగ్యరెడ్డి, తలారి అశోక్, సారా శ్రీనివాస్, ఉప్పరి శ్రీనివాస్, రామోదర్ రెడ్డి, రాజు సుదర్శన్, బాలయ్య, గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలి : సర్పంచ్



నవతెలంగాణ-కీసర

చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలని కరీంగూడ సర్పంచ్ కౌకుంట్ల గోపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం కీసర మండలంలోని కరీంగూడ గ్రామంలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహం గ్రామంలో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ కీసర మండల అధ్యక్షుడు దేశం మల్లేష్ గౌడ్, ఎంపీటీసీ మంచాల కిరణ్ జ్యోతి ప్రవీణ్, ఉప్ప సర్పంచ్ మాధవ రెడ్డి, వార్డ్ సభ్యులు కోఆప్షన్ సభ్యులు సింగిల్ విండో సభ్యులు దేవాదాయ కమిటీ సభ్యులు కరీంగూడ శ్రీ హనుమాన్ రజక సంగం సభ్యులు, కౌన్సిలర్ వరగంటి వెంకటేష్, దేశం రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో 'భగత్ సింగ్' అనే అంశంపై డిబేట్

నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ దినోత్సవాన్ని పురస్కరించుకుని కమలానగర్ ఆఫీసులో స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ అనే అంశంపై డిబేట్ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ కాంపిటీషన్‌లో 8 విద్యా సంస్థల నుంచి 43 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కాంపిటీషన్‌కు సమన్వయకర్తగా గొడుగు యాదగిరిరావు వ్యవహరించారు.ప్రముఖ విద్యావేత్త మల్లేశం విద్యార్థులు వారి తల్లిదండ్రులతో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞను చేయించారు. న్యాయ నిర్ణేతలుగా ఈసీఐఎల్ రిటైర్డ్ ఏజీఎం నాగయ్య , ప్రముఖ రచయిత పి జ్యోతి వ్యవహరించారు. మరో విభాగానికి ప్రముఖ విద్యావేత్త మల్లేశం,



జాబిరెడ్డి, కోమటి రవి వ్యవహరించారు. భగత్‌సింగ్ గురించి పిల్లల ప్రసంగించారు. విజేతలకు 17వ తేదీ రౌండ్ బిల్డింగ్ వద్ద గల లైన్స్‌క్లబ్ హాల్లో బహుమతి ప్రదానం చేస్తామని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, రాజమల్లు, ఏ సత్యనారాయణ, శివరామకృష్ణ, చారి, శారద, శివ పాల్గొన్నారు.

పోచమ్మ ఆశీస్సులతో అభివృద్ధి

నవతెలంగాణ-జవహర్‌నగర్

పోచమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి జరగాలనీ, ప్రతి గ్రామంలో చెరువులు నిండటంతో రైతులు సంతోషంగా ఉన్నారని కార్పొరేటర్లు దొంతగాని శాంతి కోటేష్‌గౌడ్, 19వ డివిజన్ కార్పొరేటర్ మేక లలితాయాదవ్ అన్నారు. ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని పోచమ్మ, బీరప్ప బోనాల పండుగ సందర్భంగా వారు పోచమ్మకు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని తెలిపారు. పోచమ్మ, బీరప్ప కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుతో చెరువులు నింపి



రైతును రాజును చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గబ్బిలాలపేట వ్యవస్థాపకులు తురుగొండ రామన్న కరాటే రాజు, నాగభూషణం ఆధ్వర్యంలో బోనాలు చేశారు. కార్యక్రమంలో రాజ్ కుమార్, కొమురయ్య, కాలనీ నాయకులు బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు పెద్ద పీట



నవతెలంగాణ-కీసర

ప్రభుత్వం అన్ని వర్గాలకు పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు.ఆదివారం నాగారం మున్సిపాల్టీ, రాంపల్లి గ్రామంలోని 4వార్డు ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు జూలకంటి రమేష్ గుప్తా ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తుందన్నారు.ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో 4వవార్డు బీఆర్ఎస్ ఇన్‌చార్జి జమ్మల సందీప్‌గౌడ్, ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

బోనాల వేడుకలో ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాల్టీ పరిధిలోని మల్లంపేట గ్రామంలో ఆదివారం నిర్వహించిన బోనాల జాతరకు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో ఆరోగ్యాలతో ఉండేలా చూడాలని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనంతస్వామి, ఎంబరి లక్ష్మీ ఆంజనేయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



రాజీవ్ పార్క్‌లో సౌకర్యాల ఏర్పాటుకు కృషి : కార్పొరేటర్

నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఫస్ట్ ఫేజ్‌గ్రౌండ్‌లోని రాజీవ్ పార్క్‌లో కనీస సౌకర్యాల ఏర్పాటుకు కృషి చేస్తానని కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ అన్నారు. ఆదివారం ఉదయం పార్క్‌లోని సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పార్క్‌కు వచ్చిన పలు కాలనీవాసులు వ్యాయామం, కాలక్షేపం కోసం చిన్న పిల్లలతో వస్తున్నామని ప్రభుదాస్‌కు తెలిపారు. పార్క్‌లో ఓపెన్ జిమ్ ఎక్విప్మెంట్ మెయింటెనెన్స్ చూడాలని, ఫుట్ ట్రాక్ ఎత్తు పెంచాలని కార్పొరేటర్‌ను కోరారు. ఇందుకు కార్పొరేటర్ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులను పార్క్‌లో సౌకర్యాలు కల్పించాలని కోరారు.



చర్లపల్లి డివిజన్ రెడ్డి కాలనీకి చెందిన తరిగొప్పుల బాలనరసింహ శనివారం మరణించడంతో కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ ఆదివా రం బాలనరసింహ మృతదేహానికి నివాళులర్పించారు. ఆమె వెంట కాలనీవాసులు సురేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్ రెడ్డి, తదితరులున్నారు.



నవతెలంగాణ-కాప్రా

కారు ఢీకొనడంతో... మోటార్ సైకిల్ వ్యక్తి మృతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రోడ్డు ప్రమాదంలో మోటార్ సైకిల్ వ్యక్తి మృతి చెందిన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నేరేడ్‌మెట్‌కు చెందిన రామచంద్రారావు (56) సెంట్రింగ్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఉదయం 6 గంటలకు మోటార్ సైకిల్ హెూండా షైన్ పైన తన ఇంటి నుంచి బయలు దేరి బోయిన్‌పల్లికి వెళుతున్నాడు. రామకృష్ణాపురం బ్రిడ్జి వద్దకు రాగానే, అతివేగంగా వచ్చిన మారుతి సుజుకి కారు డ్రైవర్, మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో దానిపై వెళుతున్న రామచంద్రరావుకు బలమైన గాయాలైనాయి. వెంటనే బాధితుడిని చికిత్స నిమిత్తం సన్ ఫ్లవర్ హాస్పిటల్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ ఉదయం 10 గంటలకు మృతిచెందాడు. నేరేడ్ మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

చలో కోరుట్ల పద్మశాలి సింహ గర్జన



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సంఘటితం, సమానత్వం, రాజ్యాధికార సాధన కోసం " చలో కోరుట్ల పద్మశాలి సింహ గర్జన " పద్మశాలి రాజకీయ యుద్ధభేరిలో పాల్గొని పద్మశాలీల సత్తా చాటుకోవాలని సూరారం 129 డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. అందులో భాగంగా కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు, మున్సిపాలిటీల నుండి పద్మశాలి సంఘం ప్రతినిధులు, పద్మశాలిలు, తదితరులు 150 కార్లతో భారీ ర్యాలీగా కోరుట్లకు బయలుదేరి వెళ్ళారు. జై మార్కండేయ జై పద్మశాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ... పద్మశాలిలలో రాజకీయ చైతన్యం కలిగించాలని లక్ష్యంతో కోరుట్లలో ఆదివారం నిర్వహించే భారీ బహిరంగ సభకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుండి పద్మశాలిలు హాజరుకానున్నారని తెలిపారు.

అపార్టుమెంటుపై నుంచి పడిపోయిన బాలుడు

- తల, ముఖంపై తీవ్ర రక్తపు గాయాలు
- మెదడులో గడ్డకట్టిన రక్తం
- విరిగిన దవడ ఎముక, చేతి, తొడ ఎముకలు
- సంక్లిష్ట శస్త్రచికిత్సలతో ప్రాణాలు కాపాడిన ఎస్ఎల్‌జీ హాస్పిటల్ వైద్యులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

అపార్టుమెంటు ఆరో అంతస్తు నుంచి పొరపాటున కాలు జారి కింద పడిపోయిన పదేండ్ల బాలుడికి ఎస్ఎల్‌జీ హాస్పిటల్ వైద్యులు పలు సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు చేసి, అతడి ప్రాణాలను కాపాడారు. లోహిత్ అనే బాలుడిని జూన్ 1వ తేదీన ఎస్ఎల్‌జీ హాస్పిటల్‌కు హుటాహుటిన తరలించారు. హాస్పిటల్‌కు తీసుకొచ్చేసరికి అతడికి స్పృహ లేదు. ముఖం, తల నుంచి రక్తం కారుతోంది. రక్తపోటు (బీపీ) అసలు రికార్డు చేయలేనంత తక్కువ స్థాయిలో ఉంది. అతడి కుడి తొడ, ఎడమ చేతి ఎముకలు పలుచోట్ల విరిగిపోయాయి. దవడ ఎముక కూడా విరిగింది. మెదడులో కుడి, ఎడమ వైపుల రక్తం గడ్డకట్టింది. అతడి రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి కేవలం 6 గ్రాములే ఉంది. ఇది అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి. లోహిత్‌కు చికిత్స చేసిన ఎస్ఎల్‌జీ హాస్పిటల్‌ఓలని న్యూరోసర్జరీ విభాగాధిపతి, సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ రంగనాథన్.. ఆ బాలుడి పరిస్థితి గురించి, అతడికి అందించిన చికిత్సా విధానాల గురించి వివరించారు. "మొదట్లో అతడి మెదడు స్పందించకపోవడంతో ముందుగా ఐదు రోజుల పాటు రక్తం ఎక్కించాం. క్రమంగా పరిస్థితి కొంత మెరుగుపడటంతో, ఐదోరోజు సాయంత్రం అతడి కుడి మెదడులో విరిగిన ఎముక ముక్కలు తొలగించేందుకు అత్యవసర శస్త్రచికిత్స చేశాం. పుర్రె, వెన్నెముక మధ్య ఉన్న బాహ్యా మందమైన బలమైన పొర అయిన డ్యూరామేటర్‌ను శస్త్రచికిత్స ద్వారా తెరిచాం. దీనివల్ల మెదడు ఒత్తిడిని విడుదల చేయడానికి స్పష్టమైన, రంగులేని, నీటి ద్రవమైన సెరెబ్రోస్పానియల్ ఫ్లూయిడ్ (సిఎస్ఎఫ్)ను తొలగించడానికి వీలుపడింది. దీంతోపాటు ఎక్స్‌టర్నల్ వెంట్రిక్యులర్ డ్రయినేజీ (ఈవీడీ) కూడా నిర్వహించాం. ఈ శస్త్రచికిత్స చేసిన ఐదు రోజుల తర్వాత లోహిత్ కండ్లు తెరిచాడు. మెదడు శస్త్రచికిత్స పూర్తయ్యాక, ఆర్థోపెడిక్ సర్జన్లు అతడి తొడ, చేతిలో ఉన్న ఫ్రాక్చర్లకు చికిత్స కోసం శస్త్రచికిత్సలు చేశారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి బాలుడు సరిగా ఊపిరి తీసుకోలేకపోతుండటంతో.. ఊపిరితిత్తులకు ఆక్సిజన్ పంపేందుకు ట్రాకియాస్టమీ చేశారు. దవడ ఎముక విరగడం, ముఖం మీద ఇతర గాయాలూ ఉండటంతో ఫేషియో మాక్సిలరీ సర్జరీ చేశారు. దాదాపు మూడు వారాల తర్వాత బాలుడు లేచి తిరగగలిగాడు" అని డాక్టర్ రంగనాథం వివరించారు. ఈ శస్త్రచికిత్సల్లో కన్సల్టెంట్ న్యూరోసర్జన్లు డాక్టర్ జి.రవికిరణ్, డాక్టర్ కొడాలి సంధ్య, కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ నరసింహారెడ్డి, కన్సల్టెంట్ ప్లాస్టిక్, రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్ డాక్టర్ అమర్ రఘు, ఎనస్థీషియా వైద్యులు డాక్టర్ లక్ష్మారెడ్డి, డాక్టర్ రాజ్‌కుమార్, ఆయన బృందం, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ అప్పిరెడ్డి, ఆయన బృందం పాల్గొన్నారు.

వైద్యులకు అభినందనలు

జూలై 1వ తేదీన హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయిన లోహిత్‌ను దూరప్రాంతం నుంచే ఐదు వారాల పాటు నిశితంగా గమనిస్తూ ఉన్నారు. ఇప్పుడు లోహిత్ వాకర్ సహాయంతో నడవగలుగుతున్నాడు. ఇప్పటినుంచి అతడి పరిస్థితి మరింత మెరుగుపడుతుంది. ఈ బాలుడికి చేసిన సంక్లిష్టమైన చికిత్స.. ఎస్ఎల్‌జీ హాస్పిటల్‌లో ఉన్న మల్టీ-సూపర్ స్పెషాలిటీ నైపుణ్యాలకు నిదర్శనం. ఈ గొప్ప విజయాన్ని సాధించిన డాక్టర్ రంగనాథం, ఇతర వైద్యులు, సహాయక సిబ్బందిని ఎస్ఎల్‌జీ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.వి.ఎస్. సోమరాజు అభినందించారు.

ఆదర్శ నియోజకవర్గంగా కుత్బుల్లాపూర్



- ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గత తొమ్మిదేండ్లుగా రాజకీయాలకతీతంగా నియోజక వర్గ ప్రజల సహాయ సహకారాలతో కుత్బుల్లాపూర్ నియోజక వర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. గాజులరామారం డివిజన్ పరిధిలోని మిథిలా నగర్‌లోని రూ.50లక్షల వ్యయంతో చేపడుతున్న మంచి నీటి వాటర్ ట్యాంక్, రూ.27లక్షల వ్యయంతో చేపడుతున్న అంతర్గత సి.సి. రోడ్డు, రెండు కోట్ల ఎనభై లక్షల వ్యయంతో ఐదు పబ్లిక్ పార్కులు చేపట్టారు. అందులో రెండు పార్కులను ఆదివారం ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని స్థానికులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఐటీ మంత్రి కేటీఆర్ సహకారంతో డివిజన్ పరిధిలోని ప్రతి బస్తీని, కాలనీలను దశలవారీగా అభివృద్ధి పరుస్తున్నామని అన్నారు. మిథిలా నగర్‌ని కూడా అభివృద్ధి పరిచామని రాబోయే కాలంలో ఈ కాలనిని నియోజక వర్గ పరిధిలోని ఒక ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రవీంద్రనాథ్ ఠాగూర్, డి .ఏ. చౌదరి, ప్రవీణ్ పోతినేని, ఎం.ఏ.సురేష్, చెంగల్ రాయుడు, లవ శివకుమార్, వెలగపూడి శ్రీనివాస్, చంద్రమోహన్, అలీ, మసూద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రజల కష్టాలు కనపడవు : నందికంటి



నవతెలంగాణ-మల్కాజిగిరి

కాలనిల్లో ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని, ప్రభుత్వానికి ప్రజల కష్టాలు కనపడవని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని139(ఈస్ట్ ఆనంద్ బాగ్)డివిజన్‌లో సాయి లింగాస్ ఫంక్షన్ హాల్ నుండి ఏఎస్ రావు నగర్, కళ్యాణ్ నగర్, CIFIL కాలనీ, రాజా నగర్, షిరిడి నగర్, రామచంద్ర ఎన్క్లేవ్‌లో కాలనీ నేస్తం కాంగ్రెస్ హస్తంలో భాగంగా ఆదివారం నాడు నందికంటి శ్రీధర్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి గడప గడపకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో దీర్ఘకాలిక సమస్య వరద నీరు (వర్షాలు) వచ్చినప్పుడల్లా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు ఈ సందర్భంగా శ్రీధర్ చెప్పుకున్నారు. నందికంటి శ్రీధర్ మాట్లాడుతూ పాలకులు ప్రజల సమస్యలను గాలికి వదిలేశారని అన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోతుందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శాశ్వత పరిష్కారం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు ఉమేష్ సింగ్, బుచ్చిబాబు, వేణు, మాజీద్, మోయిన్, వాయిద్, మనికంట, వంశీ, అక్తర్ పాల్గొన్నారు.

వసుధ ఫార్మా కెమ్ లిమిటెడ్ కార్మికుల సభ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల ఇండస్ట్రీ పారిశ్రామిక వాడలోని వసుధ ఫార్మా కెమ్ లిమిటెడ్‌లోని కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చించి వారి వేతనాన్ని రూ.10.000 పెంపొందించినందుకు ఆదివారం 129 సూరారం డివిజన్ పరిధిలోని నల్లగుట్ట లక్ష్మి నర్సింహ స్వామి ఆలయ ప్రాంగణంలో ఎంప్లాయిస్ యూనియన్ సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగ ఎమ్మెల్యే కె.పి వివేకానంద్‌ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మిక శ్రేయసకు తాను ఎల్లప్పుడూ ముందు ఉంటానని తెలిపారు. కార్మిక పక్షపాతి ముఖ్య మంత్రి కేసీఆర్ అని తెలిపారు. ఎటువంటి సమస్య ఉన్న మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మూర్తి రాజు, ఎచ్ఆర్ సుబ్బారావు, ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్, జనరల్ సెక్రటరీ ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్ రాజి రెడ్డి, శ్రీనివాస్, ఉమా మహేశ్వర్ రావు, మఖ్బూద్ అలీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ ఇందిరమ్మ కాలనీ వాసులు కేంద్ర రాష్ట్ర వైఫల్యాలపై నిరంతరం పోరాటం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన ఉదయ్, రాఘవ చారీ, టీ.రాజు, పాపయ్య, శ్రీకాంత్, ఎండి. సాబీర్ వారి మిత్ర బృందం. ఆదివారం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్ రెడ్డి అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల కుటుంబంలో "ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం నెలకు రూ. 25000, అమరవీరుల ఉద్యమంలో పాల్గొన్న యువత పై కేసులను ఎత్తివేయడంతో పాటు, జూన్ 2న వారికీ తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు అందజేస్తామన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలల్లో కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండ ఎగర వేయడం కాయం అని తెలియజేసారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం హర్షనీయం

- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద ప్రజల నివాసిత ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం హర్షనీయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ పారిశ్రామిక వేత్తల సంఘం (ఐలా) ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షులు పైడిపల్లి స్వామి గౌడ్ ఆధ్వర్యంలో రంగారెడ్డి డివిజన్ గాంధీనగర్ ప్రాంతంలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం లక్ష రూపాయల చెక్కును స్థానిక కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్‌తో కలిసి గాంధీనగర్ సంక్షేమ సంఘం సభ్యులు జల్దా లక్ష్మీనాథ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు అబ్దుల్ ఖాదర్, సంక్షేమ సంఘం కార్యదర్శి మేకల ఎల్లయ్య, ఇండస్ట్రియల్ అసోసియేషన్ కార్యదర్శి రవీందర్, సభ్యులు జగదీష్, ప్రతాపరెడ్డి ,శ్రీనివాస్, సత్యనారాయణ ,తిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా టీడీపీ విస్తృత సమావేశం

- రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్
- పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్‌నియోజకవర్గ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్ ముదిరాజ్ నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంటరీ విస్తృత స్థాయి సర్వసభ్య సమావేశం , మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంటరీ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి , జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న , రాష్ట్ర కార్యదర్శి కొలన్ లీడర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు. మొదట తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అనేక సంవత్సరాలు అధికారం చేపట్టి ప్రజల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలతో సేవలందించిన పార్టీ కేవలం తెలుగుదేశం పార్టీ అని తెలిపారు. మారుతున్న కాలాన్ని బట్టి పార్టీ బలోపేతం చేసేందుకు ఎప్పటికప్పుడు అన్ని సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్రంలో ఓటు బ్యాంకు చెక్కుచెదరలేదని అందుకు నిదర్శనమే ఖమ్మంలో జరిగిన బహిరంగ సభ తెలియజేసిందన్నారు. ప్రతిపక్షాలు తెలుగుదేశం పార్టీ ఉనికి లేదని తెలిపిన వాళ్లే, భయం చెందుతున్నారని రాబోయే రోజులలో తెలుగుదేశం పార్టీ అన్ని నియోజకవర్గాలలో పోటీకి నిలబడుతుందని తెలుగుదేశం జయకేతనం ఎగురవేయడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ అధ్యక్షుడు చంద్రహాస్, మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంటరీ అధ్యక్షుడు కందికంటి అశోక్ గౌడ్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అనిల్ కరుటూరి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని పీఎన్ కాలనిలోని కార్పొరేటర్ ఆఫీసు వద్ద 15th ఆగస్టు సందర్భంగా జీహెచ్ఎంసీ వారు జాతీయ జెండాలను కార్పొరేటర్ వై. ప్రేమ్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో sfa శేఖర్ నాయకులు బాబు, సత్యనారాయణ, సంపత్ గారు, రాజ్ రెడ్డి, బిక్షపతి, రంగమ్మ పాల్గొన్నారు.



నవతెలంగాణ-మల్కాజిగిరి

బీఆర్ఎస్ నేత అనిల్ కుమార్ జన్మదిన వేడుకలు



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత అనిల్ కుమార్ యాదవ్ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే క్యాంపస్ వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే సమక్షంలో కేక్ కట్ చేసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనిల్ కుమార్ భగవంతుని ఆశీస్సులతో నిండునూ రేండ్లు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆశీర్వదిం చారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి సమస్య లను పరిష్కరించేందుకు అనిల్ కుమార్ ఎంతో కృషి చేస్తు న్నారని, ప్రజల విజ్ఞప్తులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి తన వంతు బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తునందుకు అభినం దనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేష్, సంద్ర సునీల్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ: టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పెద్దపులి అనిల్ యాదవ్ జన్మదినం వేడుకలు ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అనిల్ యాదవ్‌ను శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు బంధుమిత్రులు పాల్గొన్నారు.

త్రివర్ణ..జెండాలతో...ర్యాలీ..



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఆర్‌కేపురం ఆఫీసర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని త్రివర్ణ జెండాలతో రన్.... నిర్వహించారు. ఆర్మీ సీఎస్‌డి డీపో నుండి లార్డ్ హనుమాన్ టెంపుల్‌పురం వరకు 1మీ దూరం వరకూ ఈ రన్ కొనసాగింది. దీనిలో అన్ని వయస్సులకు చెందిన పిల్లలు, పురుషులు, మహిళలు, సీనియర్ సిటీజన్లు సుమారు 500 మంది పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు, ఫలహారాలు అందించారు. కాలనీ ప్రెసిడెంట్ రష్మీ రంజన్ మహాపాత్ర మాట్లాడుతూ కొత్త రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్ల ఏర్పాటు, ఆర్ డబ్ల్యూఏ/డైరెక్షన్ బోర్డ్, కొత్త ఆర్టీసీ బస్సు 24-జె , మధ్యాహ్న భోజనం వంటి కార్యక్రమాలతో పాటుగా కాలనీ అభివృద్ధి గురించి వివరించారు. 7 నెలల వ్యవధిలోనే సీసీటీవీల ఏర్పాటు పూర్తి చేసామని చెప్పారు. అలాగే ఆఫీసర్ కాలనీ అభివృద్ధి కోసం భవిష్యత్‌లో అనేక ప్రాజెక్టులు కూడా ప్లాన్ చేసినట్లు ఆయన తెలిపారు. ఎస్ హెచ్ ఓ త్రిముల్ గెర్రీ శేఖర్ అతిథిగా విచ్చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

నాయి బ్రాహ్మణ అధ్యక్షురాలిగా ఏ.దుర్గారాణి

నవతెలంగాణ-బాలానగర్



నాయి బ్రాహ్మణ మహిళల హక్కుల కోసం కృషి చేస్తానని రాష్ట్ర నాయి బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలుగా ఏ.దుర్గారాణి అన్నారు. శనివారం హనుమాన్ టెకీడీలోని బీసీ సాధికారత భవన్‌లో రాష్ట్రస్థాయి నాయి బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా ఏ.దుర్గారాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయి బ్రాహ్మణ మహిళా సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం రాష్ట్ర అధ్యక్షురాలుగా ఏ.దుర్గారాణి. ఉపాధ్యక్షురాలుగా బి.భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా వై. రేణుక, కోశాధికారిగా ఎన్. స్వప్న, జాయింట్ సెక్రటరీగా నాగరాణి, ఆర్గనైజ్ సెక్రటరీగా జి. నవనీత, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉషారాణి, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్ విద్య, సీహెచ్ ఉమారాణి, నవనీత తదితరులు ఎన్నికయ్యారు. రానున్న రోజుల్లో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటిస్తామని వారు తెలిపారు.

సుబ్బలక్ష్మికి నివాళ్ళులర్పించిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కేపీహెచ్‌బీ డివిజన్ కాలనీలో ధనలక్ష్మి సెంటర్ టెంపుల్ పార్క్ నందు కూకట్‌పల్లి డివిజన్ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి (శోభ) దశ దిన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి, పీసీసీ సభ్యులు డా. సత్యం శ్రీరంగం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు రాజానోల లక్ష్మిలు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్, బాలాజీ నగర్ డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ రాజ్ పుత్, అల్లాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ షఫీయుద్దీన్, నరసింహ యాదవ్, ఫణి, చోట మొయిజ్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షురాలు మారుతీ, మణి తదితరులు పాల్గొన్నారు.

మథర్ థెరిస్సా జయంతి వేడుకలకు మేయర్‌కు ఆహ్వానం



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మదర్ థెరిస్సా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ నీలా గోపాల్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 26న నోబుల్ అవార్డ్ గ్రహీత మదర్ థెరిస్సా 113వ జయంతి సందర్భంగా వారి ఆధ్వర్యంలో నిర్వహించు వేడుకలు ఉచిత వైద్య శిబిరం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరు కాగలరని ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో సభ్యులు ప్రభాకర్ రెడ్డి, నర్సింగరావు, పితాని శ్రీనివాసరావు, దాలినాయుడు,పల్లె శ్రీనివాసరావు, నాగభూషణం, అద్దంకి శ్రీనివాసరావు, పోతుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలి

- మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టాలని మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు అన్నారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని ఆంజనేయనగర్ రోడ్ నెంబర్ 7లో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నాణ్యతతో కూడిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిహెచ్ ప్రభాకర్ గౌడ్, భాస్కర్ రావు, సుశీల్ కుమార్, కృష్ణంరాజు, సిహెచ్ కృష్ణంరాజు, పి.కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, మల్లా రెడ్డి, సూర్యనారాయణ, కృష్ణ రావు తదితరులు పాల్గొన్నారు.

చంద్ర బోస్, విష్ణు ప్రియలు ఏర్పరచిన సంకీర్తన గ్రూప్ సభ్యులు సుమారు నలభై మంది పైగా తమ గాన వాహినిలో పన్నెండు గంటల పాటు నిర్విరామంగా శ్రోతలను ముంచెత్తారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై సింగింగ్ అప్స్‌లో గుర్తింపు పొందిన వారిచే సంకీర్తన వార్షికోత్సవ వేడుకలు పాటల సందడిగా జరిగాయి. కళా భిమానులు ఎల్.పీ.రావు, ప్రసాద్ కోమర్రజులు గాయనీగాయకులను చంద్ర బోస్ విష్ణు ప్రియలను అభినందించారు.
నవతెలంగాణ-కల్చరల్



ఫతేనగర్ డివిజన్ నూతన మహిళా కాంగ్రెస్ కమిటీ నియామకం

నవతెలంగాణ-బాలానగర్



కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ 118 డివిజన్ మహిళా ప్రెసిడెంట్ గుండా జ్యోతి ఆధ్వర్యంలో నూతనంగా నియామతులైన మహిళా కమిటీ సభ్యులు ఉపాధ్యక్షురాలుగా శక్తి శాంతి, కె. రజిని, ప్రధాన కార్యదర్శిగా చందసాహూ, మల్ల నవనీత, ప్రచార కార్యదర్శిగా కీర్తి మీరా భాయ్, కార్యదర్శి చక్కటి లత, శక్తి హరి భాయ్‌లకు ఆదివారం నియామక పత్రాలను ముఖ్య అతిథిలుగా హాజరై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టీపీసీసీ సభ్యులు సత్యం శ్రీ రంగం, గొట్టిముకుల వెంగళ రావులు అందజేశారు. ఈ కార్యక్రమానికి పుష్ప రెడ్డి, ఫతేనగర్ ప్రెసిడెంట్ కె. రమేష్, కూకట్‌పల్లి మహిళ ఇంచార్జి రాజలక్ష్మి, ఎ బ్లాక్ మహిళా ప్రెసిడెంట్ రమాదేవి, బోయిన్‌పల్లి డివిజన్ మహిళా ప్రెసిడెంట్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేరేడ్‌మెట్ డివిజన్ యాప్రాల్‌లోని భగత్ సింగ్ నగర్‌కి చెందిన సావిత్రి వాళ్ళ పాపకి త్రీ వీలర్ చైర్ లేక ఇబ్బంది పడుతుందని. సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి ఆదివారం త్రీ వీలర్ చైర్‌ను బహుమనంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ నాయ కులు కరంచంద్, చెన్నా రెడ్డి, శివ, గోపి, మాధవరెడ్డి, రఘుపతిరెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదివారం మేడ్చల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జరిగిన తొట్టెలు, నూతన వస్త్రాలంకరణ కార్యక్రమాలకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని నాగలూరులో బోనాల పండగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ, టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతు నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలత, సుఖసంతోషాలతో అమ్మవారి దీవెనలు ఎల్లపుడు ఉండాలని కోరారు. నవతెలంగాణ-దుండిగల్

బోనాల ఉత్సవాలలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 130 డివిజన్ సుభాష్ నగర్ పరిధిలోని పండు బస్తీలో బోనాల పండగ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు తీసుకొని నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలత, సుఖసంతోషాలతో అమ్మవారి దీవెనలు ఎల్లపుడు ఉండాలని కోరుకున్న నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ, టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్ రెడ్డి

ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న 373 జయంతి వారోత్సవాలు



నవతెలంగాణ -జగద్గిరిగుట్ట

నగరంలోని రవీంద్ర భారతిలో జై గౌడ్ ఉద్యమం -జాతీయ కమిటీ శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ ధర్మ పరిపాలన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 373 వ జయంతి వారోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జై గౌడ్ జాతీయ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావు గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి జై గౌడ్ ఉద్యమం రాష్ట్ర కార్యదర్శి బీసు వెంకటేశం గౌడ్ , తాళ్ల శ్రీనివాస్ గౌడ్ ,భాను గౌడ్, బొమ్మగాని శంకర్ గౌడ్ శ్రీనివాస్ గౌడ్ , జై గౌడ్ ఉద్యమం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షులు ,వివిధ సంఘాల ప్రతినిధులు, జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద ప్రజలకు స్వచ్ఛందంగా సేవలందిస్తా..

- లామ్రా సోషల్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ చైర్మెన్ అహ్మద్
- వంద మందికి కుట్టు మిషన్లు పంపిణీ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద ప్రజలకు తోచినంతలో సేవలు చేయాలనే లక్ష్యంతో గత కొన్నేండ్లుగా లామ్రా స్వచ్ఛంద సంస్థ స్థాపించి ఎన్నో రకాలుగా సామాజిక సేవలు చేస్తున్నానాని లామ్రా సోషల్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ చైర్మెన్ అహ్మద్ అన్నారు. ఆదివారం సాయంత్రం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ ఎస్.ఆర్. ప్యాలెస్ ఫంక్షన్ హాల్లో లామ్రా సోషల్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వందమంది పేద ప్రజలకు కుట్టుమిషన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మెన్ అహ్మద్ మాట్లాడుతూ తాను కూడా పేదరికం నుండే ఎంతో కష్టపడి అంచలంచలుగా ఎదిగానని పేదలు ఎదుర్కొంటున్న కష్టాలు తెలిసి, తోచినంతలో సేవ చేయాలనే లక్ష్యంతో లామ్రా సోషల్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ స్థాపించడం జరిగిందన్నారు. కరోనా విపత్కర సమయంలో పేద ప్రజలకు నిత్యవసర సరుకులతో పాటు దుస్తులు, ఇతరత్రా సేవలు అందించానని తెలిపారు. భవిష్యత్తులో కూడా నిరుపేద కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలను అందించేందుకు ఎల్లవేళలా ముందుఉంటానన్నారు. మహిళా మండల అధ్యక్షురాలు ఫర్జానా బేగం మాట్లాడుతూ పేదవారికి సేవ చేయాలని సంకల్పంతో లామ్రా సంస్థ చైర్మెన్ అహ్మద్ ముందుకు రావడం ఎంతోమంది పేదల కళ్లల్లో సంతోషం కనిపించిందన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాళ్లు, కరీమా, గౌసియా బేగం, శైలాజ్, ఆశీయ , సాదీయా,మౌసీనా, మనీ, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ హాస్పిటల్ వద్ద అన్నదానం

నవతెలంగాణ-సిటీబ్యూరో

సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ వద్ద ఉన్న అనాథలు, రోగుల సహాయకులకు రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా సీహెచ్ ప్రభాకర్, ఫౌండింగ్ ప్రెసిడెంట్ సీఈవో కాకతీయ మీడియా హబ్ కె.జ్యోతి రెడ్డి, ప్రొడ్యూసర్ సోషల్ వర్కర్ బీవీఎస్ రెడ్డి, ఎండీ డాక్టర్ రవి శంకర్ విజయ హెల్త్ కేర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ అన్న దాత సుఖీభవ అంటూ రెడీ టు సర్వ్ ఫౌండేషన్ వారు ప్రతి ఆదివారం ఒక్కో ప్రభుత్వ హాస్పిటల్ వద్ద పదేండ్లుగా అనాథలు, రోగుల సహాయకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. బీవివిఎస్ రెడ్డి మాట్లాడుతూ ఈ రెడీ టూ సర్వ్ ఆధ్వర్యంలో అనేక రకాలుగా సేవా కార్యక్రమలు చేస్తుంటారన్నారు. కె.జ్యోతిరెడ్డి మాట్లాడుతూ రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ సేవలకు అభినందించారు. ఇలాంటి వారు ఇంకా ముందుకి వచ్చి రెడి టూ సర్వ్ ఫౌండేషన్ ను సంప్రదించొచ్చు అన్నారు. మంచి కార్యక్రమలు చేస్తున్న ఫౌండేషన్ టీం అందరినీ అభినందించారు. డాక్టర్ రవి శంకర్ మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా అన్నదానం ఎంతో గొప్పదని చెబుతూ ఉంటారన్నారు. రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ద్వారా ఎన్నో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారని, ఇలాంటి ఎన్నో గొప్ప కార్యక్రమాలు మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. పెద్ది శంకర్‌గౌడ్, రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ వారు మాట్లాడుతూ తాము పదేండ్లుగా అనేక సేవా కార్యక్రమలు చేస్తున్నట్టు చెప్పారు. ఎవరైనా దాతలు ఉంటే ముందుకు వచ్చి సేవా కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఎవరైనా తమ ఫౌండేషన్ ద్వారా కలిసి సేవా కార్యక్రమాలు చేయాలనుకుంటే 9701295527 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ



కార్యక్రమంలో ఫౌండేషన్ కో-ఆర్డినటర్ ప్రకాష్, లక్ష్మణ్ గుండుమల్ల శివచైతన్య, నవీన్, నరేంద్ర వర్మ, నితిన్, నరేష్, మొహంత్, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ కుటుంబాన్ని పరామర్శించిన షర్మిల



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రజా యుద్ధనౌక, కవి, గాయకుడు, దివంగత గద్దర్ కుటుంబాన్ని వైఎస్సార్ టీపీ అధ్యక్షరాలు వైఎస్ షర్మిల పరామర్శించారు. ఆదివారం అల్వాల్ లోని ఆయన నివాసానికి వచ్చి గద్దర్ భా ర్య విమల, కూతురు వెన్నెలను షర్మిల పరామర్శించి తన సంతాపాన్ని తెలియజేశారు. గద్దర్ సమాధికి పూలమాల వేసి ఘనంగా నివాళుల ర్పించారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ..నగరంలో ట్యాంక్ బండ్ పై గదర్ విగ్రహం చేయాలని డిమాండ్ చేశారు.గద్దర్ చరిత్ర ను పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు.

ఉద్యానాల సుందరీకరణకు అధిక ప్రాధాన్యం



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్‌పేట నియోజకవర్గంలో ఉద్యానాల సుందరీకరణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలి పారు. ఈ మేరకు ఆదివారం బర్కత్‌పురలోని హౌ సింగ్ బోర్డు కాలనీలో రూ.1.5 కోట్ల వ్యయంతో ఆధునీకీకరించిన పార్కును స్థానిక కాచిగూడ డివిజన్ కార్పొరేటర్ కె.ఉమారాణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ నియోజక వర్గం లోని నల్లకుంట డివిజన్‌లో నాలుగు, బాగ్ అంబర్ పేట ఎనిమిది, గోల్నాకలో ఆరు, అంబర్ పేట ఒక పార్కు, కాచిగూడ డివిజన్‌లో మరో పార్కును సుందరీకరిం చేందుకు నిర్ణయించినట్లు వెల్లడించారు. అదే విధంగా రూ.52 కోట్లతో మూసారాంబాగ్ బ్రిడ్జి, రూ.50 కోట్లతో చాదర్ ఘాట్ బ్రిడ్జి పనులను చేపట్టనున్నట్లు చెప్పా రు. ఫీవర్ ఆసుపత్రిలో 15 కోట్లతో ఓపీ బ్లాకును ఆధునీకీక రించను న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష యాదవ్, డాక్టర్ ఓం ప్రకాష్ యాదవ్, దిడ్డి రాంబాబు, కాచిగూడ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, దత్రిక్ నాగేందర్ బాబ్జి, ప్రధాన కార్యదర్శి సదా నందు, ఎ.సూర్య ప్రకాశ్‌సింగ్, శీర్సాగర్, ఎస్.అరవింద్, సుభాష్‌పటేల్ గౌడ్, హౌసింగ్ బోర్డు కాలనీ వాకర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదా రులు జి. ఉష అధ్యక్షుడు టి.శేషనారాయణ్, ప్రతినిధులు, రాజశేఖర్రెడ్డి,, వెంకటేశ్వర్‌రెడ్డి, కళ్యాణ్, శివప్రకాశ్, సతీశ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ప్రజలు ఆశీర్వదిస్తారు



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రతి ప్రాంతంలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు మళ్లీ భారీ మెజారిటీతో గెలిపించి ఆశీర్వదిస్తారని స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. ఆదివారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని విజయ్ నగర్ కాలనీ, మారుతి నగర్‌లలో 101 రోజు ప్రగతి యాత్రలో భాగంగా ఎమ్మెల్యే కెపి. వివేకానంద్, స్థానిక కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్‌తో కలిసి పర్యటించారు. అనంతరం పాదయాత్ర చేస్తూ పూర్తి చేసిన అభివృద్ధి పనులను పరిశీలించి మిగిలి ఉన్న సమస్యలను ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించి తమ కాలనీలను అభివృద్ధి పరిచినందుకు ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట ప్రకారం కాలనీల అభివృద్ధికి కృషి చేసినందుకు కాలనీవాసులంతా ఎమ్మెల్యే వెంటే ఉంటామని హామీ ఇచ్చారు. మిగిలి ఉన్న చిన్నపాటి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో అక్కడే ఉన్నసంబంధిత అధికారులకు వ్యయప్రణాళికలు సిద్ధం చేసి వాటిని త్వరతగినగా పూర్తి చేయాలనీ ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర చేస్తూ ప్రజా సమస్యలను శాశ్వతంగా అధిగమించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతి కాలనీ, బస్తీ రూపురేఖలు మారుతున్నాయన్నారు. సంక్షేమ సంఘాలు ఇదే ఐక్యతతో ఉంటూ అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ సీనియర్ నాయకులు, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల కార్యవర్గ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి

- చెరుకుపల్లి భరత సింహారెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 132 జీడిమెట్ల పరిధిలో గాయత్రీ నగర్ ఫేస్-2లో గత పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా రోడ్లు అన్నీ డ్యామేజ్ అయ్యాయి అని, డ్రయినేజీ (యుజీడీ) పైప్ లైన్ ఓవర్ ఫ్లో అయ్యి ఇబ్బంది పడుతున్నాం అని ప్రజలు తెలియజేయడంతో బి.జె.పి మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి కాలనీ వాసులతో కలసి కాలనీలో పర్యటించారు. కాలనీ వాసులను సమస్య అడిగి తెలుసుకొని సంబంధిత చింతల్ వాటర్ వర్క్స్ అధికారులకు జీహెచ్ఎంసీ సిబ్బందికి తెలియజేసి, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అచ్యుత్ వర్మ, టి.మహేందర్ సింగ్, విజయ భాస్కర్ రెడ్డి,



శ్రీరాములు, గౌతమ్, సంజీవ రెడ్డి, రిజేష్, రమేష్, కృష్ణ మూర్తి, కానీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో సమస్యలను పరిష్కరించాలి



- జనసేన నేత నేమూరి శంకర్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయ సిద్ధాంతాలను ప్రజల ముందుకు తీసుకొచ్చే విధంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఓల్డ్ బోయిన్‌పల్లి 119 డివిజన్ నుండి తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ జనంలోకి జనసేన పాదయాత్రలో భాగంగా బోయినపల్లి డివిజన్‌లో జనసేన పార్టీ జెండా ఎగరవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ రాష్ట్ర కూకట్ పల్లి ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యం జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజలవద్దకు తీసుకువెళ్లడమే అన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో డివిజన్లలో ఉన్న సమస్యలు తెలుసుకున్నామని తెలిపారు. డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో త్రాగు నీరు, రోడ్లు, సమస్యలు ఉన్నాయని ప్రజలు శంకర్ గౌడ్‌కు విన్నపించుకున్నారని, ప్రభుత్వం వెంటనే ఈ సమస్యలు పరిష్కరించాలన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను ఆదరించాలని కోరారు. రాబోయే రోజులలో ప్రజలందరూ తమకు సహకరిస్తే, ప్రజలకు సేవ చేసేందుకు జన శ్రేణులు తోడుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బోయినపల్లి డివిజన్ నాయకులు లక్ష్మణరావు, లింగలరాజు, విష్ణు సాయి, హైదరాబాద్ కమిటీ సెక్రటరీ, మండలి దయాకర్, డివిజన్ కోఆర్డినేటర్లు కొల్లా శంకర్, వేముల మహేష్, జన సైనికులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బౌరంపేట్ గ్రామం లో శ్రీ బంగారు మైసవ మ్మ ఆలయ వార్షికోత్సవం , బోనాల పండుగ జాతరలో ఆదివారం ఎమ్మెల్యే కె.పి వివేకానంద ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని ప్రజలు సుఖ సంతోషాలతో ఆరోగ్యాలతో ఉండేలా చూడాలని వేడుకున్నానని తెలిపా రు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రంగారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జీవన్, కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులూ మురళి యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, ధర్మ రెడ్డి, ఎస్ వీ సురేందర్ రెడ్డి, వీర రెడ్డి, రాఘవ రెడ్డి, మహిపాల్ రెడ్డి, రాజి రెడ్డి, శేఖర్, కృష్ణ పాల్గొన్నారు.



జాతీయ జెండాను ఆవిష్కరించనున్న ఎమ్మెల్సీ



నవతెలంగాణ-దుండిగల్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కు మురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ (సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం)లో ఆగస్టు 15వ తేదీన జరిగే వేడుకలకు ప్రభుత్వ విప్,మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా పోలీసు గౌరవ వందనం స్వీకరణ, జిల్లా ప్రగతిపై ప్రసంగం చేయనున్నారు. సంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ప్రశంసా పత్రాలను అందజేయనున్నారు.

జూబ్లీహిల్స్‌లో భారత్ వర్ష్ స్టోర్ ప్రారంభం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

భారత శిల్పకళ విశిష్టతను వివరిస్తూ అద్భుత కళాఖండాలతో సందర్శకులను ఆకట్టుకునే భారత్‌వర్ష్‌స్టోర్ జూబ్లీహిల్స్ రోడ్డు నెం.22లో కొలువుదీరిందని, ఆధ్యాత్మికతను పంచి దేవతామూర్తుల శిల్పాలు, అద్భుతంగా కళాఖండాలు ఇందులో ఉన్నట్లు నిర్వాహకులు డాక్టర్ దివ్య విష్ణులు తెలిపారు. దేశంలోని ఆయా ప్రాంతాలలోని విశిష్టత కలిగిన చెట్ల నుంచి సేకరించిన కలపతో చెక్కిన కళాఆకృతులు పలువురుని ఆకట్టుకుంటున్నాయని వాటిని సందర్శించినవారు తెలియజేశారు. అద్భుత కళాఖండాలను నగరవాసులకు అందించేందుకు స్టోర్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. నగరంలో మొట్టమొదటిసారిగా కలపతో చేసిన కళాఖండాల ప్రదర్శన, విక్రయాలను నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

అర్హులైన వారందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

ప్రజలకు పూర్తి సహకారం అందిస్తాం : డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్



నవతెలంగాణ-అంబర్‌పేట

అర్హులైన వారందరూ ఓటు హక్కు నమోదు చేసు కోవాలని, ప్రజలకు పూర్తి సహకారం అందిస్తామని డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ అన్నారు. ఆదివారం అం బర్‌పేట డివిజన్ పరిధిలోని గ్రీన్ ల్యాండ్ హోటల్ వద్ద జీహెచ్ఎంసి ఆధ్వర్యంలో జరుగుతున్న 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు కొత్త ఓటరు నమోదు అలాగే ఓటు లేని వారు కొత్తగా ఓటు నమోదు కేంద్రాన్ని జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ మారుతి ప్రసాద్ పరిశీలించారు. ఏఎంసీ రవి, బీజేపీ నాయకులు వెంకట్ రెడ్డి, గంధమాల ఆనంద్‌గౌడ్,బుచ్చిరెడ్డి, బీరప్ప ఐలి శ్రీనివాస్, తిరుపతిగుప్తా, మనోజ్ , పరశురాం అధికారులు శివ, వేణు, పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే సంక్షేమ ఫలాలు అందరికీ

● మున్నూరుకాపుల జర్నలిస్టు పోరం



నవతెలంగాణ-బంజారాహిల్స్

మున్నూరుకాపులు ఐక్యంగా ఉంటేనే సంక్షేమ ఫలాలు అందరికీ సమానంగా లభిస్తాయని తెలంగాణ మున్నూరుకాపుల జర్నలిస్టు పోరం రాష్ట్ర అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్ అన్నారు. టీఎంకేజేఎఫ్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పగడాల అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులంలో ఐక్యత ముఖ్యమని, రాష్ట్రంలో 20శాతానికి పైగా మున్నూరుకాపుల జనాభా ఉన్నా నేటికీ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగలేదన్నారు. ప్రత్యేక కార్పొరేషన్ సాధనతో పాటు జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యమే లక్ష్యంగా కలిసి కట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఇతర సామాజిక వర్గాలకు వసతి గృహాలు ఉన్నాయని, మున్నూరు కాపు పిల్లలకు వసతి గృహం లేకపోవడంతో చదవుకోవడానికి నగరానికి వచ్చే వందలాది మంది విద్యార్థులు కిరాయి గదుల్లో ఉంటూ చదువుకొనసాగిస్తున్నారన్నారు. కుల సంఘాలకు ప్రభుత్వం స్థలాలు కేటాయిస్తున్నదని, అందుకు జీవో సైతం ఉందని, కేవలం ఐక్యత లేకే అది సాధ్యం పడడం లేదన్నారు. బాల బాలికలకు వసతి గృహ నిర్మాణం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. జర్నలిస్టు సంఘంగా కులం ఐక్యతకు తమ వంతు కృషి చేస్తామని, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కమిటీ వేసి మున్నూరు కాపు జర్నలిస్టులను ఏకతాటిపైకి తీసుకువచ్చామన్నారు. ఐదు వేల మంది సభ్యత్వంతో గతేడాది కరీంనగర్లో మొదటి ప్లీనరీ విజయవంతంగా నిర్వహించామని, సెప్టెంబర్ హైదరాబాద్ నగరంలో రెండో ప్లీనరీ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.మున్నూరుకాపు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షులు బాల శ్రీనివాస్ మాట్లాడారు. ఈ సమావేశంలో తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర సలహాదారులు యోగేశ్వర్ రావు, ముఖ్య సలహాదారులు గోపాల రమేశ్, చందు జనార్ధన్, డాక్టర్ పార్వతం వెంకటేశ్వర్లు, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి పెరుక రమేశ్ పటేల్, మేడ్చల్, మహబూబాబాద్ జిల్లాల అధ్యక్షులు వెంకటాది, ఉంగరాల సమ్మయ్య, కరీంనగర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేల్పుల శ్రీనివాస్, రమణ, ఉపాధ్యక్షులు మధు, జగిత్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వంగాల రమేశ్, సీనియర్ జర్నలిస్టులు కంటే సాయన్న, గజ్జెల శ్రీనివాస్, భాస్కర్, సంతోష్, యూత్ ఫోరం కన్వీనర్లు ఎర్రం తేజా పటేల్, అభిషేక్ పటేల్, సాయిచరణ్ పటేల్, ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు కొత్త శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ఎనుముల రాజు, సీనియర్ నాయకులు మాదాసు సంఘమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ

● దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో అత్యధిక అభివృద్ధి

● మంత్ర తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని రాష్ట్ర పశుసం వర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశం మంత్రి శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొమ్మిదిన్నర సంవత్సరాలలో సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో రోడ్లు, డ్రయినేజీ, వాటర్‌లైన్‌లు, పార్కుల అభివృద్ధి, దేవాలయాల అభివృద్ధి వంటి పలు అభివృద్ధి పనులు జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా మొట్టమొదటగా మన నియోజకవర్గ పరిధిలో చేపడుతున్నట్లు వివరించారు. అన్ని మతాల ఆచారాలను, సంస్కృతులను గౌరవించే విధంగా బోనాలు, బతుకమ్మ, గణేష్ నవరాత్రులు, రంజాన్, క్రిస్మస్, వంటి అన్ని పండుగలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వస్తున్న విష యాన్ని గుర్తుచేశారు. అంతేకాకుండా పేద, మద్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని అనేక సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. వినూత్న కార్యక్రమాలను చేపట్టి దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శం గా నిలిచిందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా అందుతున్నాయని, అందరికి అందే విధంగా కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎలాంటి అవసరమున్నా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, కార్పొరేటర్‌లు కొలన్ లక్ష్మి, టి.మహేశ్వరి, హేమలత, మాజీ కార్పొరేటర్‌లు ఆకుల రూప, అత్తిలి అరుణ, డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, ఆకుల హరికృష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, రాజు, హన్మంతరావు, తదితరులు పాల్గొన్నార

● అభివృద్ధిని చూడలేని కబోదులున్నారు

రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కండ్ల ముందు కనిపిస్తున్నా బీజేపీ, కాంగ్రెస్ నేతలు కండ్లు ఉండి కూడా చూడలేని కబోదులుగా మారారని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎద్దేవా చేశారు. ఇండ్లు లేని పేద ప్రజల కోసం నగరంలో ప్రభుత్వం లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించిందని, బీజేపీ, కాంగ్రెస్‌పార్టీ కార్యాలయాల వద్ద ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మీకు కనిపిస్తలేవా అని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుం డటంతో మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నంత కాలం పదవులను కాపాడుకోవడం, తమ వారి బాగుకోసమే కాంగ్రెస్ నాయకులు పరితపించారని ఆరోపించారు. కేసీఆర్ నాయకత్వంలో అద్భుతమైన పాలన సాగుతుందని, ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన దళిత బంధు పథకం అమలులో దేశంలోనే పెద్ద కదలికను తీసుకొస్తుందని, అన్ని రాష్ట్రాలలో ఈ పథకం అమలు కోసం ప్రజల నుండి డిమాండ్ రాబోతుందని మంత్రి శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమాన్ని చేపట్టాల్సిన పరిస్థితి వస్తుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

17న రవాణారంగా కార్మికుల మహాసదస్సు



●తెలంగాణ రాష్ట్ర రవాణా రంగా కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ బి.వెంకటేశం

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రవాణా రంగా కార్మికుల సమస్యలు తక్షణ పరిష్కారానికి వేలాది మంది కార్మికులతో 17వ తేదీన రవాణా రంగా కార్మికుల మహా సదస్సు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర రవాణారంగా కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ బి.వెంకటేశం వెల్లడించారు. ఈ మహాసదస్సుకు తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా, అన్ని ప్రముఖ కార్మిక సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌరవ అతిథిలుగా హాజరవుతారని ఆయన తెలిపారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఎన్.సత్య నారాయణరెడ్డి భవన్‌లో తెలంగాణ రాష్ట్ర రవాణా రంగా కార్మిక సంఘాల జేఏసీ సమావేశం ఆటో జేఏసీ అధ్యక్షులు మహమ్మద్ అమానుల్లా ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో సిహెచ్. జంగయ్య (ఏఐటీయూసీ),వి.మారయ్య (బీఆర్‌టీయు), శ్రీకాంత్, అజయ్ బాబు (సీఐటీయూ), ఎ.సత్తిరెడ్డి (టీఏడీఎస్), కిరణ్ (ఐఎఫ్‌టీయూ), నగేష్ (బీఆర్ఎస్ కెవి), తిరుమలేష్, డి.ఆంజనేయులు, షేక్ సలావుద్దీన్, సతీష్, సురేష్ నంద (క్యాబ్స్ యూనియన్)లతో పాటు అన్ని ఆటో, క్యాబ్, ట్రక్, ట్రాలీ, లారీ, బస్సు కార్మికులు, డ్రైవర్లు, ఓనర్ల సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బి.వెంకటేశం మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి రవాణా రంగా కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని, లెక్కలేనన్ని వినతి పత్రాలు, ధర్నాలు, ప్రదర్శనలు చేసిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ముందుగా రవాణా రంగా కార్మికుల కోసం కార్మికుల సంక్షేమబోర్డును ఏర్పాటు చేసి, ఈఎస్ఐ, పి.ఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆగష్టు 17న వేలాది మందితో జరిగే రవాణా రంగా కార్మికుల మహా సదస్సులో రవాణా రంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కరానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు భవిష్యత్తు ఉద్యమ ప్రణాళికను రూపొందిస్తామని బి.వెంకటేశం పేర్కొన్నారు.ఈ సమావేశంలో జేఏసీ నేతలు సంతోష్, కిరణ్, జనార్దన్, సయ్యద్ మొయిజ్, చంద్రకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయాలని సీపీఎం ఆందోళన



నవతెలంగాణ-ఓయూ

అడ్డగుట్టలో కమ్యూనిటీ హాలు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి అజయ్‌బాబు నాయకులు ఆర్.మల్లేష్,యం. గోపాల్‌లు మాట్లాడుతూ అడ్డగుట్టమల్టి పరపస్ కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం 3 సంవత్సరాల కిందట పద్మారావు, ఎంపీ కిషన్‌రెడ్డి, ఎంఎల్‌సీ రాంచందర్‌రావు, కార్పొరేటటర్ విజయకుమారిలు శంకుస్థాపన చేశారని, ఇంకా అది పూర్తి కాలేదన్నారు. ఈ ప్రాంతంలో పేద ప్రజలు ఎక్కువగా నివాసం ఉంటున్నారని, పెండ్లిలకు, పలు శుభాకార్యాలకు భారంగా ఉంటుంది ఇప్పటికైన స్పందించి వెంటనే ఎన్నికల ముందే మల్టి పరపస్ కమ్యూనిటీ హాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం పార్టీ కోరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యం. కిరణ్, నర్సయ్య, జయప్రకాశ్, శంకర్, ప్రవీణ్, సత్యనారాయణ, మధు, అంజమ్మ,యాకమ్మ, పాండు తదితరులు పాల్గొన్నారు.

యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో "లోయర్ లింబ్ జాయింట్ ప్రిజర్వేషన్" లైవ్‌వర్క్ షాప్



నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో "లోయర్ లింబ్ జాయింట్ ప్రిజర్వేషన్"పై 'ప్రిజర్వ్' పేరిట 12,13 తేదీలల్లో హోటల్ ఐటీసీ కాకతీయలో రెండు రోజులు అంతర్జాతీయ జాయింట్ రీప్లేస్‌మెంట్స్ కాన్ఫరెన్స్ అండ్ లైవ్ వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు ఆస్పత్రి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్. జి.యస్.రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు అండ్ ఇండియన్ కోచ్ పుల్లెల గోపీచంద్‌లతో కలిసి సదస్సును ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గోపీచంద్, మాట్లాడుతూ భారతదేశంలో ఆర్థ్రైటిస్ 180 మిలియన్ల కంటే ఎక్కువ మందిని ప్రభావితం చేస్తుందని, మధుమేహం, క్యాన్సర్ వంటి అనేక వ్యాధుల కంటే "ఆర్థరైటిస్" బారిన పడే వారి సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. సాధారణ గాయాల కారణంగా లేదా వృద్యాప్యంలో ఆర్థరైటిస్ కారణంగా కీళ్ళు దెబ్బతిన్నప్పుడు, పేషెంట్స్ సాధారణంగా మొత్తం జాయింట్ రీప్లేస్‌మెంట్‌ల నుండి ఎంతో ప్రయోజనం పొందుతారన్నారు. ప్రారంభ దశలో కీళ్లను సంరక్షించడం వల్ల ఆర్థరై టిస్ అభివృద్ధిని నివారించవచ్చని ఆయన తెలిపారు. ఈ రెండు రోజుల అంతర్జాతీయ కాన్ఫరెన్స్ అండ్ లైవ్‌వర్క్‌షాప్‌లో "ఆర్థోఎడిక్" వైద్య రంగంలో, జాయింట్ రీప్లేస్మెంట్స్‌లో అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక వైద్య విదానాలను జాతీయ, అంతర్జాతీయ వైద్య నిపుణులతో ప్రత్యక్ష వర్క్‌షాప్ అండ్ ఇంటరాక్టివ్ శిక్షణా సెషన్స్ నిర్వహించినట్లు తెలిపారు. అంతర్జాతీయ అధ్యాపకులు రోబోటిక్ శిక్షణ, లైవ్ సర్జరీ, వీడియో ఆధారిత బోధనతో జ్ఞానమార్పిడిని పొందడానికి ఇది ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల నుండి 500 మందికి పైగా ఆర్థోపెడిక్ సర్జన్లు పాల్గొన్నారని సీనియర్ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ డాక్టర్.నితిన్ కుమార్ తెలిపారు. జి.యస్.రావు మాట్లాడుతూ ఈ సదస్సులో అత్యాధునిక రోబోటిక్, లాపరోస్కోపిక్, ఓపెన్‌టెక్నిక్ ద్వారా అనేక ఆర్థోపెడిక్ సర్జరీలు విజయవంతంగా ఏలా నిర్వహించాలో ఈ సద స్సుకు హాజరైన యువ సర్జన్లకు (ప్రత్యక్ష) లైవ్ సర్జికల్ వర్క్‌షాప్ ద్వారా వివరించినట్లు తెలిపారు. ఆర్థోవైద్య రంగంలో దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 20 మంది ప్రముఖ అంతర్జాతీయ జాతీయ ఆర్థోపెడిక్ వైద్య నిపుణుల తోవారి అనుభవాలను పంచుకునే విధంగా ఈ రెండు రోజుల అంతర్జా తీయ సదస్సు, లైవ్‌వర్క్‌షాప్ రూపొందించినట్లు ఆయన తెలియజేశారు.

పేదలకు పట్టాలు ఇప్పించేందుకు మంత్రి కేటీఆర్ ప్రయత్నాలు : క్రిశాంక్



నవతెలంగాణ-కంటోన్మెంట్

రసూల్‌పురలోని పేదలకు పట్టాలు ఇప్పించేందుకు మంత్రి కేటీఆర్ ప్రయత్నాలు చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారని తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మన్నె క్రిశాంక్ తెలిపారు. కంటోన్మెంట్ వార్డ్-2,శివనగర్‌లో 19వ బస్తీనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికుల నుంచి పలు సమస్యలను తెలుసుకున్నారు. ప్రధానంగా జీఓ58, 59 కింద వచ్చే భూమికి పట్టాలు ఇప్పించాలని, అలాగే కంటోన్మెంట్ బోర్డు సక్రమంగా మురికివాడలలో పరిశుభ్రత పనులు చేయడం లేదని, దీంతో చెత్త పేరుకు పోతుందని, అలాగే వీధి దీపాల సమస్య ఉందని ఉందని రాత్రి సమయాలలో ఇండ్లకు చేరాలంటే ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా క్రిశాంక్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ పట్టాల సమస్యపై సానుకూలంగా స్పందించి రక్షణ మంత్రికి లేఖ రాశారని తెలిపారు. ఇప్పటికే కంటోన్మెంట్ సమస్యలను మంత్రి కేటీఆర్‌అంచలవారిగా పరిష్కరిస్తున్నారని, బోర్డు ప్రాంతంలో స్కైవే ఓవర్లు నిర్మాణం చేపట్టేందుకు కేటీఆర్ చేసిన ప్రయత్నాలు ఫలించిన విషయాన్ని కడా ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కంటోన్మెంట్‌లోని పౌర భూములును అప్పగిం చాలని కోరినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సాయిలు, రాములు, నర్సింహ, మధు, జాన్సన్, రాజు, మోని, రఘు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పుట్టి యాదగిరి ముదిరాజ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ముదిరాజ్‌లకు వెయ్యి కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పుట్టి యాదగిరి ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ముదిరాజ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 25వ తేదీన నిర్వహిస్తున్న మాజీ మేయర్ దివంగత కృష్ణ స్వామి ముదిరాజ్ జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య, బీసీ సంక్షేమసంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణలకు ఆది వారం ఆయన ఆహ్వానపత్రికను అందజేశారు. పుట్టి యాదగిరి ముదిరాజ్ మాట్లాడుతూ మాజీ మేయర్ కృష్ణ స్వామి ముదిరాజ్ కాస్య విగ్రహాన్ని ప్రభుత్వం ట్యాంక్ బండ్ పై నెలకొల్పి, కృష్ణ స్వామి ముదిరాజ్ జ యంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని కోరారు. ముదిరాజ్ కులాన్ని బీసీ'డీ' గ్రూప్ నుంచి బీసీ 'ఏ ' గ్రూపు లోకి మార్చాలని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజులంతా రాజకీయాలకతీతంగా ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో సంఘం రాష్ట్ర ప్రధాన సలహాదారులు తూర్పు రామచందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి వి.బాలరాజు ముదిరాజ్, ఉపాధ్యక్షులు డొప్పు అంజయ్య ముదిరాజ్, మల్లంపేట సతీష్ ముదిరాజ్, బ్రహ్మం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి



● ప్రభుత్వం స్పందించకపోతే 16 నుండి సమ్మె చేపడతాం

● ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ హెచ్చరిక

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలో నేషనల్ హెల్త్‌మిషన్‌లోని పీహెచ్‌సీ, యుపీఎస్‌సీ, ఆర్‌బీఎస్‌కేలలో పని చేస్తున్న రెండవ ఏఎన్ఎం అందరిని బేషరతుగా రెగ్యులర్ చేయాలని, లేని యెడల 16 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని ఏఐటయూసీ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ అధ్యక్షురాలు బి.వనజ అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎంల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం. నరసింహ మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెండవ ఏఎన్ఎం లందరిని బేషరతుగా రెగ్యులేషన్ చేయాలని పోరాటం చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకుండా నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. పక్కనున్న ఆంధ్ర రాష్ట్రంలో ఈ రెండవ ఏఎన్ఎం లందరికీ కేవలం అంతరంగిక పరీక్ష పెట్టి రెగ్యులర్ చేసిన విషయాన్ని ప్రభుత్వం గమనించాలన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కాంట్రాక్ట్ పద్ధతి ఉండబోదని హామీ ఇచ్చిన అప్పటి ఉద్యమ నాయకుడు నేటి ముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్రంలో కాంట్రాక్ట్ పద్ధతిన నియమాకాలు చేపట్టడం సిగ్గుచేటు అన్నారు. ధనిక రాష్ట్రం అని చెప్పుకునే రాష్ట్రంలో జీతాలు విడుదల చేయడానికి సమయం తీసుకోవడం దురదృష్టకరమన్నారు. కరోనా కష్టకాలంలో రోజుకు 1,000 మందికి పైగా వ్యాక్సిన్ వేసిన రెండవ ఏఎన్ఎంలను విస్మరించటం సరికాదన్నారు. మేమేమీ ఇప్పటికి ఎప్పుడు నిర్ణయం తీసుకొని సమ్మెకు దిగటం లేదని గత కొంత కాలంగా బేషరతుగా రెగ్యులర్ చేయాలని పోరాటం చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా ఆలోచన చేసి వారిని సమ్మెకు వెళ్లకుండా ఉండేందుకు చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేకపోతే హెల్త్‌మిషన్‌లోని పీహెచ్‌సీ, యుపీఎస్‌సీ, ఆర్‌బీఎస్‌కేలలో పని చేస్తున్న రెండవ ఏఎన్ఎం లందరూ ఈనెల 16వ తేదీ నుండి సమ్మెకు దిగనున్నట్టు ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, రాష్ట్ర నాయకులు తోట రామాంజనేయులు, ఎం.రామ్మోహన్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన రెండవ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు విడుదల చేయాలి



● పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

నవతెలంగాణ-అడక్‌మెట్

గతమూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ స్కాలర్ షిప్స్ బకాయిలు రూ.5500 కోట్లు, వెంటనే విడుదల చేయాలని ప్రగ తిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది.ఈ మేరకు విద్యా నగర్‌లోని చంద్ర పుల్లారెడ్డి భవన్‌లో పీడీఎస్‌యు రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మామిడి కాయలపరశురాం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఇడంపాక విజయ్‌కన్నా, హాజరై మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 13లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు కోసం ఎదురు చూస్తున్నారని, గత రెండు విద్యా సంవ త్సరం కాలం నాటి బకాయిలు చెల్లించ కుండా ప్రభుత్వం కాలయాపన చేయ డం సరికాదని అన్నారు. అటు ప్రయి వేటు విద్యా సంస్థల యాజమాన్యంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అప్లికేషన్‌ను సకాలంలో అం దజేసిన వాటికి కూడా నిధులు మంజూరు చేయ టంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నా రు. ట్రెజరీ డిపార్టుమెంట్ నిధుల కోసం టోకెన్స్ కేటా యించి డబ్బులు విడుదల చేయకుండా కాలయాపన చేసి ఇప్పుడు నిధులులేవు అని నిర్లక్ష్య సమాధానమివ్వటం, సరియైన పద్ధతికాదని, వెంటనే. ఎస్సీ, ఎస్టీ,,బీసీ ఈబీసీ విద్యార్థులకు పూర్తిగా బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తునరాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హె చ్చరించారు. రాష్ట్ర ఉపా ధ్యక్షులు నేతకాని రాకేష్, రాష్ట్ర సహా య కార్యదర్శి ఏ. సాంబ, రాష్ట్ర కోశాధికారి ఎం.వెంకటరెడ్డి, నాయ కులు గణేష్, నర్సింహరెడ్డి పాల్గొన్నారు

క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహకం

● మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

సెప్టెంబర్ 8వ తేదీన గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్న బుక్‌మైషోలైవ్ ప్రొడక్షన్‌లో భాగంగా దేశంలో ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్ నగరంలో తొలిసారిగా నిర్వహించనున్న డబ్ల్యుడబ్ల్యుఎఫ్ సూపర్‌స్టార్ స్పెక్టాకిల్‌షో కోసం రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ , రాష్ట్ర క్రీడా శాఖ ప్రభు త్వ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యార్, స్పోర్ట్స్ చైర్మెన్ డాక్టర్ ఆం జనేయగౌడ్‌తో కలిసి ఆదివారం బంజారా స్వామి మం త్రుల నివాసంలో ఆవి ష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పాటు అనంతరం క్రీడలకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తు న్నామని, దేశంలోనే రెండోసారిగా అత్య ంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డబ్ల్యుడబ్ల్యుఎఫ్ కార్యక్రమంలో అంత ర్జాతీయంగా పేరు ఉన్న 28 మంది డబ్ల్యు డబ్ల్యుఎఫ్ క్రీడాకారులు పాల్గొం టారని మంత్రి తెలిపారు.ఈ ఈవెంట్‌లో ప్రపంచ హెవీ వెయిట్ ఛాంపియన్ షిప్ సాధించిన ఫ్రీకిన్ రోలెన్స్ ఉమెన్ వరల్డ్ ఛాంపియన్ రియారిప్లే, అన్ స్టాపబుల్ ప్లేయర్స్ సమిజైన్, కెవిన్, ఓవెన్స్‌తోపాటు ఇంటర్ కాంటినెంటల్ ఛాంపియన్షిప్ సాధించిన ప్రతిష్టాత్మక ఇంటర్కన్టినెంటల్ ఛాంపియన్, "ది రింగ్ జనరల్" గన్థర్, సహితంగ జిండర్ మహల్, వీర్, సంగ, డ్రూ మింట్టైర్, బెక్కీ లించ్, నటాల్యా, మాట్ రిడ్లు, లుడ్విగ్ కైజర్, ప్రఖ్యాత డబ్ల్యుడబ్ల్యుఎఫ్ క్రీడాకారులు పాల్గొంటారని మంత్రివెల్లడించారు. ఈ కార్యక్రమంలో బుక్ మై షో లైవ్ నిర్వాహకులు ఉనిత్,హరీష్ రెడ్డి, క్రీడా శాఖ అధికారులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో మాజీ కాంగ్రెస్ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి పాదయాత్ర



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్‌నియోజకవర్గంలో దివంగత పి.జనార్దన్‌రెడ్డి కుమారుడు, మాజీ కాంగ్రెస్ ఎమ్మె ల్యే విష్ణువర్ధన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక నాయకులతో, రహమత్‌నగర్, శ్రీరామ్ నగర్, బోరబండలో, ఇంటింటికి పాదయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన లంబాడి మహిళలు ఆటపాటలతో, డ్యాన్సులతో ప్రజలను ఆకర్షించారు. మొదటగా సంజయ్‌నగర్‌లోని వడ్డెరబస్తీ నాయకుడైన తిరుపతి ఆధ్వ ర్యంలో సుమారు 100 మంది రహమత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు లియాకత అలీ నాయకత్వంలో, కాంగ్రెస్ పార్టీలో చేరి విష్ణువర్ధన్ రెడ్డి చేతుల మీదు గా కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఈ పాదయాత్రలో గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు, విష్ణు వర్ధన్ రెడ్డి పాద యాత్రలో పాల్గొనలేదని, విష్ణువర్ధన్ రెడ్డికి కుడి భుజంగా ఉన్న, రెండుసార్లు రహమత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్‌గా కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన బండపల్లి చంద్రమ్మ కుమారుడు భవానిశంకర్, కొంతమంది స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులను తన వైపు తిప్పుకొని విష్ణువర్ధన్‌రెడ్డి వర్గానికి వ్యతిరేకంగా ఉన్నట్లు తెలిపారు. ఇటీవల జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థిగా నియోజకవర్గంలో ప్రచారానికి వచ్చిన, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌తో కలిసి నియోజకవర్గంలో చాయ్‌పై చర్చలో భాగంగా అన్ని డివిజన్ల నాయకులను కార్యకర్తలను కలిసి ప్రచారం చేసినట్లు తెలిపారు. ఆ ప్రచారంలో విష్ణువర్ధన్‌రెడ్డి వర్గీయులు అజారుద్దీన్ కారుపై దాడి చేసి, అజారుద్దీన్ గో-బ్యాక్ అంటూ నినాదాలు చేసి అతనిని అతని తో పాటు భవాని శంకర్‌ని కూడా అజారుద్దీన్‌తో పాటు వెనుతిరిగి వెళ్లారని తెలిపారు. ఈసారి జూబ్లీహిల్స్ కు కాంగ్రెస్ అభ్యర్థిగా విష్ణువర్ధన్ రెడ్డికి టిక్కెట్ రాదని నిర్ధారించుకొని, విష్ణు వర్ధన్ రెడ్డి కూడా పాదయాత్రలు మొదలు పెట్టాడని, అన్ని డివిజన్లలోని ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఈసారి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎవరు నిల్చుంటారు? అని చర్చలు మొదలైనట్లు తెలిపారు.

పీఆర్‌సీ ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే

● ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన తరహాలోనే పీఆర్సీ ఇచ్చిన ఘనత రాష్ట్ర సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం కోఠి డీఎంహెచ్ఎస్ ఆవరణలో తెలంగాణ వైద్య వైద్య ఆరోగ్య అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఔట్ సోర్సింగ్ జేఏసీ రాష్ట్ర మహాసభ నిర్వ హించారు ఈ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్‌ను చిరు ఉద్యోగులుగా గుర్తించిన సీఎం కేసీఆర్ వారికి తగిన వేత నాలను అందించేలా, ప్రభుత్వ శాఖలలో సేవలందిస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగికి నిరాశ చెందకుండా ఉండేలా కనీస వేతనాలను ఇవ్వాలని అధికారులకు ఆదేశాలను జారీ చేశారని అన్నారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాష్ట్రంలో అతిపెద్ద శాఖ అంటే వైద్య ఆరోగ్యశాఖనేనని ఈ శాఖలో రెగ్యులర్ ఉద్యోగులు 30వేలు ఉంటే , కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 75 వేల మంది ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కనీస వేతన బోర్డు చైర్మెన్ పి.నారాయణ. సభ్యులు శివశంకర్, రాష్ట్ర అధ్యక్షులు దుర్గం శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ రఫీ ఓదిన్, కోశాధికారి సుభాష్, డాక్టర్ శాంతి కుమార్, నర్సింగ్ రావు, వెంకట్ నారాయణ రాథోడ్, సరిత, ప్రవళిక వివిధ జిల్లాల ఉద్యోగుల తదితరులు పాల్గొన్నారు

సారథి 'ప్రొఫెషనల్ రన్నర్ టీమ్'



ఒక పని మొదలు పెట్టినప్పుడు ఎన్ని అడ్డంకులు ఎదురైనా భయపడక, చివరి వరకు లక్ష్యం కోసం శ్రమించడమే కార్యసాధకుని లక్షణం! అలాంటి వారే జీవితంలో విజయం సాధించగలరు. వీరే ఉత్తములు. ఎప్పుడో ఎదురయ్యే ఆటంకాలను తలచుకొని ఏ పని చేయడానికి మొదలు పెట్టని వారు అధములు. ఏదో చేయాలన్న తపనతో మొదలుపెట్టి మధ్యలో ఆటంకాలు ఎదురైతే వదిలేసేవారు మధ్యములు. మనం ఎప్పుడైనా కార్యసాధకుల వలె విజయం సాధించే వరకు కృషి చేస్తూనే ఉండాలి. నలుగురిలో ఉత్తములుగా నిలవాలి. అలాంటి కోవకు చెందిన వారే చేతనా భట్టాచార్య. తన అవసరం నుండి ఒక వ్యాపారాన్ని సృష్టించారు. అదే 'సారథి ప్రొఫెషనల్ రన్నర్ టీమ్'

అవసరం కోసం వ్యాపారం ఏంటా అని అందరికీ కాస్త ఆశ్చర్యంగానే ఉంటుంది. అసలు విషయం ఏమిటంటే చేతన ఒకరోజు తమ ఇంటికి కావలసిన సరుకులు తీసుకురమ్మని భర్తను పంపారు. ఆయన తెచ్చారు కానీ కొన్ని సరుకులు మర్చిపోయారు. ఆ సరుకులను మళ్లీ తెమ్మని పంపించారు. వెళ్ళి తెచ్చారు, కానీ ఈసారి అత్యవసరమైన ఉప్పు మరచిపోయారట. ఉప్పు లేకుండా ఎలా వండాలని, వెళ్ళి ఉప్పు తెమ్మని అంటే, అలసిపోయిన భర్త చిరాగ్గా 'నువ్వే తెచ్చుకో' అన్నారట! అలా ఆరోజు అవసరమైన ఆ ఉప్పు ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసింది. ఇలా వ్యాపారం ప్రారంభించిన చేతనా కంప్యూటర్ అప్లికేషన్స్ బెంగుళూర్‌లో చదివి, ఐఐఎం కోల్‌కతాలో ముగించి సాఫ్ట్‌వేర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు.

దీనికి నేపథ్యం ఏమిటంటే..?

చేతన తనకు కావలసిన సరుకులు ఆన్‌లైన్, మోడ్స్ ద్వారా తెప్పించుకునే వారట. కానీ చాలా తేడాలు కనిపించాయి. అదీగాక వస్తువులు చిత్రాలలో చూపించినట్టు తాజాగా, నాణ్యతగా లేకపోవడం, రవాణా ఖర్చు ఎక్కువ కావడం, స్వయంగా వెళ్లి ఇంటికి కావలసిన సరుకులు తెచ్చుకోవాలంటే ఉద్యోగరీత్యా సమయం లేకపోవడం, ఆ వస్తువులు ఇల్లు చేరేసరికి కనబడని ఎన్నో టాక్స్‌లతో బిల్లు పెరిగిపోవడం, తనకు వచ్చిన సరకులు నచ్చకుంటే వాటిని వాపస్ తీసుకోకపోవడం, ఇలా ఎన్నో కారణాలు ఈ సారథి రన్నర్ టీమ్‌కు నాంది పలికింది.

సవాళ్ళను అధిగమిస్తూ...

సారథి సంస్థను మే 2022లో ప్రైవేట్ లిమిటెడ్‌గా ప్రారంభించారు. కానీ అంతకు ముందే ఈ సేవలను ప్రయోగాత్మకంగా మొదలుపెట్టారు. హైదరాబాదులో నల్ల గండ్ల నుండి 300 మంది వినియోగ దారులకు, ఏడు సంస్థలకు సేవలు అందిస్తున్నారు. అంతేకాదు ప్రతి నెల 8.5 లక్షల గ్రాగ్ మర్చంటేజ్ వాల్యూను సృష్టిస్తున్నారు. ఈ సారథి సంస్థ అంత ఆషామాషీగా ఏమీ నడవలేదు. తనకు కుటుంబం మద్దతు ఎంత ఉన్నా... అందరి పారిశ్రామికవేత్తల వలె ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. సారథి సంస్థను స్థాపించడానికి కావలసిన నిధులు సమకూర్చుకోవడం దగ్గర నుండి వినియోగదారులను సంపాదించడం, వారిని సంతృప్తి పరిచే మంచి ప్రతిభ ఉన్న ఉద్యోగులను నియమించుకోవడం, వారు సక్రమంగా విధులను నిర్వర్తించేలా చూడడం, ఏరోజూ ఆలస్యమన్నది లేకుండా వినియోగదారులకు సేవలు అందించడం... వంటి విషయాల్లో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. సంస్థ ప్రారంభంలో దుకాణాల నుండి మాత్రమే ఆర్డర్లు తీసుకొన్నా తర్వాత కాలంలో సేవలు పెంచడంతో వ్యాపారం అభివృద్ధి చెందింది. సమస్యలన్నింటినీ అధిగమించి లక్ష్యాన్ని చేరుకోగలిగారు.

దేశవ్యాప్తంగా సేవలందించేందుకు

ఒక్క హైదరాబాదులోనే కాకుండా దేశ వ్యాప్తంగా సారథి సంస్థ ద్వారా సేవలందించి మంచి పేరు తెచ్చుకోవడమే ఈమె లక్ష్యం. తద్వారా ఆయా ప్రాంతాలలో ఎందరికో దీర్ఘకాలిక ఉపాధి దొరకుతుందని ఆమె అంటున్నారు. దీని వల్ల చేతన వ్యాపారం అభివృద్ధి చెందడమే కాకుండా ఆయా ప్రాంతాల్లో పర్యావరణ వ్యవస్థ కూడా మెరుగు పడుతుంది. ప్రస్తుతం ఈ సంస్థలో 14 మంది ఉద్యోగులుగా ఉన్నారు. ఒక మహిళా వ్యాపారవేత్త తన మనసు నుండి పుట్టిన ఆలోచనను ఓ సంస్థగా మలిచి మరింత విస్తరింప జేయడం చాలా గొప్ప విషయం. ఇలాగే ఒంటరి మహిళలకు, ఉద్యోగులకు, ప్రయాణ సౌకర్యం లేని దూర ప్రాంతాలకు మరిన్ని సేవలు అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ...





- రంగరాజు పద్మజ



9989758144





కాలం మారిపోయింది. అంతా బిజీబిజీగా మారిపోయారు. రోజూ జిమ్‌కి వెళ్లి వ్యాయామం చేసే సమయం చాలామందికి ఉండదు. పనులు, హాబీలు, భర్త, పిల్లలు, స్నేహితులు.. ఇలా సమయం కేటాయించాల్సిన అంశాలు, అవసరాలు ఎన్నో.. ఎన్నెన్నో.. బరువు తగ్గాలని చాలామంది భావిస్తారు. కాస్త బరువు తగ్గి సన్నగా మారడం ఎలా? అని చాలామంది ఆలోచిస్తూ ఉంటారు. ఇలాంటప్పుడు ఏం చేయాలి అనుకుంటున్నారా? కొన్ని చిట్కాలు ఫాలో అయిపోతే చాలు జిమ్‌కి వెళ్లకుండానే బరువు తగ్గిపోవచ్చు. మరి అవేంటో తెలుసుకుందాం...

జిమ్‌కి వెళ్లకుండానే...

ఇంటి పనులన్నీ పనిమనిషికి అప్పగించకుండా మీకు కాస్త ఖాళీ సమయం దొరికినా, చేయగలిగే పనులు ఎంచుకొని వాటిని పూర్తిచేస్తే సరిపోతుంది. మిగిలిన పనులను పనిమనిషికి అప్పగించండి. ఉదాహరణకు ఇంటిని తుడిచి శుభ్రం చేసుకోవడం చేయండి. దీని వల్ల క్యాలరీలు కరగడంతో పాటు ఇంటిని శుభ్రంగా ఉంచుకుంటున్నారనే సంతృప్తి కూడా సొంతమవుతుంది.

చిన్న చిన్న వ్యాయామాలు..

కొన్ని చిన్న చిన్న వ్యాయామాలు చేయడానికి జిమ్ దాకా వెళ్లాల్సిన అవసరం లేదు. దీనికి పెద్దగా సమయం కూడా అవసరం ఉండదు. క్రంచెస్, పుషప్స్, లెగ్ లిఫ్ట్, స్కిప్పింగ్, మెట్లు ఎక్కడం వంటి వ్యాయామాలు చేయడం వల్ల యాక్టివ్‌గా ఉండడంతో పాటు బరువు కూడా తగ్గించు కోవచ్చు. ఇవి అన్నీ ఒకేసారి చేయాలనేమీ లేదు. ఖాళీ ఉన్నప్పుడల్లా ఓ ఐదు నిమిషాలు కేటాయించుకుంటూ ఒక అరగంట పాటు సమయం కేటాయించగలిగితే చాలు.

డ్యాన్స్..

ఖాళీ దొరికితే చాలు టీవీ చూస్తూ సోఫాకి అతుక్కుపోవడం కాదు. అదే టీవీ చూస్తూనో లేక మ్యూజిక్ సిస్టమ్‌లో పాటలు పెట్టుకునో డ్యాన్స్ చేయడం వల్ల అటు క్యాలరీలు కరగడంతో పాటు ఇటు ఒత్తిడి కూడా తగ్గుతుంది. రోజూ కనీసం పావుగంట పాటు మంచి సంగీతం వింటే డిప్రెషన్ కూడా దూరమవుతుందట. ఆ పాటలు వింటూ డ్యాన్స్ చేయడం వల్ల మీ మెటబాలిజం మరింత వేగవంతం అవుతుంది. నవ్వుతూ, తుళ్లుతూ నృత్యం చేయడం వల్ల తెలియకుండానే కొవ్వు కరిగిపోతుంది.

తక్కువ తినడం...

బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ అంటూ రోజూ మూడు మీల్స్‌ని తినాలని పెద్దలు చెప్పారంటే దానికో కారణం ఉంటుందని గుర్తుంచుకోండి. వీటి మధ్యలో మళ్లీ ఏదైనా హెవీగా తింటే కొవ్వు పేరుకుపోతుంది. తినే డైట్‌లో ఆరు చిన్న చిన్న మీల్స్ ఉంటే తక్కువ మోతాదులో తినడం అలవాటు చేసుకోవాలి. ఆయిలీ ఫుడ్ కాకుండా ఆరోగ్యకరమైనవి ఎంచుకుంటే మంచిది. కూరగాయలు, పండ్లు, పనీర్ వంటి ప్రొటీన్ ఎక్కువగా ఉన్న ఆహారంతో పాటు పెరుగు వంటి ప్రొబయోటిక్స్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.

డిన్నర్ త్వరగా...

చాలామంది రాత్రిపూట భోజనం చేయడానికి ఆలస్యం చేస్తూ ఉంటారు. రోజులో ఇదొక్క పూటే హడావిడి లేకుండా ప్రశాంతంగా తినాలని.. నచ్చినవన్నీ తినేందుకు కూడా ఆసక్తి చూపిస్తుంటారు. ఇలా చేయడం వల్ల తిన్న ఆహారం పడుకోకముందే అరిగి దాన్ని శక్తిగా మార్చుకునేందుకు శరీరానికి ఏమాత్రం సమయం ఉండదు. ఫలితంగా ఈ ఆహారాన్ని శరీరం కొవ్వుగా దాచి ఉంచుతుంది. అందుకే రాత్రి నిద్రపోవడానికి కనీసం మూడు నాలుగు గంటల ముందే ఆహారం తీసుకునే ప్రయత్నం చేయాలి. దీనివల్ల ఆహారం సరిగ్గా అరిగిపోవడంతో పాటు క్యాలరీలు కూడా కరిగే అవకాశం ఉంటుంది.

నడక మంచిదే...

చిన్న చిన్న పనులకు కూడా వాహనాలు ఉపయోగించకుండా నడవడం వల్ల కొన్ని క్యాలరీలు కరుగుతాయి. కాస్త ఇబ్బందిగా అనిపించినా నడక శరీరానికి ఆరోగ్యాన్ని అందించడంతో పాటు బరువు కూడా తగ్గిస్తుంది. మీకు సైకిల్ తొక్కడం అంటే ఇష్టమైతే.. దాన్ని కూడా ఉపయోగించవచ్చు.

పండ్లు, కూరగాయలు

పండ్లు, కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం. అవి మంచి ఆరోగ్యకరమైన ఆహారంగా ఉపయోగపడడంతో పాటు జీవక్రియలను వేగవంతం చేస్తాయి. చర్మం రంగు, ఆరోగ్యాన్ని కూడా కాపాడతాయి. విటమిన్లు, మినరల్స్ కూడా ఎక్కువగా లభిస్తాయి. వీటితో పాటు రోజు మొత్తం ఏదొక పని చేస్తూ బిజీగా గడుపుతుంటే శరీరంలో కొవ్వు పేరుకుపోదు. ఆరోగ్యం సొంతమవుతుంది.

పైసలు ప్యాకేజీ రాలే...


(మొదటిపేజీ తరువాయి)

లక్ష్మాపూర్, రాంపూర్, వడ్డెర కాలనీ, తిరుమలగిరి, బ్రాహ్మణ బంజరపల్లి గ్రామాల బాధితులు పాల్గొన్నారు. తమకు రావాల్సిన ప్యాకేజీ, డబ్బులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాలుగేండ్లుగా నరకయాతన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ ఆఫీస్ చుట్టూ తిరిగి విసుగొస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు రేపు మాపంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. అభివృద్ధికి సహకరించాలని సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ వెంకట్ రామ్‌రెడ్డి కోరారని, ఆదుకుంటామని హామీలు ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు వారి హామీలు ఆగమై, అప్పటి అధికారులు ట్రాన్స్‌ఫర్ అయ్యారని తెలిపారు. మా బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఓపిక నశించి రోడ్డెక్కామన్నారు. నాలుగేండ్ల కిందట ఉన్న ఊరు ఖాళీ చేశామని, ఇల్లు, డబ్బులు ఇస్తామని, ప్లాట్లతోపాటు ప్యాకేజీ ఇస్తామని ఆగం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడేమో లోకల్, నాన్ లోకలంటూ ప్యాకేజీ తప్పించుకోవడానికి చర్యలు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

"యువతకు ఇచ్చే ప్యాకేజీలో 18ఏండ్లకు 10 రోజులు తక్కువున్నా బంద్ అంటున్నారు. ఒంటరి మహిళల ఇండ్లు ఖాళీ చేయిస్తున్నారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టులో భూమి, స్థలాలు సర్వం కోల్పోయాం. ఇక్కడ భూములకు భూములు ఇస్తామని నమ్మబలికి మోసం చేశారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో తాత్కాలిక ఇండ్లలో జీవనం కొనసాగిస్తున్నాం. హైదరాబాద్, నిజామాబాద్‌లో ఉన్నారంటూ ఇండ్లు, స్థలాలు కేటాయించడం లేదు. ఇక్కడ బతుకుదెరువులేకే బయటకు వెళ్లి బతుకుతున్నాం. ముంపునకు గురైన వాళ్లే బయట బతుకుతున్నారు. ఇటీవల గజ్వేల్ మున్సిపాలిటీలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్దిదారులకు కేటాయించారు. మాకు సాయం అందక ముందే.. మేము ఉంటున్న ఇండ్లు వారికి ఇస్తామని ఖాళీ చేయాలంటున్నారు. మాకు న్యాయం జరిగే వరకు కదిలేదే లేదు' అని స్పష్టం చేశారు. సుమారు 3 గంటలు రాస్తారోకో నిర్వహించారు. సింగాయపల్లి చౌరస్తా నుంచి ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న గజ్వేల్ ఏసీపీ మడత రమేష్ గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. వారు ససేమీరా ఒప్పుకోకపోవడంతో రెవెన్యూ అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఏసీపీ మాటకు కట్టుబడి ముంపు బాధితులు రాస్తారోకో విరమించారు. ఈ కార్యక్రమంలో ముంపు గ్రామాల సర్పంచులు దమంచ ప్రతాపరెడ్డి, సిద్ధిపేట బాలయ్య, కొలిచల్మస్వామి, గోగ్లోత్ చిన్న రజిని గోవింద్, మద్దూరి రాములు పాల్గొన్నారు. అనంతరం ప్రజ్ఞాపూర్ ఏసీపీ ఆఫీసులో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డిను కలిశారు. అడిషనల్ కలెక్టర్ బాధితులతో మాట్లాడి మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మీ సమస్యలపై నివేదికలు సిద్ధమయ్యాయని చెప్పారు. దాంతో ముంపు బాధితులు శాంతించి వెనుదిరిగారు. త్వరగా సమస్యను పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

న్యాయవాదుల కోసం రక్షణ చట్టం చేయాలి

గుంటూరు : గుంటూరు లోని శుభం కన్వెన్షన్‌లో రెండురోజుల పాటు జరిగిన ఆలిండియా లాయర్స్ యూనియన్ 12వ ఏపీ రాష్ట్ర మహాసభ ఆదివారంతో ముగిసింది. ఈ మహాసభలో పలు తీర్మానాలు ఆమో దించారు. అడ్వకేట్లపై జరుగు తున్న దాడులకు అరికట్టటా నికి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని చేయాలని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వా మ్యాన్ని కాపాడాలని, మణిపూర్ హింసను ఆపాలని తీర్మానాలు చేశారు.



నూతన కార్యదర్శిగా నల్లూరి మాధవరావు



నూతన అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్

నూతన కమిటీ ఎన్నిక..

ఐలు మహాసభలో 70 మందితో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వారిలో 25 మందితో కార్యదర్శివర్గం ఎన్నికైంది. ఐలు ఏపీ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన డి.రాజగోపాల్ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షులుగా విజయవాడకు చెందిన సుంకర రాజేంద్రప్రసాద్‌ను తిరిగి ఎన్నుకున్నారు. నూతన ప్రధాన కార్యదర్శిగా హైకోర్టు న్యాయవాది నల్లూరి మాధవరావు, కోశాధికారిగా కర్నూలు జిల్లాకు చెందిన న్యాయవాది కెంగార కుమార్ ఎన్నికయ్యారు.

మన టార్గెట్ వంద సీట్లు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాబోయే ఇందిరమ్మ రాజ్యంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. 'వంద సీట్లు సాధించే బాధ్యత మాదే..గ్రామ, గ్రామాన తిరగండి...ప్రతీ తలుపు తట్టండి' అని పార్టీ శ్రేణులకు రేవంత్ పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కొల్లాపూర్‌కు చెందిన కొంత మంది కార్యకర్తలు..రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో నోరు తెరవకపోయినా...2009లో కేసీఆర్‌ను పాలమూరు జిల్లా భుజాలపై మోసిందని గుర్తు చేశారు. పాలమూరులో ఏ ప్రాజెక్టు నిర్మించినా కొల్లాపూర్ ప్రజల భూములే గుంజుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వంలో భూ నిర్వాసితులందరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. 2018లో కొల్లాపూర్‌లో కాంగ్రెస్‌ను గెలిపించారు కానీ అభివృద్ధి ముసుగులో ఆ నల్లికుట్లోడు దొరగారి దొడ్లో చేరాడని ఎద్దేవా చేశారు. పాలమూరు ప్రజలు జెండాలను, ఎజెండాలను పక్కనబెట్టి కాంగ్రెస్ ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

పాలమూరు జిల్లాలో 14 సీట్లను గెలిపించాలని కోరారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ పేదవాడికి ఇల్లు కట్టుకునేందుకు రూ. 5లక్షలు, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5లక్షల వరకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందనీ, రైతులు బ్యాంకులకు ఒక్క రూపాయి చెల్లించొద్దని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోగా రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామనీ, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని పునరుద్ఘాటించారు.

వచ్చే ఎన్నికల్లో ఆదివాసీలకు సముచిత స్థానం కల్పించాలి

ఆదివాసీ దినోత్సవంలో బెల్లయ్య నాయక్

వచ్చే ఎన్నికల్లో ఆదివాసీలకు సముచిత స్థానం కల్పించాలని ఆదివాసీ కాంగ్రెస్ చైర్మెన్ డాక్టర్ బెల్లయ్యనాయక్ టీపీసీసీని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 79 స్థానాల్లో గిరిజన, ఆదివాసీల ఓట్లు అభ్యర్థులను గెలిపించడంలో కీలకపాత్ర పోషిస్తారని తెలిపారు. దేశంలో చాలా రాష్ట్రంలో ఆదివాసీలకు ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో ఆదివాసీలు జనరల్ స్థానాల్లో పోటీ చేసి గెలుపొందారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రోహిత్ చౌదరి మాట్లాడారు.

వెట్టి చాకిరీ...

(మొదటిపేజీ తరువాయి)

డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులకు సంబంధించి సర్వే చేసి రక్త నమూనాలు సేకరించాలి. డ్రై డే, ఫ్రైడే, పల్స్‌పోలియో, పిల్లలకు వివిధ రకాల టీకాలు వేయించడం, గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సేవలు అందించడం, జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా అనేక రకాల కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వీరు కీలక పాత్ర పోషిస్తున్నారు. కరోనా కష్ట కాలంలో ఇంటింటికీ తిరిగి క్యారంటెన్ ముద్రలు వేసి మెడికల్ కిట్లను అందజేశారు. ఆ సందర్భంగా కొందరు రెండో ఏఎన్ఎంలకు కరోనా వైరస్ ప్రబలడంతో.. వారి నుంచి కుటుంబ సభ్యులకు వచ్చింది. కొందరు ఏఎన్ఎంలు కరోనా వల్ల మరణించారు. పగలంతా వైద్య సేవలకు సంబంధించిన డ్యూటీలు చేసి.. రాత్రివేళల్లో 36 రకాల రికార్డులను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. డీఎంహెచ్ఓ, డాక్టర్లు, కమిషనరేట్ నుంచి సమీక్షలకు వెళ్లాలి. తరచూ అడిగే డేటా వివరాలు ఇవ్వాలి. ఇన్ని పనులు చేస్తే ప్రభుత్వం ఇచ్చేది రూ.25 వేల వేతనమే. పీఆర్సీ వర్తింప చేయకపోవడంతో జీతాలు పెరగట్లేదు.

నోటిఫికేషన్ పేరిట ఇంటికి పంపే కుట్ర

ప్రభుత్వం ఎంపీ(ఎఫ్) పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ 2/2023ను జారీ చేసింది. 1520 పోస్టుల భర్తీ కోసం రాత పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తామని అధికారులు ప్రకటించారు. కాంట్రాక్టు సర్వీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు 20 మార్కులు సర్వీస్ వెయిటేజ్ ఇచ్చారు. మిగిలిన 80 మార్కులు పరీక్షలో తెచ్చుకోవాలని నిబంధన పెట్టారు. వయో పరిమితి 44 ఏండ్లుగా ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనంగా 5 ఏండ్ల సడలింపు ఇచ్చారు. నోటిఫికేషన్ ప్రకారం 49 సంవత్సరాలు దాటిన వాళ్లెవ్వరూ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు కారు. దీంతో ఇన్నాళ్లుగా కాంట్రాక్టు సర్వీసులో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలు, ఈసీ ఏఎన్ఎంలు, అర్బన్ హెల్త్ సెంటర్ ఏఎన్ఎంలు, హెచ్‌ఆర్ ఏఎన్ఎంల పేరిట పనిచేస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 15 నుంచి 20 ఏండ్ల సర్వీస్ ఉన్న వాళ్లల్లో ఎక్కువ మంది వయో పరిమితి దాటిపోయారు. వీరందర్నీ ఇంటికి పంపే ప్రమాదముంది. 20 ఏండ్ల కిందట ఏఎన్ఎం కోర్సు చదివి కాంట్రాక్టు సర్వీస్‌లో పనిచేస్తున్న వాళ్లు.. పోటీ పరిక్షలో ఇప్పటి అభ్యర్థులతో ఎలా పోటీ పడి మెరిట్ సాధించగల్గుతారనేది ప్రశ్నార్థకంగా మారింది.



యథావిధిగా పర్మినెంట్ చేయకపోతే సమ్మె

తమ సర్వీస్‌ను గుర్తించి మెరిట్ ఆధారంగా వెయిటేజ్ ఇచ్చి రెగ్యులర్ చేయాలని రెండో ఏఎన్ఎంలు డిమాండ్ చేస్తున్నారు. వారం రోజులుగా వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు విన్నవించారు. అయినా పట్టించుకోలేదు. దీంతో ఈనెల 16 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపడతామని ఏఎన్ఎంలు ప్రకటించారు. రాష్ట్రంలో కాంట్రాక్టు సర్వీస్‌లో పనిచేస్తున్న 5 వేల మంది ఏఎన్ఎంలు డీఎస్సీ ద్వారా నియమించబడ్డారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్స్, రోస్టర్, మెరిట్ ప్రకారం ఎంపిక అయ్యారు. వీరి సీనియారిటీ, సేవల్ని గుర్తించి రెగ్యులర్ చేయాల్సిన ప్రభుత్వం పట్టించుకోలేదు. వైద్య ఆరోగ్య శాఖలోని కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణకు సంబంధించిన విధివిధానాల విషయంలో ప్రభుత్వం ద్వంద ప్రమాణాలు అనుసరిస్తుందన్న విమర్శలున్నాయి. కాంట్రాక్టు మెడికల్ ఆఫీసర్లను మెరిట్ ఆధారంగా సర్వీస్‌కు వెయిటేజి ఇచ్చి రెగ్యులర్ చేశారు. అదే పద్ధతిలో రెండో ఏఎన్ఎంలను కూడా రెగ్యులర్ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

ఎం.యాదగిరి, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి

ఈ నెల 16 నుంచి సమ్మె చేపడతాం. వైద్య సేవల్ని స్తంభింపచేస్తాం. కాంట్రాక్టు సర్వీస్‌లో పనిచేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి. ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌కు సంబంధం లేకుండా ప్రస్తుతం పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలి. వీరంతా డీఎస్సీ, ఇతర నిబంధనల ప్రకారం నియమించబడ్డారు. వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

16 ఏండ్లుగా సేవ చేస్తున్నం..

జ్యోతి, రెండో ఏఎన్ఎం, పెద్దశంకరంపేట

2008 డీఎస్సీ ద్వారా మమ్మల్ని నియామకం చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్లు, మెరిట్ ప్రకారం ఎంపిక చేశారు. తక్కువ జీతంతో పనిచేస్తున్నాం. మొదటి ఏఎన్ఎంలతో సమానంగా పని చేస్తున్న మాకు రూ.25 వేల జీతం.. వారికేమో రూ.80 వేల జీతమిస్తున్నారు. నోటిఫికేషన్‌తో నిమిత్తం లేకుండా మమ్ముల్ని రెగ్యులర్ చేయాలి. ఉద్యమ కాలంలో కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

దేశంలో ఆరోగ్యవ్యవస్థ నిర్వీర్యం

(మొదటిపేజీ తరువాయి)

అనారోగ్యంగా మార్చింది. మోడీజీ మాట్లాడే ప్రతి మాటలో కేవలం అబద్ధాలు మాత్రమే ఉంటాయి. దేశవ్యాప్తంగా చాలా ఎయిమ్స్‌లను ఏర్పాటు చేశామని ప్రచారం చేసుకుంటున్నారు. కానీ, దేశంలోని ఎయిమ్స్‌లు తీవ్రంగా వైద్యులు, సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నాయి. కరోనా సమయంలో కేంద్రం ఉదాసీనంగా వ్యవహరించింది. ఆయుష్మాన్ భారత్ పేరుతో స్కామ్‌లకు పాల్పడ్డారు. కానీ, ఇప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉన్నారు. మీ ప్రభుత్వానికి వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైంది' అని ఖర్గే ట్వీట్ చేశారు.

24గంటల్లో 18మంది మృతి...

(మొదటిపేజీ తరువాయి)

కల్యాణ్‌కు చెందినవారు నలుగురు, షాపూర్ నుంచి ముగ్గురు, భీవాండి, ఉల్హాస్‌నగర్, గోవండి నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. మరో ఇద్దరిని గుర్తించాల్సి ఉందని తెలిపారు. వీరిలో 12మంది 50 ఏండ్లకు పైబడినవారు ఉన్నట్టు వెల్లడించారు.

పరిస్థితిపై సీఎం ఆరా.. దర్యాప్తునకు కమిటీ!

థానే ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మృతుల బంధువుల ఆందోళనలతో భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. అక్కడ నెలకొన్న పరిస్థితులపై సీఎం ఏక్‌నాథ్ శిండే ఆరా తీశారని అభిజిత్ బంగార్ తెలిపారు. అలాగే, దీనిపై దర్యాప్తునకు స్వతంత్ర కమిటీ ఏర్పాటుకు ఆదేశించినట్టు చెప్పారు. చనిపోయిన రోగుల కిడ్నీలో రాళ్లు, దీర్ఘకాలిక పక్షవాతం, న్యుమోనియా తదితర సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారన్నారు. ఆస్పత్రిలో వీరికి అందిన చికిత్సపై దర్యాప్తు జరుపుతామని, మృతుల కుటుంబ సభ్యుల వాంగ్మూలాలను రికార్డు చేస్తామన్నారు. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యానికి పాల్పడినట్టు కొందరు ఆరోపించడం తీవ్రమైన విషయమని.. దీనిపైనా కమిటీ విచారిస్తుందన్నారు. 24గంటల వ్యవధిలో 19మంది రోగులు మరణించిన ఘటనపై రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని మహారాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సావంత్ ఆస్పత్రి డీన్‌ను ఆదేశించారు.

ఈ ఘటనపై థానే పురపాలక శాఖ అధికారులు సైతం స్పందించారు. ఈ మరణాలను విశ్లేషిస్తున్నామని, రికార్డులను తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ మరణాలపై థానే డీసీపీ గనేశ్ గావ్డే మాట్లాడుతూ.. సాధారణంగా అయితే రోజూ ఆరుగురు లేదా ఏడుగురు మృతిచెందినట్టు తమకు సమాచారం వస్తుంటుందని.. కానీ ఈసారి 24గంటల్లో భారీ సంఖ్య రోగులు మృతిచెందినట్టు ఆస్పత్రి అధికారులు చెప్పారన్నారు. పెద్ద సంఖ్యలో మరణాల నేపథ్యంలో ఆస్పత్రి వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉండేందుకు పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించినట్టు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ఆస్పత్రి డీన్ సమర్పించిన నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ ఆస్పత్రి రాష్ట్ర వైద్య విద్య, పరిశోధన శాఖ కిందకు వస్తుందని.. వైద్య విద్యాశాఖ మంత్రి హసన్ ముష్రిఫ్ ఆస్పత్రి వద్దకు చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్నారని సావంత్ తెలిపారు..

ఎన్సీఈఆర్టీ కమిటీలో ఆర్ఎస్ఎస్ సభ్యునికి చోటు

(మొదటిపేజీ తరువాయి)

అనుబంధ సంస్కృత భారతి వ్యవస్థాపక సభ్యుడు చాము కృష్ణశాస్త్రిని కూడా ఈ కమిటీలో సభ్యుడిగా నియమించడం గమనార్హం. ఈ కమిటీలో ఇన్ఫోసిస్ వ్యవస్థాపక చైర్‌పర్సన్ సుధామూర్తి, గాయకుడు శంకర్ మహదేవన్, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మెన్ వివేక్ దేవ్‌రాయ్, ఆర్థికవేత్త సంజీవ్ సన్యాల్, గణిత శాస్త్రవేత్త మంజుల్ భార్గవ తదితరులు సభ్యులుగా ఉంటారు. దీనికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ (ఎన్ఐఈపీఏ) ఛాన్సలర్ ఎన్సీ పంత్ నేతృత్వం వహిస్తారు. పాఠ్య ప్రణాళికను పాఠశాల విద్యకు సంబంధించిన జాతీయ పాఠ్య ప్రణాళిక ఫ్రేమ్‌వర్క్ (ఎన్సీఎఫ్-ఎస్సీ)తో అనుసంధానం చేసే విషయంపై ఈ కమిటీ కసరత్తు చేస్తుంది. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా కె.కస్తూరిరంగన్ నేతృత్వంలోని స్టీరింగ్ కమిటీ ఎన్సీఎఫ్-ఎస్సీని అభివృద్ధి చేసింది. తుది ఫ్రేమ్‌వర్క్‌ను ఇప్పటికే కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు సమర్పించారు. అయితే దానిని ఇప్పటి వరకూ ప్రజలకు బహిర్గతం చేయలేదు. కాగా పాఠశాల సిలబస్, టీచింగ్-లెర్నింగ్ మెటీరియల్‌ను రూపొందించేందుకు ఈ కమిటీకి అధికారాలు కల్పించారు. 1, 2 తరగతుల పాఠ్య పుస్తకాలను సవరించే విషయంపై కూడా ఈ కమిటీ కృషి చేస్తుంది.

అభం శుభం తెలియని బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేక అధికారి (పశువుల డాక్టర్) హరికృష్ణ గర్ల్స్ హాస్టల్ గెస్ట్ హౌస్‌లో తిష్ట వేసి అమ్మాయిలను వేధిస్తున్నట్టు ఓ పత్రిక కథనం వెలువరించటంతో..తెలంగాణ క్రీడా వర్గాల్లో తీవ్ర దుమారం రేగుతుంది.

స్పోర్ట్స్ స్కూల్‌లో లైంగిక వేధింపులు

- ఓఎస్‌డి హరికృష్ణ సస్పెండ్
- ఎమ్మెల్సీ కవిత ట్వీట్
- తక్షణం స్పందించిన మంత్రి శ్రీనివాస్ గౌడ్
- క్రీడారంగంలో కలకలం

నవతెలంగాణ-హైదరాబాద్ ,సిటీ బ్యూరో

హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేక అధికారి హరికృష్ణ అక్కడి బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్టు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. కొంతకాలంగా బాలికల వసతి గృహంలోని గెస్ట్ హౌస్ కేంద్రంగా రాత్రిళ్ల బాలికలను లైంగికంగా వేధిస్తున్నట్టు ఓ పత్రిక కథనం ప్రచురించింది. స్పెషల్ ఆఫీసర్ హరికృష్ణపై లైంగిక ఆరోపణల వార్తలతో క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. స్పెషల్ ఆఫీసర్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్టు క్రీడాశాఖ మంత్రి ప్రకటించారు. ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీ ఏర్పాటు చేస్తూ.. పూర్తి స్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేశారు.





ఏం జరిగింది?

పశుసంవర్ధక శాఖకు చెందిన వెటర్నరీ డాక్టర్ హరికృష్ణ డిప్యూటేషన్‌పై 2019 నుంచి హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్‌డిగా విధులు నిర్వర్తిస్తున్నారు. గత కొంతకాలంగా స్పోర్ట్స్ హాస్టల్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఉన్నతాధికారుల దృష్టికి సైతం వచ్చినట్టు సమాచారం. దీనిపై అంతర్గత విచారణ జరిపినా.. మంత్రి అండదండలు హరికృష్ణకు ఉండటంతో చర్యలకు ఉన్నతాధికారులు వెనుకాడినట్టు సదరు కథనం సారాంశం. ఈ విషయాన్ని కొందరు కోచ్‌లు, మహిళా ఉద్యోగినులు లేవనెత్తినట్టు తెలుస్తోంది. బాధిత బాలికలు అక్కడి మహిళా ఉద్యోగులతో తమకు జరిగిన అన్యాయంపై బోరుమన్నట్టు సమాచారం. రాత్రి సమయాల్లో ఓఎస్‌డి హరికృష్ణ బాలికల వసతి గృహంలోని గెస్ట్ హౌస్‌లోనే ఉంటున్నాడని అనేందుకు సీసీటీవీ ఫుటేజీ ఆధారాలు చాలని అంటున్నారు. ఇది కాకుండా, స్పోర్ట్స్ స్కూల్‌లోనే పని చేస్తున్న ఓ మహిళా ఉద్యోగితో సైతం ఓఎస్‌డి రాసలీలలు నడుపుతున్నట్టు సదరు కథనం వెల్లడించింది.

ఓఎస్‌డి సస్పెన్షన్

లైంగిక వేధింపుల ఆరోపణలపై ఎమ్మెల్సీ కవిత స్పందించారు. సీఎం కెసిఆర్ పాలనలో ఇటువంటి ఆగడాలకు చోటు లేదని, తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను ట్విట్టర్ వేదికగా కోరింది. దీంతో ఆదివారం ఉదయమే ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్‌డి హరికృష్ణను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. పూర్తి స్థాయి విచారణ కోసం ఐదుగురు సభ్యులతో విచారణ కమిటీ నియమించారు. జింఖానా స్పోర్ట్స్ ఆఫీసర్ సుధాకర్‌ను స్పోర్ట్స్ స్కూల్ ఇన్‌చార్జి ఓఎస్‌డిగా నియమిస్తూ క్రీడాశాఖ కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. సమీక్ష సమావేశంలో శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్, కార్యదర్శి శైలజ రామయ్యర్, శాట్స్ డైరెక్టర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎవరీ హరికృష్ణ

పశుసంవర్ధక శాఖకు చెందిన వెటర్నరీ డాక్టర్ హరికృష్ణ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకుడు. 2025 వరకు సొంత శాఖ నుంచి డిప్యూటేషన్ తెచ్చుకున్నారు. నగరానికి చెందిన ఓ మంత్రి ఆశీర్వాదంతో క్రీడాశాఖలో కీలక పదవి చేపట్టారు. స్పోర్ట్స్ స్కూల్ ఓఎస్‌డిగా ఉండేందుకు స్పోర్ట్స్‌లో కనీసం పిహెచ్‌డి అవసరం. క్రీడల్లో ఎటువంటి ప్రావీణ్యం లేని వ్యక్తిని ముఖ్యమైన క్రీడా పాఠశాలకు స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. దీనిపై ప్రశ్నించిన ఓ మహిళా కోచ్‌ను జిల్లా క్రీడాధికారి పదవి నుంచి తప్పించి.. తిరిగి కోచ్‌గా డిమోషన్ చేయటం గమనార్హం. స్పోర్ట్స్ స్కూల్ బాలికలపై లైంగిక వేధింపులపై స్పందించిన బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఐపీఎల్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ' ఓ వెటర్నరీ డాక్టర్‌కు స్పోర్ట్స్ స్కూల్‌లో ఏం పని?. ఎవరి ఈయను పశు సంవర్ధక శాఖ నుంచి క్రీడాశాఖకు బదిలీ చేశారు? హరికృష్ణను తక్షణమే భర్తరఫ్ చేయాలి. మంత్రి శ్రీనివాస్ గౌడ్, హరికృష్ణ వ్యవహారాలపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలి' అని డిమాండ్ చేశారు.

ఇక తనపై వచ్చిన ఆరోపణలను హరికృష్ణ ఖండించారు. 'నాపై కుట్ర చేస్తున్నారు. లైంగిక వేధింపుల వార్త పూర్తిగా ఆరోపణలే. అందులో ఎటువంటి వాస్తవం లేదు. మూడున్నరేండ్లుగా ఇక్కడ ఓఎస్‌డిగా పని చేస్తున్నాను. ఓ పత్రిక కథనం ఆధారంగా విచారణ లేకుండా సస్పెండ్ చేయటం అన్యాయం. నేను బాలిక హాస్టల్‌లోకి వెళ్లినట్టు వస్తున్న వార్తల్లో ఎటువంటి వాస్తవం లేదు. విచారణలో అన్ని విషయాలు బయటకు వస్తాయని' హరికృష్ణ అన్నారు.

'ఇప్పుడిప్పుడే బాలికలు క్రీడల్లోకి వస్తున్నారు. స్పోర్ట్స్ స్కూల్ ఘటన వంటి లైంగిక వేధింపుల వార్తలతో అమ్మాయిల తల్లిదండ్రుల దృక్పథం మారే ప్రమాదం ఉంది. ఇటువంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలి'
- పుల్లెల గోపీచంద్, బ్యాడ్మింటన్ కోచ్

'సీఎం కెసిఆర్ పాలనలో ఇటువంటి ఆగడాలకు తావు ఉండకూడదు. బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై తక్షణం చర్యలు చేపట్టాలి. పూర్తి స్థాయి విచారణ జరిపించి బాధితురాళ్లకు న్యాయం చేయాలని మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను కోరుతున్నాను'
- ఎమ్మెల్సీ కవిత

'మహిళలపై లైంగిక వేధింపుల విషయంలో తెలంగాణలో ఎటువంటి రాజీ లేదు. ఆరోపణలు వచ్చిన అధికారిని తక్షణమే సస్పెండ్ చేశాం. సమగ్ర విచారణ కోసం ఐదుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేశాం. లైంగిక వేధింపులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోం. ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటాం'
- మంత్రి శ్రీనివాస్ గౌడ్

'ఒక వెటర్నరీ డాక్టర్‌కు స్పోర్ట్స్ స్కూల్‌లో ఏం పని? పశు సంవర్ధక శాఖ నుంచి క్రీడాశాఖకు ఎందుకు, ఎవరు బదిలీ చేశారు? హరికృష్ణను తక్షణమే భర్తరఫ్ చేయాలి. మంత్రి శ్రీనివాస్ గౌడ్, హరికృష్ణ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలి'
- ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్

'స్పోర్ట్స్ స్కూల్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఇటువంటి ఘటన పట్ల కఠినంగా వ్యవహరించాలి. వేధింపులకు పాల్పడిన అధికారిని అరెస్టు చేసి జైలుకు పంపించాలి'
- అర్శనపల్లి జగన్‌మోహన్ రావు.

అభివృద్ధిలో అసమానతలు

తలసరి ఆదాయం దారుణం | అనేక రంగాలలో వెనుకబాటు

- మోడీ సర్కార్ చెబుతున్న బలోపేత ఆర్థిక వ్యవస్థ అంతా డొల్లే
- క్షేత్రస్థాయిలో విలవిల్లాడుతున్న ప్రజలు



న్యూఢిల్లీ : భారత ఆర్థిక వ్యవస్థ బ్రిటన్‌ను అధిగమించి ఐదో స్థానంలో నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మొదలుకొని సంఘ్ పరివార్ నేతలంతా ప్రచార బాకాలూదుతున్నారు. కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభలో ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' అవిశ్వాస తీర్మానానికి సమాధానం ఇచ్చినప్పుడు కూడా ప్రధాని ఈ విషయాన్ని గొప్ప చెప్పారు. కానీ దేశాభివృద్ధిలో ప్రాంతాలవారీ అసమానతలను, ప్రజల కొనుగోలు శక్తి క్రమేపి నిర్వీర్యం అవుతుండటాన్ని ఆయన ప్రస్తావించలేదని, వాస్తవానికి ఆయన చెప్పినంత పటిష్టంగా భారత ఆర్థిక వ్యవస్థ లేదని, అంతా డొల్ల అని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతానికి అయితే ప్రపంచంలో అమెరికాయే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. చైనా, జపాన్, జర్మనీలు ఆ తర్వాతి స్థానాలలో ఉన్నాయి. ఇప్పుడు మన ఆర్థిక వ్యవస్థ పరిమాణం ఎంతో స్పష్టంగా తెలియడం లేదు. ఒకప్పుడు మూడు ట్రిలియన్ డాలర్లు దాటిన మన ఆర్థిక వ్యవస్థ పరిమాణం కరోనా సమయంలో తగ్గిపోయింది. జూన్ 12న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ట్వీట్ ప్రకారం 2023లో భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 2023లో 3.75 ట్రిలియన్ డాలర్లు. ఎందుకో తెలియదు గానీ ఆ తర్వాత ఆ ట్వీట్‌ను తొలగించారు. 3.2 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ ఆరో స్థానంలోకి వెళ్లిపోయింది. గనుక మన ఆర్థిక వ్యవస్థ ఐదో స్థానంలో ఉన్న నేపథ్యంలో దాని పరిమాణం 3.5 ట్రిలియన్ డాలర్లు ఉండవచ్చునని చెబుతున్నారు.

తలసరి ఆదాయం పెరిగితేనే...

ఇప్పుడు ఐదో స్థానానికి చేరిన మన ఆర్థిక వ్యవస్థ త్వరలోనే మూడో స్థానంలో నిలుస్తుందని మోడీ చెబుతున్నారు. ప్రపంచంలోనే మనది అత్యధిక జనాభా కలిగిన దేశం. కాబట్టి ఆర్థిక వ్యవస్థ ఒకటో స్థానానికి చేరినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. అయితే బలపడుతున్న ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా ప్రజల ఆదాయాలు పెరుగుతున్నాయా అన్నదే ఇక్కడ ప్రశ్న. ప్రజల ఆదాయం పెరిగితే వ్యయం కూడా దానంతట అదే పెరుగుతుంది. వారి జీవితాలు ఆనందంగా గడుస్తాయి. కానీ మన దేశంలో అలా జరగడం లేదు. బ్రిటన్ ప్రజల జీవన ప్రమాణాలకు, భారత ప్రజల జీవన ప్రమాణాలకు మధ్య చాలా తేడా ఉంది. మన దేశ ప్రజల తలసరి ఆదాయంతో పోలిస్తే బ్రిటన్ ప్రజల తలసరి ఆదాయం 18 రెట్లు అధికం. కాబట్టి ఆర్థిక వ్యవస్థ పెరిగితే ఒరిగేదేమీ ఉండదు. ప్రజల తలసరి ఆదాయం పెరగడమే ముఖ్యం.

అంగోలా కంటే తక్కువే

మన దేశంలో ప్రజల తలసరి ఆదాయం చాలా దారుణంగా ఉంది. పేద దేశమైన అంగోలాలో కంటే మన దేశంలో తలసరి ఆదాయం తక్కువే. ఈ విషయంలో మన దేశం 197 దేశాలలో 142వ స్థానంలో ఉంది. మన తలసరి ఆదాయం 2601 డాలర్లు. దీనితో పోలిస్తే అమెరికాలో 31 రెట్లు, జపాన్, ఇటలీ దేశాలలో 14 రెట్లు ఎక్కువ. జనాభా అధికంగా ఉండడం వల్లే మన తలసరి ఆదాయం తక్కువగా ఉన్నదని కొందరు చేస్తున్న వాదనలో పస లేదు. ఎందుకంటే జనాభా అధికంగా ఉన్న చైనాలో తలసరి ఆదాయం మన దేశంతో పోలిస్తే ఐదు రెట్లు అధికంగా ఉంది. బడా దేశాల సంగతి పక్కన పెడితే మనం ఎన్నడూ పేరు కూడా వినని దేశాలైన వనటూ, సావో టోమ్ ప్రిన్సిపెలలో సైతం మన కంటే తలసరి ఆదాయం అధికంగానే ఉంది. చివరికి ఐవరీ కోస్ట్‌లో కూడా తలసరి ఆదాయం మన కంటే ఎక్కువగానే ఉంది. తలసరి ఆదాయాన్ని లెక్కించడంపై కూడా పలు వివాదాలు ఉన్నాయి. అంబానీ, అదానీ వంటి బడా పారిశ్రామికవేత్తల ఆదాయంతో పాటు అతి తక్కువ వేతనం పొందే వ్యక్తిని కూడా పరిగణనలోకి తీసుకొని సగటు తలసరి ఆదాయాన్ని నిర్ణయిస్తారు. కాబట్టి కేవలం తలసరి ఆదాయం ఎక్కువగా ఉన్నంత మాత్రాన కూడా దేశ ప్రజలందరి ఆదాయం పెరుగుతోందని, వారి జీవితాలు భేషుగ్గా సాగుతున్నాయని అనుకోవడం పొరబాటే అవుతుంది.



పేదలు నిరుపేదలుగా...

ప్రపంచంలో ధనవంతులు మరింత సంపన్నులుగా, పేదలు మరింత నిరు పేదలుగా మారిపోతున్నారు. అభివృద్ధిలో అసమానతలే దీనికి కారణం. సంపన్నుల ఆదాయం శరవేగంగా పెరుగుతుంటే పేదల ఆదాయం పాతాళానికి పడిపోతోంది. సంపన్న దేశాలతో పోలిస్తే మన దేశంలో అభివృద్ధిలో అసమానతలు చాలా ఎక్కువగా ఉన్నాయి. దేశ జనాభాలో ఐదు శాతం మంది చేతిలో 60% సంపద పోగుపడి ఉంది. చివరి యాభై శాతం జనాభా చేతిలో కేవలం మూడు శాతం సంపద మాత్రమే ఉంది. 2020లో దేశంలో 102 మంది బిలియనీర్లు ఉండగా ఈ సంవత్సరంలో వారి సంఖ్య 163కు పెరిగింది. ఒక వైపు సంపన్నుల సంపద పెరుగుతుంటే మరోవైపు పేదల సంఖ్య, వారిలో పేదరికం కూడా పెరుగుతోంది. 2018లో ఆకలితో అల్లాడిన భారతీయుల సంఖ్య 19 కోట్లు ఉండగా 2022 నాటికి 35 కోట్లకు పెరిగింది. 2022లో చనిపోయిన ఐదేళ్ల లోపు చిన్నారులలో 65 శాతం మంది ఆకలితోనే ప్రాణాలు కోల్పోయారని కేంద్ర ప్రభుత్వమే సుప్రీంకోర్టుకు తెలిపింది.

నిరాశాజనకం...దయనీయం

ఆర్థిక వ్యవస్థ పరిమాణంలో ప్రపంచంలో ఐదో స్థానంలో ఉన్నప్పటికీ అనేక ఇతర రంగాలలో మన స్థానం అట్టడుగునే ఉంటోంది. అత్యంత ఆనందదాయకమైన దేశాలలో మనది 125వ స్థానం. అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలైన పది దేశాలలో ఏ ఒక్కటి కూడా ఈ జాబితాలో లేదు. పత్రికా స్వేచ్ఛతో 161 వ స్థానం. మానవాభివృద్ధి సూచికలో కూడా మనం 130వ స్థానంలో ఉన్నాము.దీనిని బట్టి మనకు అర్థమవుతోంది ఏమంటే ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్న మాత్రాన దేశం సుసంపన్నం కాదు. తలసరి ఆదాయం పెరుగుతున్నప్పుడు, ప్రజలకు సుపరిపాలన లభిస్తున్నప్పుడు, వారికి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పుడు మాత్రమే దేశం సౌభాగ్యవంతమవుతుంది.

డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల పాలనలోనే...

రెండు సంవత్సరాల క్రితం నిటి ఆయోగ్ ఓ నివేదికను విడుదల చేసింది. దాని ప్రకారం దేశంలోని ఐదు నిరుపేద రాష్ట్రాలలో నాలుగు రాష్ట్రాలలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలే నడుస్తున్నాయి. బీహార్ (అప్పుడు ఆ రాష్ట్రంలో బీజేపీ, జేడీయూ సంకీర్ణ ప్రభుత్వం పనిచేస్తోంది) మొదటి స్థానంలో ఉండగా జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తర్వాతి స్థానాలలో నిలిచాయి. ఆశ్చర్యకరమైన విషయమేమంటే బీహార్‌లో 52 శాతం, జార్ఖండ్‌లో 42 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 38 శాతం, మధ్యప్రదేశ్‌లో 37 శాతం జనాభా పేదలే. బలమైన ఆర్థిక వ్యవస్థ ఏ దేశానికైనా అవసరమే కానీ ప్రజల తలసరి ఆదాయం పెరగడం అంతకంటే అవసరం. అభివృద్ధి అనేది అన్ని ప్రాంతాలలోనూ ఒకేలా ఉండాల్సిన ఆవశ్యకత కూడా ఉంది. లేనిపక్షంలో అదానీ, అంబానీ సహా దేశంలోని అతి కొద్దిమంది బిలియనీర్లు, సంపన్న వర్గం ఆర్థికాభివృద్ధి ప్రయోజనాలను సొంతం చేసుకుంటారు. పేదలు మాత్రం ఆకలితో అలమటిస్తూ నిద్ర లేని రాత్రులు గడుపుతూనే ఉంటారు.

నవచిత్రం

థాయిలాండ్‌లో డబుల్ ఇస్మార్ట్ షూటింగ్

రామ్ పోతినేని, డైరెక్టర్ పూరీ జగన్నాథ్ కలయికలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా సినిమా 'డబుల్ ఇస్మార్ట్'. బ్లాక్ బస్టర్ 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్ రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ కొద్ది రోజుల క్రితం ముంబైలో ఒక ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరించడంతో తొలి షెడ్యూల్ ప్రారంభమైంది. పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్న ఈ సినిమా కోసం రామ్ స్టైలిష్ మేకోవర్ అయ్యారు.



ఈ సినిమా రెండో షెడ్యూల్ థాయిలాండ్‌లో స్టార్ట్ అయ్యింది. ఈ షెడ్యూల్లో హీరో రామ్, సంజయ్ దత్ పై కీలకమైన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఇటీవలే విడుదలైన సంజయ్‌దత్ ఫస్ట్‌లుక్‌కి సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. తన నటీనటులను బెస్ట్ మాస్ అప్పీలింగ్‌లో ప్రజంట్ చేయడంలో స్పెషలిస్ట్ అయిన పూరి జగన్నాథ్ ఇందులో సంజయ్ దత్‌ను మునుపెన్నడూ చూడని అవతార్‌లో చూపించనున్నారు. రామ్, సంజయ్ దత్‌లను తెరపై కలిసి చూడటం అభిమానులకు, సినీ ప్రియులకు ఎగ్జైటింగ్‌గా ఉంటుంది. ఈ వైల్డ్ కాంబినేషన్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ జియాని గియాన్నెల్లి పనిచేస్తున్నారు. సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో హై బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే తెలియజేస్తారు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో వచ్చే ఏడాది మహా శివరాత్రి కానుకగా మార్చి 8న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు చిత్ర బృందం ప్లాన్ చేసింది.

పీటలపై పెళ్ళి ఆగిపోయిన ఓ యువకుడి కథ

సంతోష్ శోభన్, రాశీ సింగ్, రుచిత సాదినేని హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రేమ్ కుమార్'. సారంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై శివ ప్రసాద్ పన్నీరు నిర్మించిన ఈ చిత్రంతో రైటర్ అభిషేక్ మహర్షి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమా ఈనెల 18న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు అభిషేక్ మహర్షి మీడియాతో ముచ్చటించారు. ఆ విశేషాలు..

- పలు సినిమాలకు ఘోస్ట్ రైటర్‌గా పని చేశాను. అలాగే ఓటీటీలో షోలకి కూడా రాశాను. 'పేపర్ బాయ్' టైంలోనే సంతోష్ శోభన్‌ను కలిశాను. ఓ షార్ట్ ఫిల్మ్ చేద్దామని అనుకున్నాం. అలా చివరకు ఈ సినిమా చేశాం. ఈ మూవీ పాయింట్ కొత్తగా ఉంటుంది. అందరికీ బాగా కనెక్ట్ అవుతుంది. నా కామెడీ టైమింగ్‌ను సంతోష్, శివ బాగా నమ్మేవారు. అలాగే ఈ సినిమాకి నా యాక్టింగ్ కూడా బాగా కలిసి వచ్చింది.


అభిషేక్ మహర్షి

- సినిమాల్లో పెళ్లి సీన్‌లో చివర్లో హీరో వచ్చి.. హీరోయిన్ పెళ్లి ఆపుతాడు. హీరో, హీరోయిన్లు కలిసిపోతారు. కానీ పెళ్ళి పీటలపై ఉన్న ఆ పెళ్లి కొడుకు గురించి ఎవ్వరూ ఆలోచించరు. వాడికి కూడా ఓ జీవితం ఉంటుంది. అది చెప్పేందుకే ఈ సినిమాను తీశాం. విశ్వక్ సేన్ 'అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమా టీజర్ చూసినప్పుడు కాస్త భయపడ్డాను. ఇదేంటి నా కాన్సెప్ట్‌లాగా ఉందే అని అనుకున్నాను. కానీ ఆ మూవీ దర్శకుడితో మాట్లాడాక.. కాన్సెప్ట్ వేరని అర్థమైంది. ఆద్యంతం వినోదభరితంగా ఉండే చిత్రమిది. ఫ్యామిలీతో హాయిగా వెళ్ళి చూడొచ్చు. సంగీత దర్శకుడు అనంత్ శ్రీకర్ ఈ సినిమాకు ఫ్యూజన్ స్టైల్లో మ్యూజిక్ కొట్టాడు. ఆర్‌ఆర్ కూడా అద్భుతంగా వచ్చింది. థియేటర్లో సౌండింగ్ పరంగా కొత్త ఫీలింగ్ వస్తుంది. మా నిర్మాత శివ ప్రసాద్‌కి సినిమాలపై ఎంతో ప్యాషన్ ఉంది. ఆయన టేస్ట్‌కి తగ్గట్టు ఈ సినిమా ఉంటుంది.


వెంకటేష్

సైంధవ్ క్లైమాక్స్ పూర్తి

వెంకటేష్, శైలేష్ కొలను కాంబినేషన్‌లో నిహారిక ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై వెంకట్ బోయనపల్లి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ప్రాజెక్ట్ 'సైంధవ్'. తన తొలి చిత్రం 'శ్యామ్ సింగరాయ్'ని లావిష్‌గా నిర్మించి సినిమాపై తనకున్న ప్యాషన్‌ను నిర్మాత వెంకట్ బోయనపల్లి చూపించారు.

'సైంధవ్' వెంకటేష్ 75వ మైల్ స్టోన్ మూవీ. మేకర్స్ చాలా జాగ్రత్తలు తీసుకొని రాజీపడకుండా నిర్మిస్తున్నారు. రీసెంట్‌గా 16 రోజులలో కీలకమైన షెడ్యూల్‌ను పూర్తి చేశారు, ఎనిమిది మంది ముఖ్య నటీనటులు షూట్‌లో పాల్గొన్న హై-ఆక్టేన్ ఎమోషనల్ క్లైమాక్స్‌ను హర్ష్ కండీషన్స్‌లో చిత్రీకరించారు. యాక్షన్ ఎపిసోడ్‌ను రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ సూపర్ వైజ్ చేశారు. వెంకటేష్‌కి ఇప్పటి వరకు ఇదే మోస్ట్ ఎక్స్‌పెన్సివ్ క్లైమాక్స్ పోర్షన్. సినిమా రూపుదిద్దు కుంటున్న తీరు పట్ల చిత్ర బృందం ఆనందంగా ఉంది. నవాజుద్దీన్ సిద్ధిక్, శ్రద్ధా శ్రీనాథ్, రుహాని శర్మ ఆండ్రియా జెర్మియా, సారాతో సహా దాదాపు అన్ని ప్రధాన పాత్రలను మేకర్స్ ఇప్పటికే పరిచయం చేశారు. ఈ పాన్ ఇండియా మూవీని అన్ని దక్షిణాది భాషలతోపాటు హిందీలో డిసెంబర్ 22న క్రిస్మస్ సందర్భంగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం : శైలేష్ కొలను, సంగీతం: సంతోష్ నారా యణ్, సహ నిర్మాత: కిషోర్ తాళ్లూరు, డీవోపీ: ఎస్.మణికందన్, ఎడిటర్: గ్యారీ బిహెచ్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా.

టైగర్.. దండయాత్రకి రంగం సిద్ధం

రవితేజ నటిస్తున్న తొలి పాన్ ఇండియా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీ దర్శకత్వంలో అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మాత అభిషేక్ అగర్వాల్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్స్-ది కాశ్మీర్ ఫైల్స్ , కార్తికేయ 2 తర్వాత ఈ బ్యానర్ నుండి వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. అలాగే రీసెంట్‌గా విడుదలైన గ్లింప్స్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు 'టైగర్ దండయాత్ర' మొదలు కాబోతుంది. ఈనెల 17న ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయనున్నారు మేకర్స్. ఈ కథకు యూనివర్సల్ అప్పీల్ ఉన్నందున మేకర్స్ దీన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది. రవితేజ సరసన నూపూర్ సనన్, గాయత్రి భరద్వాజ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం దసరా కానుకగా అక్టోబర్ 20న విడుదల కానుంది.


రవితేజ



ప్రేక్షకుల విశేష ఆదరణతో మంచి విజయాన్ని అందుకున్న సీతారామం చిత్ర బృందానికి మరో అరుదైన గౌరవం లభించింది. ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్ (ఐఎఫ్ఎఫ్‌బి) అవార్డుల్లో ఈ సినిమా ఉత్తమ చిత్రంగా నిలిచింది. మెల్‌బోర్న్ వేదికగా ఆదివారం జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో చిత్ర దర్శక, నిర్మాతలు ఉత్తమ చిత్ర అవార్డును అందుకున్నారు.

యోగి రీ రిలీజ్‌కి రెడీ

ప్రభాస్, నయనతార జంటగా వి.వి.వినాయక్ దర్శకత్వం వహించిన చిత్రం 'యోగి'. 2007వ సంవత్సరంలో విడుదలైన ఈ చిత్రం ప్రభాస్‌కు మంచి పేరు తెచ్చిపెట్టింది. పి.రవీంద్రనాథ్‌రెడ్డి సమర్పణలో ఈశ్వరి ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సుదర్శన్‌రెడ్డి, చంద్ర ప్రతాప్‌రెడ్డిలు నిర్మించారు. రమణగోగుల సంగీతం అందించిన ఈ చిత్రంలోని పాటలు యువతను ఉర్రూతలూగించాయి. తాజాగా ఈ చిత్రాన్ని చందు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై లింగం యాదవ్ రీ రిలీజ్ చేస్తున్నారు. దీని కోసం ఈ చిత్రాన్ని 4కె ఫార్మట్‌లోకి మార్చారు.

దిల్‌రాజు, శిరీష్ సహకారంతో ఈనెల 18న ప్రేక్షకుల ముందుకు మరోసారి ఈ సినిమా రాబోతున్న సందర్భంగా ఈ చిత్ర రీ రిలీజ్ ట్రైలర్‌తోపాటు పోస్టర్‌లాంచ్ ఈవెంట్‌ను ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సంగీత దర్శకుడు రమణ గోగుల ట్రైలర్, పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'టెక్నాలజీని వాడుకుని ఈ సినిమాను మంచి క్వాలిటీతో తీసుకొస్తున్నారు. సౌండ్ చాలా బాగా వచ్చింది. తప్పకుండా ఈ రీ రిలీజ్ మంచి లాభాలు తీసుకొస్తుందని నమ్ముతున్నా' అని అన్నారు.



'ప్రభాస్ అభిమానులకు ఓ అద్భుతమైన ట్రీట్‌గా ఈ చిత్రాన్ని మంచి క్వాలిటీతో విడుదల చేస్తున్నాం. ఈ సినిమా రిలీజైనప్పుడు ప్రభాస్ అభిమానుల్లో చాలామంది చిన్న పిల్లలుగా ఉండి ఉంటారు. వారు ఇప్పుడు దీన్ని థియేటర్స్‌లో చూసి ఆనందిస్తారని ఖచ్చితంగా చెపుతాను. రమణ గోగుల అందించిన సంగీతం, వినాయక్ దర్శకత్వ ప్రతిభ, సుదర్శన్‌రెడ్డి, చంద్ర ప్రతాప్‌రెడ్డి రాజీలేని నిర్మాణ విలువలు ఈ సినిమాను గొప్పగా తీర్చిదిద్దాయి. రీరిలీజ్‌లో కూడా ఇది సూపర్‌హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. ఈ సినిమా విషయంలో దిల్‌రాజు, శిరీష్ అండగా నిలిచి ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. అలాగే నా మిత్రుడు నవీన్‌చంద్రరాజు, మాధవి ఈ ప్రాజెక్ట్ అనుకున్న దగ్గర నుంచి నాకు తోడుగా ఉన్నారు. ఈనెల 18న సుదర్శన్ థియేటర్‌లో అందరం కలిసి సినిమా చూస్తాం. ఇప్పటికే ఆన్‌లైన్‌లో బుకింగ్‌లు సూపర్‌గా అవుతున్నాయి' అని నిర్మాత లింగం యాదవ్ చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



దేశానికి అన్నపూర్ణగా మారిన తెలంగాణ

కడగండ్ల నుంచి పుట్లకొద్దీ ధాన్యం పండిస్తున్న తెలంగాణ రైతు

- రుణమాఫీతో రైతన్నకు అండగా సర్కారు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రం ఏర్పడిన తర్వాత రైతుల కడగండ్లు తీరాయి. ఒకనాటి బంజరు భూములు, నేడు జవసత్వాలు నింపుకుని పచ్చని పంటలతో కళకళలాడుతున్నాయి. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం వ్యవసాయ రంగంలో సువర్ణాధ్యాయం ప్రారంభమైనది. ఉమ్మడి పాలనలో జరిగిన వివక్ష, తెలంగాణ రైతుల ఇబ్బందులపై ఉన్న అవగాహనతో పాలనా పగ్గాలు చేపట్టిన వెంటనే వ్యవసాయ రంగం పునరుజ్జీవనమైంది. గోదావరి కృష్ణా జలాలను పూర్తిగా వినియోగించుటకు అసంపూర్తిగా వదిలి వేసిన ఎస్ఆర్ఎస్పీ వరద కాలువ లాంటి ప్రాజెక్టులతో పాటు కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి తొమ్మిదేండ్లల్లో రూ.1.59 లక్షల కోట్లు ఖర్చు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టును రికార్డు కాలంలో పూర్తి చేసింది. మిషన్ కాకతీయ కింద రూ. 5249 కోట్లను ఖర్చు చేసి కాకతీయుల కాలం నాటి గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించింది.

2014 నాటికి సాగు విస్తీర్ణం 1.31 లక్షల ఎకరాలు కాగా 2022-23 నాటికి అది రెండు కోట్ల ఎకరాలకు చేరుకుంది. 2014-15 నాటికి ధాన్యం ఉత్పత్తి 68 లక్షల టన్నులు మాత్రమే ఉండగా, 2022-23 నాటికి రికార్డు స్థాయిలో సుమారు 2.70 కోట్ల టన్నులకు చేరుకున్నది. 2014-15లో పత్తి సాగు విస్తీర్ణం 41.83 లక్షల ఎకరాలు ఉండగా,



2020-21 నాటికి 18.70 లక్షల ఎకరాలు పెరిగి 60.53 లక్షల ఎకరాలకు చేరుకున్నది. 2014-15లో పత్తి దిగుబడి 35.83 లక్షల బేళ్లు ఉండగా, 2020-21 నాటికి 63.97 లక్షల బేళ్లకు చేరుకున్నది.ఇప్పటికే 1.33 వేల కోట్లు భరించి 722.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్టు పేర్కొంది. అలాగే ధాన్యం కాకుండా రూ.11,437.55 కోట్లతో ఇతర పంటలను కొనుగోలు చేసింది.

వ్యవసాయానికి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తున్నది. 27.49 లక్షల వ్యవసాయ



కనెక్షన్లకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నది. ఉచిత విద్యుత్‌కు సాలీనా దాదాపు రూ.10,500 కోట్లు భరిస్తున్నది. వడ్డీ వ్యాపారులు కభంద హస్తాల నుంచి రైతులను కాపాడేందుకు రైతుబంధు పథకాన్ని అమలు చేస్తున్నది. రైతుబంధు పథకం ద్వారా ఎకరానికి ఏడాదికి రూ.10వేల చొప్పున నగదు 10 విడతలలో రూ.65 వేల 190 కోట్లు రైతుల ఖాతాలలో జమ చేసింది.11వ విడతగా ఈ వానాకాలంలో ఇప్పటివరకు 64.49 లక్షల రైతులకు, 117.08 లక్షల ఎకరాలకు, రూ.5854.16 కోట్లును రైతుబంధు



సాయాన్ని అందించింది. రైతులకు అప్పుల బాధ నుంచి విముక్తి కలిగించుటకు రైతు రుణ మాఫీని ప్రభుత్వం అమలచేస్తున్నది. ఇప్పటి వరకు రెండు విడతల్లో రూ.17,351.47 కోట్లు రుణమాఫీ చేసింది. అందుకు ప్రభుత్వం ఇటీవలే రూ. 18 వేల కోట్ల నిధులను మంజూరు చేసింది. ప్రమాదవశాత్తు మృతి చెందిన రైతు కుటుంబానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం రైతు బీమా అమలు చేస్తున్నది. రైతు బీమా కింద 108051 మంది రైతు కుటుంబాలకు రూ.5402'55 కోట్ల బీమా పరిహారం చెల్లించడం జరిగింది. వ్యవసాయ రంగం పునరుజ్జీవనంతో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి. రూ. 572 కోట్లతో 2601 రైతు వేదికల నిర్మాణం చేసింది. సీజన్‌కు ముందే రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తున్నది. విత్తనాల నకిలీకి, కల్తీకి పాల్పడే వారిపై పీడీ యాక్టు అమలు చేస్తున్నది. పంటలకు గిట్టుబాటు ధర కోసం ఆహారశుద్ధి పరిశ్రమలు ఏర్పాటును ప్రోత్సహిస్తున్నది.వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా, ఇప్పటివరకు మొత్తం రూ.963.26 కోట్లను వెచ్చించి 6.66 లక్షల మంది రైతులకు లబ్ది చేకూర్చడం జరిగింది. రాష్ట్రం ఏర్పడక ముందున్న రూ.41.6 కోట్ల రవాణా పన్ను రద్దు చేసింది. గోడౌన్ల సామర్థ్యం 2014-15లో 39.01 లక్షల మెట్రిక్ టన్నులు ఉంటే, ప్రస్తుతం 73.82 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుంది. 196 వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవులను రిజర్వేషన్ల ద్వారా భర్తీ చేస్తున్నది. పంట బీమాలో రాష్ట్ర వాటా రూ. 909.55 కోట్లు (2014-15 నుంచి 2019-20 వరకు) భరించింది. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడంలో భాగంగా ఆయిల్‌పామ్ విస్తీర్ణం పెంపుదలకు కృషి చేస్తున్నది. 2022-23లోనే 82,372 ఎకరాల్లో నూతనంగా ఆయిల్‌పామ్ సాగు చేశారు. సాగు నీటి శిస్తును ప్రభుత్వం రద్దు చేసిందని ఈమేరకు సమాచార పౌర సంబంధాల శాఖస్పెషల్ కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పిచ్చోళ్ల విమర్శలకు స్పందించను

- వాళ్లంతా ఎన్నికలప్పుడే వస్తారు..
- ప్రతి ఎన్నికల్లోనూ నాపై వక్ఫ్‌భూముల కబ్జా నిందారోపణలు
- రాష్ట్రంలో 90సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం..
- ఉమ్మడి జిల్లాలోని 13నియోజకవర్గాలనూ క్లీన్‌స్వీప్ చేస్తాం : పౌరసరఫరాలు, బీసీసంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

'నన్ను తిట్టి.. నాపై నిందారోపణలు చేసి ఉనికి చాటుకునే పిచ్చోళ్ల మాటలకు నేను స్పందించను. వాళ్లంతా ఎన్నికలకు ఆర్నెళ్ల ముందు వచ్చి అరవడమే తప్ప.. ఎన్నికలయ్యాక మళ్లీ కనిపించకుండా పోతారు. ప్రతి ఎన్నికలప్పుడూ.. నాపై వక్ఫ్‌భూముల కబ్జా ఆరోపణలు చేస్తున్నారు. నోటికి ఎంతవస్తే అంతా మాట్లాడుతున్నారు. నేను వందల సార్లు, వంద వేదికలపై వివరణ ఇచ్చాను. దేవుని సొమ్ము తింటే పాపం ఊరికే పోదు' అని పౌరసరఫరాలు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధికి ప్రజలే పట్టంగడుతారని, 90కిపైగా సీట్లు గెలిచి మళ్లీ తామే అధికారంలోకి వస్తామని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ 13నియోజకవర్గాలను క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్‌ఆఫీస్‌లో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. త్వరలోనే ఎవరూ ఊహించని విధంగా తమ పార్టీలోకి కీలకనేతల చేరికలు ఉంటాయని చెప్పారు.రాజకీయం, పాలనా అనుభవం లేని కొంతమంది అజ్ఞానులు చేసే విమర్శలకు తాను స్పందించబోమన్నారు. గతంలో వారి హయాంలో లక్ష రూపాయల రోడ్డు మంజూరు చేసి అందులో రూ.60వేలు మింగి.. రూ.30వేలతోనే రోడ్డు వేసేవారని విమర్శించారు. అలాంటి వారికి అధికారం ఇస్తే కరీంనగర్‌లోని కేబుల్ బ్రిడ్జి స్టీల్ తీగలను అమ్ముకునే రకమని అన్నారు. తాను ఎమ్మెల్యే కాకముందే 2008లోనే అన్ని రికార్డులూ సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకున్న తర్వాతే భూములు కొనుగోలు చేశానన్నారు. ఆ ప్రాంతంలో మైనార్టీ ఇల్లుగానీ, చిన్న దర్గాగానీ లేదన్నారు. రైతుల నుంచి పక్కా పత్రాలతో కొనుగోలు చేసిన భూములపై అనవసర ఆరోపణలు చేస్తున్నవారికి ఇప్పటికే కోర్టు నోటీసులు పంపానని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నోరు ఉంది కదా అని ఇష్టమొచ్చినట్టు నిందారోపణలు చేస్తే.. శిక్ష పడుతుందని హెచ్చరించారు. వారిపై పరువు నష్టం సహా ఇతర శిక్షలు తప్పవన్నారు.

ఆగస్టు 16 నుంచి వెల్ఫేర్, అభివృద్ధి పనులు

ఈనెల 16 నుంచి నియోజకవర్గంలో వెల్ఫేర్, అభివృద్ధి పనులను వేగిరం చేస్తామన్నారు. 600 మంది కులవృత్తి లబ్దిదారులకు బీసీబంధు చెక్కులు అందిస్తామన్నారు. మైనార్టీలకు కుట్టుమిషన్లు, ఇతర ఉపాధి సాయాన్ని అందిస్తామన్నారు. మరోవైపు నగరంలో రూ.125కోట్లతో మిగిలిపోయిన మెయిన్‌రోడ్డు పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. వీటితోపాటు మరో రూ.25కోట్లు బఫర్ నిధి కింద వేరు చేశామని, ఎవరు తమ ఇంటి ముందు సీసీ రోడ్డు కావాలని అడిగినా వెంటనే నిర్మిస్తామని తెలిపారు. ప్రతిపక్షాలకు ఏ సబ్జెక్టూ లేక గృహలక్ష్మి లాంటి స్కీంపై బురదజల్లుతూ రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. ఈ పథకం నిరంతర ప్రక్రియగా ఉంటుందని ఇదివరకే ప్రకటించామని చెప్పారు.

స్వాతంత్ర్య వేడుకల దృష్ట్యా మణిపూర్‌లో భద్రత కట్టుదిట్టం



ఇంఫాల్ : స్వాతంత్ర్య వేడుకల దృష్ట్యా రాష్ట్రంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్టు మణిపూర్ పోలీసులు ఆదివారం తెలిపారు. ఐదు జిల్లాల్లోని ప్రమాదకర ప్రాంతాల్లో కూడా సోదాలు నిర్వహించి ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు భద్రతా బలగాలు పేర్కొన్నాయి. ఇంఫాల్ లోయకు చెందిన కొన్ని నిషేధిత సంస్థలు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.ఇంఫాల్ - పశ్చిమ, ఇంఫాల్-తూర్పు, తౌబాల్, బిష్ణుపూర్ మరియు చురచంద్‌పూర్ జిల్లాల్లో ఈ సోదాలు చేపట్టినట్లు వెల్లడించాయి. 12 ఆయుధాలు, ఆరు మందుగుండు సామగ్రి, ఎనిమిది పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని మణిపూర్ పోలీసులు తెలిపారు. ఆగస్టు 15న జరగనున్న మార్చ్ ఫాస్ట్ కోసం బిఎస్ఎఫ్, పోలీస్, అస్సాం రైఫిల్స్ సిబ్బంది మరియు విద్యార్థులు రిహార్సల్స్ చేపడుతున్నాయని ప్రకటించారు. చురాచంద్‌పూర్ జిల్లా తుయ్‌బొంగ్ ప్రాంతంలోని పీస్ గ్రౌండ్‌లో శనివారం రిహార్సల్స్ జరిగాయని అన్నారు. ఆగస్టు 15న కో ఆర్డినేటింగ్ కమిటీ (కార్కామ్) సమ్మెకు పిలుపునివ్వడంతో రాష్ట్రంలో భద్రతా బలగాలను గణనీయంగా పెంచామని ఓ అధికారి తెలిపారు. కార్కామ్‌లో యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (యుఎన్ఎల్ఎఫ్), పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్ఎ) సహా మరో మూడు నిషేధిత సంస్థలు ఉన్నాయని అన్నారు.

హిమాచల్‌ప్రదేశ్‌లో భారీ వర్షాలు

- విరిగిపడుతున్న కొండచరియలు
- జాతీయ రహదారి 5 మూసివేత





సిమ్లా : హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాన్ని భారీ వర్షాలు, వరదలు వణికిస్తున్నాయి. ఎడతెరపి లేని వర్షాల కారణంగా పలుచోట్ల కొండ చరియలు విరిగిపడుతున్నాయి. దీంతో ఆదివారం రహదారులపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండి జిల్లాలో వర్షాల ప్రభావం మరింత తీవ్రంగా ఉంది. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అనేక నివాసాలు నీట మునిగాయి. బిలాస్‌పూర్ జిల్లాలోనూ పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దాకేష్‌లో కొండలపై నుంచి మట్టి, రాళ్ల దొర్లిపడి జాతీయ రహదారి 205పై రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని బిలాస్‌పూర్ జిల్లా యంత్రాంగం తెలిపింది. మరోవైపు మండి నుంచి సిమ్లాకు వెళుతున్న హిమాచల్‌ప్రదేశ్ ఆర్‌టిసి బస్సు లోయలో పడి 12 మంది గాయపడ్డారు. వీరిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సోలన్ జిల్లాలో కొండచరియలు విరిగిపడి సిమ్లా-కల్కా మార్గంలో జాతీయ రహదారి 5ను పూర్తిగా మూసివేశారు. మరమ్మతుల అనంతరం ఈ మార్గంలో రాకపోకలను పునరుద్ధరించగా, మరోసారి కొండ చరియలు విరిగిపడటంతో మళ్లీ మూసేయాల్సి వచ్చింది. ఆ రాష్ట్రంలో ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో భారత వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

14 వరకూ వర్షాలు..

హిమాచల్‌ప్రదేశ్‌తో పాటు పంజాబ్, హర్యానా, ఛండీగఢ్, ఉత్తరప్రదేశ్, బీహార్, సబ్-హిమాలయన్ పశ్చిమబెంగాల్, సిక్కింలలో ఈ నెల 14వ తేదీ వరకూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ (ఐఎండి) ఆదివారం తెలిపింది. తూర్పు ఉత్తరప్రదేశ్ మీదుగా వాయువ్య భారతదేశంలో, తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే సూచన ఉందని, 14న హిమాచల్‌ప్రదేశ్‌లో, ఉత్తరాఖండ్‌లో 17 వరకు, పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో వివిధ చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 14న ఉత్తరాఖండ్‌లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే ఉప-హిమాలయ పశ్చిమబెంగాల్, సిక్కింలలో 15 వరకు, గంగా పశ్చిమబెంగాల్ మీదుగా 16, 17 తేదీల్లో, ఒడిశా, ఝార్ఖండ్‌లో 15 నుంచి 17 వరకు, అండమాన్-నికోబార్ దీవుల మీదుగా 14 నుంచి 16 వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది.

అర్జెంటీనాలో ఫొటో జర్నలిస్టు హత్యపై వెల్లువెత్తిన నిరసనలు

బ్యూనస్‌ఎయిర్స్ : అమెరికాలో జార్జి ఫ్లాయిడ్ తరహాలోనే అర్జెంటీనాలో జరిగిన ఘటనపై ప్రజలు పెద్దయెత్తున వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. గత వారాంతంలో రాజధానిలో శాంతియుతంగా జరిగిన చిన్న ప్రదర్శనపై సిటీ పోలీసులు పైశాచికంగా దాడి చేశారు. ఈ ప్రదర్శన వల్ల ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది లేకున్నా ఒబెలిస్క్ స్క్వేర్‌లో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న ఫకుండో మోలారెస్‌ను రాజధాని నగర పోలీసులు పట్టుకుని, అతని తలను నేలపై ఆన్చి ఉంచి, అతని చేతులను వెనుకకు తిప్పి గట్టిగా అదిమి చంపారన్న వార్త తెలియగానే అర్జెంటీనా ప్రజలు ఆగ్రహావేశాలతో రగిలిపోయారు. ఫొటో జర్నలిస్టు మొలారెస్ మృతికి బాధ్యులైన పోలీసులను శిక్షించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.ఈ కేసులో మొలారెస్‌కు న్యాయం చేయాలని వారు ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. ఈ ఉద్రిక్తతల మధ్య ఆదివారం అర్జెంటీనాలో ప్రైమరీస్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల నిర్వహణకు వ్యతిరేకంగా రెబెలియన్ పాపులర్ గ్రూపునకు చెందిన కార్యకర్తలు,ఇతర ప్రజాతంత్రవాదులు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. సిటీ పోలీసుల నేరపూరిత వైఖరి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని రోడ్రిగ్జ్ లారెటా పేర్కొహ్యాగో కాచోరో గోడోయ్.డిప్యూటీ సెక్రటరీ, రికార్డో పెయిడ్రో మాట్లాడుతూ, మొలారెస్‌ది రాజ్యం చేసిన హత్య అని చెప్పారు.."ఫకుండో



మొలారెస్‌ను పోలీసు బలగాలు నేలపై పడవేసి అదిమి చంపడాన్ని పలు సామాజిక సంస్థలు ఖండించాయి వారు అతడ్ని కాళ్లతో తారుపై నొక్కారు, తన్నారు. అని ఈ సంస్థలు పేర్కొన్నాయి. అక్టోబరు 22న జరిగే సాధారణ ఎన్నికలలో పోటీ చేయగలిగే అభ్యర్థులను ఎంపిక చేయడానికి ప్రైమరీస్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు.

రన్నరప్ కిరాక్ హైదరాబాద్

- ఫైనల్లో పోరాడి ఓడిన తెలుగు జట్టు
- ప్రొ పంజా లీగ్ తొలి సీజన్ విజేతగా కొచి కెడిస్



న్యూఢిల్లీ : ప్రొ పంజా లీగ్ (ఆర్మ్ రెజ్లింగ్) మొదటి సీజన్‌లో తెలుగు రాష్ట్రాల జట్టు కిరాక్ హైదరాబాద్ రన్నరప్ గా నిలిచింది. లీగ్ దశతో పాటు సెమీఫైనల్లో అద్భుత ఆటతీరు కనబరిచిన హైదరాబాద్ ఫైనల్లో టై బ్రేకర్‌లో పట్టు విడిచింది. ఆదివారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో అత్యంత హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కిరాక్ హైదరాబాద్ 28-30 తేడాతో కొచి కెడిస్ చేతిలో పోరాడి ఓడిపోయింది. అండర్ కార్డు, మెయిన్ కార్డు మ్యాచ్‌ల తర్వాత ఇరు జట్లూ సమంగా నిలిచాయి. టై బ్రేకర్ లో సత్తా చాటిన కొచ్చి తొలి సీజన్ ట్రోఫీ సొంతం చేసుకుంది. సీజన్ లో అద్భుతంగా పోరాడి రన్నరప్ గా నిలిచిన హైదరాబాద్ ఆర్మ్ రెజ్లర్లను ఫ్రాంచైజీ యజమానికి నెదురుమల్లి గౌతం రెడ్డి, సీఈవో త్రినాథ్ రెడ్డి అభినందించారు.

మహా రుద్రయాగంలో.. రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి

నవతెలంగాణ- ఆలేరు రూరల్

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదివారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాకలో మాత పితృగో ఆశ్రమంలో మహా రుద్రయాగంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దైవచింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. వేద పండితులు సీతారామ శర్మ ఆధ్వర్యంలో 40 మంది వేద పండితులు యాగం ప్రారంభించారు. వేద శాస్త్రి గోపూజ నంది మహానుమాలు రుద్రాభిషేకం నిర్వహించారు. రుద్రహోమం అనంతరం దంపతుల పూజ నిర్వహించారు. అనంతరం చీఫ్ సెక్రెటరీని గ్రామ కమిటీ తరపున సన్మానించారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆరుట్ల లక్ష్మీప్రసాద్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేష్, నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీటీడీ ఆంక్షలు

- 15 ఏళ్ల లోపు వారికి మధ్యాహ్నం రెండు వరకే అనుమతి
- ఘాట్ రోడ్లలో సాయంత్రం ఆరునుంచి ఉదయం ఆరు వరకు రాకపోకలు నిలుపుదల



తిరుమల : శ్రీవారి సందర్శనార్థం కాలిబాట నుంచి వచ్చే యాత్రికుల భద్రతపై టిటిడి చర్యలు చేపట్టింది. నడకదారుల్లో పిల్లల అనుమతిపై పలు ఆంక్షలు విధించింది. 15 ఏళ్లలోపు పిల్లలు గల తల్లిదండ్రులను ఉదయం ఐదు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మాత్రమే అలిపిరి, శ్రీవారిమెట్టు కాలినడక మార్గాల్లో అనుమతించాలని టిటిడి నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా రెండు ఘాట్ రోడ్లలో సాయంత్రం ఆరు గంటల నుండి ఉదయం ఆరు గంటల వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలను నిలుపుదల చేసింది. ఏడవ మైలు వద్ద నుంచి చిన్న పిల్లల చేతికి పోలీసులు ట్యాగ్ వేస్తున్నారు. తల్లిదండ్రుల నుంచి పిల్లలు తప్పిపోతే సులభంగా కనిపెట్టేందుకు ట్యాగులపై పేరు, తల్లిదండ్రుల వివరాలు, ఫోన్ నెంబర్, పోలీసు టోల్ ఫ్రీ నెంబర్‌ను సిబ్బంది జతపరుస్తున్నారు. నడకదారి మార్గంలో అడవి మృగాలు సంచరించే ప్రాంతాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి, అక్కడ వన్య మృగాలు నడకదారి దగ్గరకు రాకుండా ఉండేందుకు అవసరమైన సెంట్రీ పోస్టులు, సీసీ కెమెరాలు, ఫెన్సింగ్ వంటివి అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. జంతువులు వస్తే దూరంగా తరిమేందుకు అవసరమైన లైటింగ్ సిస్టం, సౌండింగ్ సిస్టంలను సిద్ధం చేస్తున్నారు. క్రూరమృగాల సమస్య పరిష్కారమయ్యే వరకు టిటిడి తీసుకున్న నిర్ణయాలకు యాత్రికులు సహకారం అందించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది. కాలినడక మార్గాలు, ఘాట్‌లలో యాత్రికుల భద్రత దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం టిటిడి ఛైర్మన్ శ్రీ భూమనకరుణాకర్ రెడ్డి తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గృహంలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. జూన్ 22న కర్నూలు జిల్లాకు చెందిన నాలుగేళ్ల కౌశిక్‌పై చిరుత దాడి మరవక ముందే నెల్లూరు జిల్లా పోతిరెడ్డి పాలేనికి చెందిన దినేష్‌కుమార్ కుమార్తె లక్షితపై చిరుత దాడి చేసి చంపేయడం కలకలం సృష్టించింది. దాడికి పాల్పడిన చిరుతను బంధించడానికి టిటిడి అటవీ అధికారులు బోన్లను ఏర్పాటు చేశారు. తిరుమల రెండవ ఘాట్‌లో 38వ మలుపు వద్ద చిరుత ఆనవాళ్లు ఉండటంతో ఆదివారం మరో బోనును ఏర్పాటు చేశారు.

నడకమార్గంలో మళ్ళీ కనిపించిన చిరుత

నడకమార్గంలో 2450 మెట్టు వద్ద చిరుతపులి మళ్లీ కనిపించడంతో టిటిడి మరోసారి ఉలిక్కిపడింది. ఘటనా స్థలానికి అటవీ అధికారులు చేరుకున్నారు. ఏడో మైలు వద్ద నుంచి నరసింహస్వామి ఆలయం వరకూ గుంపులు గుంపులుగా యాత్రికులను టిటిడి అనుమతిస్తోంది. అలిపిరి నుంచి గాలిగోపురం, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, 38వ మలుపు ప్రాంతాలు కలిపి మొత్తం ఐదు ప్రాంతాల్లో శనివారం రాత్రి చిరుత పులుల సంచారం కనిపించింది.

నివేదిక కోరిన బాలల హక్కుల కమిషన్

చిరుత దాడిలో నెల్లూరు జిల్లాకు చెందిన ఆరేళ్ల చిన్నారి లక్షిత మృతి చెందిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ కోరింది. ఈ మేరకు ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం, అటవీ, పోలీస్, రెవెన్యూశాఖలకు బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని కోరారు. తిరుమలలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అభివృద్ధికి దూరంగా... ఆదివాసీలు

> అటవీ భూములు కావాలని ఏదైనా సంస్థ కానీ వ్యక్తి కానీ ప్రధానమంత్రి కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్న 48గంటల్లోనే అనుమతులివ్వాలి. ఈ మేరకు గతేడాది జూన్ 22న మోడీ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. వంద ఎకరాలలోపు అటవీ భూములకైతే పిఎంవోకు దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ ఆర్డినెన్సుకు అటవీ పరిరక్షణ చట్టం 2023ను ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎలాంటి చర్చ లేకుండా మూజువాణీ ఓటుతో ఆమోదించుకున్నారు. ఈ చట్టం పర్యావరణం, జీవ సమతుల్యతకు నష్టం చేస్తుంది. గిరిజనుల జీవనానికి ఇది గొడ్డలిపెట్టు. ఆదివాసీలు తమ ఆవాసాల నుంచి బలవంతంగా గెంటివేయబడతారు.

స్వాతంత్ర్యం వచ్చి 75ఏండ్లు గడిచినా.. ఆదివాసీల పట్ల ప్రభుత్వాలు అణచివేతనే ప్రదర్శిస్తున్నాయి. ఆధునిక సమాజంలో వారి అభివృద్ధిని పట్టించుకోవాల్సిన స్థితిలో వారి హక్కుల్ని కాలరాస్తున్నాయి. మణిపూర్ మారణహోమం రగులుతూనే ఉంది. మతతత్వం పెచ్చరిల్లిన తర్వాత ఆదివాసీల మీదే బాణం ఎక్కుపెట్టిన విషయం తేటతెల్లం. ఇక రెండు తెలుగు రాష్ట్రాల్లో అడవిబిడ్డల ఆలనాపాలనా పాలకులకు పట్టడం లేదు. పోలవరం ముంపు ప్రాంతాల బాధితులే అందుకు ప్రత్యక్ష నిదర్శనం. తెలంగాణలో పోడు భూముల్లో హరితహారం మరో దారుణం. ఆదివాసీ బిడ్డలు అందరిలానే అభివృద్ధి కావాలి. వారూ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. కానీ వాస్తవంగా జరుగుతున్నదేంటి? నాటి నుంచి నేటి వరకూ జరుగుతున్న అన్యాయాలేమిటి? గిరిజనులకున్న హక్కులు, చట్టాలేంటి? వాటి అమలు ఎలా ఉంది? వీటన్నింటినీ తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నెల 9న 'ప్రపంచ ఆదివాసీల దినోత్సవం' సందర్భంగా ప్రభుత్వం ఆదివాసీలకు అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్టుగా ప్రచారం చేసుకుంటోంది. కానీ క్షేత్రస్థాయిలో ఆదివాసీల పరిస్థితి అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉంది. స్వాతంత్ర్యానికి ముందే గిరిజనులు బ్రిటిష్ వారితో పోరాడి నివాస ప్రాంతాలపై, అడవిపై ప్రత్యేక హక్కులు సాధించుకున్నారు. స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగం కూడా వారి ఆచార, సాంప్రదాయాలను పాటించే స్వేచ్ఛనిచ్చింది. తమ ప్రాంతాలను తామే పాలించుకునే స్వయం ప్రతిపత్తినీ కల్పించింది. దాని ఫలితమే రాజ్యాంగంలోని 10వ అధ్యాయం 5వ షెడ్యూల్, 6వ షెడ్యూల్. వీటిద్వారా గిరిజనులకు రాజ్యాంగ రక్షణలు కల్పించబడ్డాయి. దేశవ్యాప్తంగా 1200 ఆదివాసీ తెగలుండగా వాటిలో 705 తెగలను మాత్రమే భారత ప్రభుత్వం ఇప్పటివరకూ ఎస్టీలుగా గుర్తించింది.



డాక్టర్ మిడియం బాబూరావు

నెహ్రూ ట్రైబల్ పంచశీల..

ఆదివాసుల అభివృద్ధి, సంక్షేమం కోసం మనదేశ తొలి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ 'ట్రైబల్ పంచశీల' అనే పాలసీని తీసుకొచ్చారు. అందులో ప్రధానంగా ఐదు అంశాలను పొందుపర్చారు. 1. ఆదివాసుల అభివృద్ధి అనేది వారి శక్తి సామర్థ్యాలు, నైపుణ్యంతో జరగాలి. వారిలో చదువుకున్న వారికి తగిన శిక్షణనిచ్చి, వారినే పాలకులుగా నియమించాలి. 2.భూమి, అడవి విషయంలో వారి హక్కులను గౌరవిద్దాం. 3.ఆదివాసుల భాష, సంస్కృతి, ఆచార వ్యవహారాలను పరిరక్షించాలి. అందుకు అవసరమైన ప్రోత్సాహకాలివ్వాలి. 4.కఠినమైన నియంత్రణ వ్యవస్థ లేకుండా మార్కెట్ శక్తుల ప్రవేశాన్ని అనుమతించకూడదు. ఇతరుల పెత్తనాన్ని, ఆధిపత్యవాదాన్ని ఆదివాసులపై రుద్దకూడదు. 5. ఆదివాసుల అభివృద్ధిని వారికి కేటాయించిన నిధులతో కాక, వారి జీవప్రమాణాల్లో వచ్చిన మార్పుల ఆధారంగా లెక్కించాలి.

విధానాల అమలు ముఖ్యం..

ట్రైబల్ పంచశీలతో పాటు రాజ్యాంగం వారికి కల్పించిన రక్షణ చట్టాలు అరకొరగానైనా అమలులో ఉండేవి. మంచి గిరిజన విధానం ప్రకటిస్తేనే సరిపోదు. దాని అమలుకు దృఢమైన రాజకీయ సంకల్పం కావాలి. తగిన అమలు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఈ రెండు విషయాల్లో గత కాలపు కాంగ్రెస్ ప్రభుత్వాలు (పాలక వర్గాలు) అన్యమనస్కంగానే వ్యవహరించాయి. 1952లో గిరిజన విధానం రూపొందితే... కేంద్రంలో మంత్రిత్వశాఖ కమిషనర్ వ్యవస్థ 1999 వరకు ఎందుకు ఏర్పాటు చేయలేదు? స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 1985 సెప్టెంబర్ వరకు హోంమంత్రిత్వ శాఖలో చిన్న "గిరిజన డివిజన్"గా ఎందుకు కొనసాగింది? రాజ్యాంగ ఆదేశం ఉన్నా గిరిజన అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు ఎందుకు లేదు? వలసకాలం నాటి వారసత్వం నేటికీ కొనసాగుతోంది. గిరిజన సమస్యను దేశాభివృద్ధిలో భాగంగా కాక, కేవలం ఒక శాంతిభద్రతల సమస్యగా భావించడమే ఆ వారసత్వం. వామపక్ష తీవ్రవాదాన్ని నియంత్రించడంలో భాగంగా నాటి కాంగ్రెస్ 75జిల్లాల్లో, నేటి బీజేపీ 177 గిరిజన జిల్లాల్లో ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నారు. అదే 'ఎల్‌డబ్ల్యుఇ' పథకం. దీనికి హోం మంత్రిత్వ శాఖలో నిధులు కేటాయిస్తున్నారు.

హక్కుల హననం...

గిరిజనాభివృద్ధి 2014 తర్వాత గతి తప్పిన మతిలేని పాలనగా ఉన్నది. మోడీ అధికారం చేపట్టిన తర్వాత గిరిజన హక్కులను ఒక్కొక్కటిగా ఉపసంహరిస్తున్నారు. అడవుల నుంచి ఆదివాసులను బలవంతంగా బయటికి వెళ్లగొట్టే ప్రణాళికలు రచించి, ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. అమలులో ఉన్న అటవీ చట్టాలను నిర్వీర్యం చేసేలా చట్ట సవరణలు, కొత్త చట్టాలు తీసుకొచ్చారు. 2020 సంవత్సరంలో తీసుకొచ్చిన 'నేషనల్ ట్రైబల్ పాలసీ' ఆ కోవకు చెందినదే. దాన్ని గిరిజన హక్కులను హరించేలా రూపొందించారు. ఆదివాసీల అభివద్ధి ఆదివాసీలతోనే జరగాలని రూపొందించారు. ఆదివాసీల అభివద్ధి ఆదివాసీలతోనే జరగాలన్న విధానానికి భిన్నంగా స్వచ్ఛంద సంస్థలకు ఆ పని అప్పగించారు. ప్రణాళికా సంఘం రద్దుతో ఎస్టీ సబ్ ప్లాన్ పోయింది. గిరిజనుల జనాభా శాతానికి ప్రాతిపదికగా రావాల్సిన నిధులు ఆగిపోయాయి. గిరిజన సంక్షేమ బడ్జెట్‌ను కూడా కుదించుకుంటూ వస్తున్నారు. ఆర్టికల్ 275(1) ప్రకారం గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయించిన వాటికి అదనంగా నిధులు (గ్రాంట్ ఇన్ ఎయిడ్) సమకూర్చాలి. దీన్ని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది.

ఆవాసాలు లేకుండా చేసే సవరణలు...

అటవీ పర్యావరణ, పరిరక్షణ చట్టం 1980 ప్రకారం... అటవీయేతర పనులకు అటవీ భూములు కేటాయించరాదు. గ్రామసభల తీర్మానాల ద్వారా హక్కు పత్రాలివ్వాలని అటవీ హక్కుల చట్టం చెప్పింది. అటవీయేతర పనులకు భూ సేకరణ చేసేటప్పుడు పబ్లిక్ హియరింగ్ విధిగా నిర్వహించాలని పై చట్టాలు ఒక పద్ధతిని సూచించాయి. కానీ, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ఆ నిబంధనలను పూర్తిగా తొలగించారు. అటవీ భూములు కావాలని ఏదైనా సంస్థ కానీ వ్యక్తి కానీ ప్రధానమంత్రి కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్న 48గంటల్లోనే అనుమతులివ్వాలి. ఈ మేరకు గతేడాది జూన్ 22న మోడీ ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. వంద ఎకరాలలోపు అటవీ భూములకైతే పిఎంవోకు దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ ఆర్డినెన్సుకు అటవీ పరిరక్షణ చట్టం 2023ను ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎలాంటి చర్చ లేకుండా మూజువాణీ ఓటుతో ఆమోదించుకున్నారు. ఈ చట్టం పర్యావరణం, జీవ సమతుల్యతకు నష్టం చేస్తుంది. గిరిజనుల జీవనానికి ఇది గొడ్డలిపెట్టు. ఆదివాసీలు తమ ఆవాసాల నుంచి బలవంతంగా గెంటివేయబడతారు.

నిర్వాసితులకు నష్టం...

నిర్వాసితులైన గిరిజనులకు, దళితులకు పునరావాసం కల్పించేందుకు ప్రస్తుతం అమలులో ఉన్న చట్టాలకు సవరణ చేసి, బీజేపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసింది. ఇందుకు అనుగుణంగా భూసేకరణ చట్టం 2013 (ల్యాండ్ అక్విజేషన్, రిహాబిలిటేషన్, రిసెటిల్‌మెంట్) ప్రకారం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం, పునఃస్థాపితం... ప్రభుత్వాలు ఏవిధంగా ఇవ్వాలి అనేది స్పష్టంగా ఉంది. కానీ బీజేపీ ప్రభుత్వం ఆ చట్టాన్ని సవరించింది. దీనివల్ల భూములు కోల్పోయిన నిర్వాసితులకు అన్యాయం జరుగుతోంది. ప్రభుత్వం లేదా ఆయా సంస్థల నిర్ణయం ప్రకారమే పునరావాసం, ప్యాకేజీ ఉంటుంది. అంతేకానీ నిర్దిష్టమైన చట్టబద్ధత ఉండదు. ఇది ఆదివాసీలకు తీరని నష్టం కలిగిస్తుంది.

యుసీసీతో ఆధిపత్యం...

రాజ్యాంగంలోని 44వ ఆర్టికల్ ప్రకారం.. యూనిఫాం సివిల్ కోడ్ (యుసిసి) కోసం ప్రయత్నించాలని ఉంది. సమాజంలో హెచ్చుతగ్గులను నివారించేందుకు యూనిఫాం సివిల్ కోడ్ పనిచేయాలని ఆర్టికల్ 38 చెబుతోంది. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా యూనిఫాం సివిల్ కోడ్‌తో మెజార్టీ ప్రజల విధానాలను కేంద్రం అందరిపై రుద్దే ప్రయత్నం చేస్తుంది. అసోంలో సీఏఏ అమలు చేసి, 19 లక్షల మందిని అనుమానితులుగా తేల్చారు. అందులో 2.5లక్షల మంది గిరిజనులున్నారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచే జీవనం సాగిస్తున్న ఆదివాసీలు ఇప్పుడు స్థానికులమేనని రుజువు చేసుకోవాల్సి వచ్చింది. వారిని ఇప్పటివరకు పట్టించుకోని ప్రభుత్వాలు ఇప్పుడు ధృవీకరణ అంటే ఎలా సాధ్యమవుతుంది? వారు ఎక్కడ నుంచి సర్టిఫికెట్లు తెచ్చుకోవాలి? వారికి ఎవరిస్తారు? ఇప్పటివరకు వారిని మనుషులుగా చూడని ప్రభుత్వాలు... ఇప్పుడు వారిని అవమానకరంగా ఇబ్బందులు పెట్టడం వెనక అసలు ఉద్దేశ్యం ఏమిటి ?



తెలుగు రాష్ట్రాల్లో...

తెలుగు రాష్ట్రాల్లో అమలులో ఉన్న జీఓ నెంబర్ 3ని 2020 ఫిబ్రవరిలో సుప్రీం కోర్టు కొట్టి వేసింది. ఏజెన్సీల్లో ఉద్యోగాలను అక్కడ పుట్టి పెరిగిన స్థానిక గిరిజనులతోనే భర్తీ చేయాలనేది ఆ జీఓ సారాంశం. దీనివల్ల గిరిజనులకు ఎంతో కొంత మేలు జరిగింది. కానీ సుప్రీంకోర్టు దీన్ని రద్దు చేసింది. ఇది గిరిజనుల ఉపాధి అవకాశాలకు పెద్ద దెబ్బ. ఇప్పుడు కేవలం 50శాతం ఉద్యోగాలే గిరిజనులకు దక్కుతున్నాయి. ఆ తీర్పు సమయంలో కేంద్ర ప్రభుత్వం తరుపున సొలిసిటర్ జనరల్ కోర్టుకు హాజరు కాలేదు. తర్వాత కూడా కేంద్రం స్పందించలేదు. గతంలో పలు కేసుల్లో గిరిజన హక్కులను, చట్టాలను సమర్థించిన న్యాయస్థానాలే, ఇప్పుడు ఇటువంటి తీర్పులు ఇవ్వడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ న్యాయవాదులు హాజరు కాకపోవడమో, హాజరైనా అరకొర వాదనలు చేయడం కూడా ముఖ్యకారణం. 'తెలుగు రాష్ట్రాల్లో గిరిజన హక్కులు హరించబడుతున్నాయి. పోలవరం నిర్మాణంతో ఏజెన్సీ ప్రజలకు నష్టం జరుగుతుందని సుప్రీం కోర్టును కూడా ఆశ్రయించాం'. 'గిరిజనుల హక్కులకు నష్టం జరగదని, ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకుంటే అప్పుడు మీ అప్పీల్ పరిశీలిస్తామ'ని కోర్టు చెప్పింది. కానీ, ఇప్పుడు ప్రభుత్వం కోర్టు ముందు ఇచ్చిన హామీని పూర్తిగా పక్కనబెట్టింది. పోలవరం కోర్టు ముందు ఇచ్చిన హామీని పూర్తిగా పక్కనబెట్టింది. పోలవరం నిర్మాణంలో ప్రస్తుతం అమలులో ఉన్న ఏ ఒక్క అటవీ, పర్యావరణ చట్టాన్ని కూడా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. గిరిజన ఆవాసాలన్నీ ఉనికి కోల్పోయాయి. పునరావాసం లేక ఆదివాసీలు రోడ్డున పడ్డారు. అటవీ సంపదకు, జంతుజాలానికి తీరని నష్టం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం అమలుచేసిన హరితహారం కార్యక్రమం కూడా ఆదివాసీలకు నష్టం కలిగించింది. అడవి లేనిచోట మొక్కలు పెంచాల్సిందిపోయి, గిరిజనులు పోడు సాగు చేస్తున్న భూముల్లో హరితహారం ప్రారంభించారు. ఇది చట్టాలకు వ్యతిరేకం. అంతేకాకుండా అటవీ అధికారులకు స్థానికంగా ఉండే గిరిజనుల మధ్య ఘర్షణ వాతావరణానికి దారితీసింది.

చట్టసభల్లో అన్యాయం...

దేశంలోని మొత్తం పార్లమెంట్ స్థానాల్లో 47ఎస్టీ స్థానాలుండగా... అందులో 37 స్థానాల్లో బీజేపీ గెలిచింది. మిగిలిన వాటిలో కూడా ఆ పార్టీకి అనుకూలంగా ఉన్నవారే ఉన్నారు. అయినా గిరిజనులపై బీజేపీ దాడులు ఆపలేదు. అడవుల నుంచి ఆదివాసీలను బలవంతంగా బయటకు వెళ్లగొట్టి, వాటిని పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయడమే బీజేపీ పన్నాగం. అందుకు నిస్సిగ్గుగా రాజ్యాంగం, చట్టాలను కూడా మారుస్తున్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా హడావిడిగా తెచ్చిన అటవీ పరిరక్షణ చట్టం 2023ను రాష్ట్రపతి తిరస్కరించాలి. ఏకరూప పౌరస్మృతి గిరిజన తెగల సాంప్రదాయపు సామాజిక అలవాట్లకు వ్యతిరేకంగా రూపొందించబడుతోంది. పీసా చట్టంలో గిరిజన తెగల సాంప్రదాయపు చట్టాలను పాటించేందుకు అనుమతించింది. అందువలన యూసీసీ పేరుతో ఆధిపత్యవాద హిందూ సంస్కృతిని గిరిజన తెగలపై రుద్దరాదంటూ అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా దేశమంతటా నినదించాలి.

భూముల నుంచి తొలగింపు...

అటవీ హక్కుల చట్టం (2006) ప్రకారం... అటవీ ప్రాంతంలో నివసించే గిరిజనులు, ఇతర సాంప్రదాయపు అటవీ నివాసులు గరిష్టంగా 10ఎకరాల వరకూ పోడు భూమిపై హక్కు పత్రాలు పొందవచ్చు. గిరిజన తెగలకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిచేస్తానంటూ వచ్చిన ఈ చట్టం అమలు అధ్వాన్నంగా ఉంది. ఐదు ఎకరాలు పోడు చేసే రైతులకు ఒకటి, రెండు ఎకరాలకే హక్కు పత్రాలిచ్చారు. దేశవ్యాప్తంగా 21రాష్ట్రాల్లో 42లక్షల సాగుదార్ల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. కనుక వారిని భూమి నుంచి తొలగించాలని స్వయంగా సుప్రీం కోర్టు 2019 ఫిబ్రవరిలో ఆదేశించింది. పిటిషన్ ఇప్పటికీ పెండింగ్‌లో ఉంది. అయినా, చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ రైతులను భూముల నుంచి తొలగించాయి.

మణిపూర్‌లో ఆరని మారణహోమం

మణిపూర్ గిరిజనులు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో మైనింగ్ జరిపేందుకు ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని ఆదివాసీలకు అక్కడ ప్రభుత్వం ఆరు నెలల కిందటే నోటీసులిచ్చింది. అక్కడ నుంచి ప్రారంభమైన అసంతృప్తి ఇప్పుడు ఆ రాష్ట్రమంతటా పాకింది. ఇప్పుడది మతాల మధ్య, జాతుల మధ్య చిచ్చుగా మారింది. దీనికి కారణం బీజేపీ ప్రభుత్వ అవకాశ వాద విధానమే. గిరిజనుల తెగ జీవనాన్ని సంఘపరివార్ ధ్వంసం చేస్తోంది. వారి సాంప్రదాయాల్లోకి చొరబడింది. ఆదిమ తెగలు ఆవు మాంసం తినరాదనీ, చర్చి, మసీదులకు వెళ్లరాదనీ, సాంప్రదాయపు వస్త్రధారణ మానుకోవాలనీ, వారి సంస్థల ద్వారా ప్రభోదిస్తోంది. ఆదిమ తెగ సంస్కృతిని హిందూ సంస్కృతిగా మార్చాలని పన్నాగం పన్నింది. ప్రకృతి ఆరాధికులను హిందువులుగా మార్చాలని కుట్ర పూరితంగా వ్యవహరిస్తోంది. హైందవీకరణ, కార్పొరేటీకరణ, సరళీకరణ, డబ్బు ఆశ చూపి అడవిబిడ్డల మధ్య ఘర్షణలు సృష్టిస్తోంది. పాస్టర్లుగా ఉన్న గిరిజనులపై దాడులు చేయిస్తున్నారు. గిరిజన పాస్టర్‌ను కాల్చేస్తానని ఆదిలాబాద్ జిల్లాకు చెందిన బీజేపీ ఎంపి అనడం ఎంతవరకు సమంజసం? ఆయన మాటల వెనక ఉద్దేశ్యం ఏమిటో ప్రజలు అర్థం చేసుకోవాలి.

ఆదివాసీల అభివృద్ధి వారితోనే..

స్వయం నిర్ణయాధికారం కోసం దేశీయ యువతే మార్పు చేసేవారిగా ఉండాలి. ప్రపంచంలోని మూలవాసుల హక్కుల ఉల్లంఘనలు నిరంతర సమస్యగా మారాయి. ఈ సమస్యలకు ప్రతిస్పందనగా, ఆదివాసీలు తమ సొంత నిర్ణయాలు తీసుకునే హక్కును కలిగి ఉండాలి. వాటిని అర్థవంతంగా, సాంస్కృతికంగా వారికి తగినట్టుగా నిర్వహించే హక్కును ప్రతి ఆగస్టు 9న మననం చేసుకోవాలి. స్వయం నిర్ణయాధికారం కోసం డిమాండ్ ఉన్న ఈ సందర్భంలో, స్వదేశీ యువత నేడు మానవాళి ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సంక్షోభాలలో ముందు భాగంలో ఉండి మార్పుకు కృషి చేయాలి. ఉదా: దేశీయ యువత అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నది. పరిష్కారాలను అందించడానికి, మన ప్రజలకు మరింత స్థిరమైన, శాంతియుత భవిష్యత్తుకు దోహదం చేయడానికి కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేస్తోంది. అయితే ఈ రోజు తీసుకునే నిర్ణయాలపై వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. వారి ప్రాతినిధ్యం ప్రధానం. వాతావరణ మార్పులను తగ్గించడం, శాంతి నిర్మాణం, డిజిటల్ సహకారం కోసం మార్పులను తగ్గించడం, శాంతి నిర్మాణం, డిజిటల్ సహకారం కోసం ప్రపంచ ప్రయత్నాలలో పాల్గొనడం, స్థానికంగా వారి హక్కులను సమర్థవంతంగా అమలు చేయడం కీలకం. ఈ అంతర్జాతీయ ఆదివాసీ ప్రజల దినోత్సవం 2023 "స్వయం నిర్ణయాధికారం కోసం దేశీయ యువతతోనే మార్పు" అనే శీర్షికతో, పర్యావరణం, న్యాయం కోసం అన్వేషణలో వారి అంకితభావ ప్రయత్నాలను గుర్తిస్తూ నిర్ణయం తీసుకోవడంలో స్థానిక యువత తప్పనిసరి అనేది పునరుద్ఘాటించాలి. వారు ప్రజలు, సంస్కృతి, సంప్రదాయాలు, రచనలను సజీవంగా ఉంచేలా ఇంటర్జెనరేషన్ కనెక్షన్‌ని సృష్టించాలి.

- వ్యాసకర్త: మాజీ ఎంపీ, చైర్మన్,
ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్.

రాజ్యాంగ పరిషత్‌కు అత్యధిక సభ్యులను పంపిన సంస్థానం?



డాక్టర్ అలీ సార్
భారత రాజ్యాంగ నిపుణులు
9494228002

దీపిక

1. 1928లో మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన ఏర్పాటు చేసిన రాజ్యాంగ రూపకల్పన ఉపసంఘంలోని కేవలం సభ్యుల సంఖ్య?
1.11 2. 12 3.9 4. 10

2. రాజ్యాంగ పరిషత్‌ను డిమాండ్ చేసిన తొలి రాజకీయ పార్టీ?
1.ఐ.ఎన్.సి 2. స్వరాజ్ పార్టీ
3. ముస్లిం లీగ్ పార్టీ 4. ఇండిపెండెంట్ లేబర్ పార్టీ

3. రాజ్యాంగ పరిషత్‌లోని ప్రారంభ సభ్యుల సంఖ్య?
1. 389 2. 292 3. 365 4. 392

4. స్వదేశీ సంస్థానాల నుండి తన ప్రతినిధిని పంపని అతి పెద్ద సంస్థానం?
1. జమ్మూ & కాశ్మీర్ 2. హైదరాబాదు 3. జూనాఘడ్ 4. మైసూర్

5. ఈ కింది వాటిని జతపరచండి.
1. రాజ్యాంగ పరిషత్‌లోని మొత్తం మహిళలు ( ) ఎ.7
2.రాజ్యాంగ రూపకల్పన ఉపసంఘ సభ్యులు ( ) బి.9
3. రాజ్యాంగ ముసాయిదా కమిటీ సభ్యులు ( ) సి. 15
4. రాజ్యాంగ పరిషత్‌లోని విషయ నిర్ణయక కమిటీలు ( ) డి. 12
1. 1ఎ,2బి,3సి,4డి 2. 1సి,2బి,3ఎ,4డి
3. 1బి,2డి,3ఎ,4సి 4. 1డి,2సి,3బి,4ఎ



6. రాజ్యాంగ పరిషత్‌కు అత్యధిక సభ్యులను పంపిన రాష్ట్రం?
1. మద్రాసు 2. యునైటెడ్ ప్రావిన్స్ 3. మహారాష్ట్ర 4. కలకత్తా

7. రాజ్యాంగ ముసాయిదా కమిటీలో సభ్యులు కాని వ్యక్తి.
1. కె.యం.మున్షి 2. బి.ఎల్.మిట్టల్
3. టి.టి.కృష్ణమాచారి 4. బి.ఎన్.రావు

8. ఈ క్రింది వానిలో సరైన దానిని గుర్తించండి.
1. మొదటి భారతీయ మహిళా ఐఎన్‌సి అధ్యక్షురాలు సరోజినినాయుడు.
2. ముసాయిదా రాజ్యాంగం నందు 315 ఆర్టికల్స్, 8 షెడ్యూళ్ళు ఉన్నాయి.
3. రాజ్యాంగ పరిషత్ కమిటీలలో అతి ప్రధానమైన కమిటీ రాజ్యాంగ ముసాయిదా కమిటీ.
4. చిత్ర రాజ్యాంగ నిర్మాత అని బెనగల నరసింహారావును అంటారు.
1. 4 మాత్రమే 2. 3,4 3. 2,3,4 4. పైవన్నీ సరైనవే.

9. ఏ సం.లో చేయబడిన 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయోపరిమితిని 18సం.లకు తగ్గించిరి.
1. 1989 2. 1974 3. 1988 4. 1986

10. క్రింది వాటిలో సరికాని వాక్యంను గుర్తించండి.
1. అంబేద్కర్‌ను నైపుణ్యం ఉన్న పైలెట్‌గా బాబు రాజేంద్రప్రసాద్ అభివర్ణించారు.
2. బి.ఎన్.రావును ఆర్కిటెక్ట్ అని అనంతశయనం అయ్యంగార్ పేర్కొన్నారు.
3. భారత రాజ్యాంగం న్యాయవాదుల స్వర్గం అని ఐవర్ జెన్నింగ్ పేర్కొన్నారు.
4. ఎర్నెస్ట్ బార్కర్ అనే రాజనీతి శాస్త్రవేత్త రాజ్యాంగ ప్రవేశిక భారత రాజ్యాంగంనకు కీ నోట్ లాంటిది అని పేర్కొన్నారు.
1. 2 మాత్రమే 2. అన్నీ 3. 2,4 4. 2,3

11. ఈకింది వాటిని జతపరచండి.
1. రాష్ట్రాల కమిటీ అధ్యక్షుడు ఎ.జె.బి.కృపలాని
2. ప్రాథమిక హక్కుల ఉపసంఘం అధ్యక్షుడు బి.జి.వి.మౌలాంకర్
3. రాజ్యాంగ సారధ్య సంఘం అధ్యక్షులు సి. జె.నెహ్రూ
4. రాజ్యాంగ పరిషత్ విధుల కమిటీ డి. డా.బాబు రాజేంద్ర ప్రసాద్
1. 1సి,2ఎ,3డి,4బి 2. 1సి,2ఎ,3బి,4డి
3. 1ఎ,2బి,3సి,4డి 4. 1సి,2బి,3ఎ,4బి

12. రాజ్యాంగ రచనకు అత్యధిక కాలం తీసుకున్న దేశం?
1. ఫ్రెంచ్ 2. ఆస్ట్రేలియా 3. ఇండియా 4. డెన్మార్క్

13. భారత రాజ్యాంగ రచనకు పట్టిన కాలం.
1.2 సం.11 నెలల 18 రోజులు 2. 2 సం.12 నెలల 18 రోజులు
3. 3 సం.10 నెలల 10 రోజులు 4. 3 సం.11 నెలల 18 రోజులు

14. రాజ్యాంగ పరిషత్ ఆవశ్యకతను తెలియ చేసిన మొదటి వ్యక్తి.
1. యం.కె. గాంధీ 2. సుభాష్‌చంద్రబోస్ 3. యం.ఎన్.రాయ్ 4. అనిబిసెంట్

15. ఈ కింది వాటిని జతపరచండి.
1. క్యాబినేట్ మిషన్ సిఫారసు ( ) ఎ.1946
2. వేవెల్ ప్రణాళిక ( ) బి.1945
3. క్రిప్స్ మిషన్ ( ) సి.1942
4. ఆగస్ట్ ప్రతిపాదన ( ) డి.1940
1. 1ఎ,2బి,3సి,4డి 2. 1బి,2సి,3డి,4ఎ 3. 1సి,2డి,3ఎ,4బి 4. 1డి,2ఎ,3బి,4సి

16. ఈ క్రింది వాటిలో సరైన వాక్యాన్ని గుర్తించండి.
1. రాజ్యాంగ పరిషత్‌లోని చీఫ్ కమీషనరేట్ ప్రాంతాలు ఢిల్లీ, అజ్మీర్, మేవార్, కూర్గ్.
2.అత్యధిక సభ్యులను రాజ్యాంగ పరిషత్‌కు పంపిన సంస్థానం మైసూర్.
3. చీఫ్ కమీషనరేట్ ప్రాంతాల సభ్యులు నామినేట్ చేయబడ్డారు.
4. రాజ్యాంగ పరిషత్‌కు తక్కువ సభ్యులను పంపిన రాష్ట్రం - అస్సాం.
1. 1,3 2. 1,2,3 3. 1,3,4 4. అన్ని సరైనవే.

17. రాజ్యాంగ పరిషత్‌లో అతి పెద్ద కమిటీ.
1.రాజ్యాంగ సలహా సంఘం 2. కేంద్ర అధికారాల కమిటీ
3. రాష్ట్రాల కమిటీ 4. రాజ్యాంగ ముసాయిదా కమిటీ

18. రాజ్యాంగ పరిషత్‌లో వివిధ వర్గాలు, వారి ప్రతినిధులు జతపరచండి.
1. క్రైస్తవులు ( ) ఎ.శ్యాంప్రసాద్ ముఖర్జీ
2. ఆంగ్లో ఇండియన్స్ ( ) బి.డా.బి.ఆర్.అంబేద్కర్
3. హిందువులు ( ) సి.హెచ్.సి.ముఖర్జీ
4. షెడ్యూల్డ్ కులాలు ( ) డి. ఫ్రాంక్ ఆంటోని
5. మహిళలు ( ) ఇ. హన్సా మెహతా
1. 1సి,2డి,3ఎ,4బి,5ఇ 2. 1సి,2బి,3డి,4ఎ,5ఇ
3. 1సి,2బి,3ఎ,4ఇ,5ఇ 4. 1సి,2బి,3ఇ,4ఎ,5డి

19. ఎన్నికలలో పోటీ చేయకుండా రాజ్యాంగ పరిషత్‌కు నామినేట్ అయిన వ్యక్తులు.
1. సర్వేపల్లి రాధాకృష్ణన్ 2. హెచ్.వి. కామత్
3. డా. బి.ఆర్.అంబేద్కర్ 4. గోపాలస్వామి అయ్యంగార్
1. 1,2,3 2. 2,3 3. 4 మాత్రమే 4. 1,2,4

20. సరైన వాక్యాన్ని గుర్తించండి.
ఎ. రాజ్యాంగ పరిషత్‌కు నామినేట్ చేయబడిన వారు 15.
బి. రాజ్యాంగ పరిషత్‌కు సభ్యురాలిగా పని చేసిన ఏకైక ముస్లిం మహిళ - ఎయిజాజ్ రసూల్ బేగం.
సి.రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికయిన తెలుగు ప్రముఖులు -9.
డి. దేశ విభజన కారణంగా రాజ్యాంగ పరిషత్ సభ్యత్వం కోల్పోయిన ఏకైక కమ్యూనిస్ట్ వ్యక్తి - సోమనాథ్ లహరి.
1.ఎ,బి 2. బి మాత్రమే 3. బి,డి 4. పై అన్నీ సరైనవే.

21. ఎ.రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశం 9-12-1946.
బి. రాజ్యాంగ పరిషత్ శాశ్వత అధ్యక్షుడిగా డా.బాబు రాజేంద్రప్రసాద్ ఎన్నికను జె.బి.కృపలాని ప్రతిపాదించారు.
1.ఎ సరైనది బి తప్పు. 2. ఎ తప్పు, బి సరైనది 3.రెండు సరైనవే. 4. రెండు తప్పు.

22. చారిత్రక లక్ష్యాలు ఆశయాలు తీర్మానం జవహర్‌లాల్‌నెహ్రూ ఎప్పుడు రాజ్యాంగ పరిషత్‌లో ప్రవేశపెట్టిరి.
1. 11.12.1946 2. 13.12.1946 3. 15.12.1946 4. 12.12.1946

23. రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికయిన కాంగ్రెస్ సభ్యుల సంఖ్య.
1. 202 (తర్వాత 208) 2. 229 3. 211 4. 389

24. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన జనగణమన అను జాతీయ గీతమును ఏ ఐఎన్‌సి సమావేశం ఆమోదించింది?
1. 1896 - కలకత్తా 2. 1907 - సూరత్
3. 1911 - కలకత్తా 4. 1909 - లాహోర్

సమాధానాలు

1.3	2.2	3.1	4.2	5.2	6.2	7.4	8.4
9.3	10.1	11.1	12.2	13.1	14.3	15.1	16.4
17.1	18.1	19.4	20.4	21.3	22.2	23.1	24.3


కరెంట్ అఫైర్స్




- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545

సూర్యుడిపై అధ్యయనం కోసం 'ఆదిత్య ఎల్ 1' : సౌరగోళం పై అధ్యయనం కోసం పి.ఎస్.ఎల్.వి. సి57 రాకెట్ 1475 కిలోల బరువు కల్గి ఆదిత్య ఎల్ 1 ఉపగ్రహాన్ని సెప్టెంబర్ మొదటి వారంలో ప్రయోగించేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తుంది. సౌర తుపాన్ సమయంలో వెలువడే రేణువుల వలన భూమిపై సమాచార వ్యవస్థకు అవరోధాలు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. దీంతోపాటు ఫోటోస్పియర్, క్రోమోస్పియర్ లపై అధ్యయనం చేసి సమాచారాన్ని సేకరించేందుకు ఈ ప్రయోగాన్ని నిర్వహించబోతున్నారు. బెంగళూరులోని ప్రొఫెసర్ యు.ఆర్. రావు స్పేస్ సెంటర్‌లో ఈ ఉపగ్రహాన్ని రూపొందించారు.


బాలికలు, మహిళల మిస్సింగ్‌లో మధ్యప్రదేశ్ టాప్ : దేశంలో 2019 - 2021 సంవత్సరాల మధ్య 13.13 లక్షల మంది బాలికలు, మహిళలు కనిపించకుండా పోయారని కేంద్రం తెలియజేసింది. ఇందులో మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా సుమారు 2 లక్షల మంది వున్నారని ఆ తర్వాత స్థానంలో పశ్చిమబెంగాల్ వుందని కేంద్రం పేర్కొంది. గతవారం పార్లమెంట్‌లో కేంద్రం హోంశాఖ నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్.సి.ఆర్.బి) నమోదు చేసిన గణాంకాలను వెల్లడించింది. మూడేళ్ల కాలంలో మిస్సయిన మొత్తం 13.13 లక్షల మందిలో బాలికలు 2,51,430 మందికాగా, 18 ఏళ్ల పైబడిన వారి సంఖ్య 10,61, 648 అని వివరించింది. 2019 - 21 మధ్య కాలంలో మధ్యప్రదేశ్ లో అత్యధికంగా 1,60,180 మంది మహిళలు, 38,234 మంది బాలికలు అదృశ్యమైనట్లు ఆ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్ 2వ స్థానంలోనూ, కర్నాటక 3వ స్థానంలోనూ వుంది.



సాహిత్య అకాడమి అవార్డు - 2023 : వివిధ భాషల్లో చిరుకథలు, కవిత్వం, నాటకాలు, నవలలు, విమర్శ గ్రంథాలకు కేంద్ర సాహిత్య అకాడమి యువ, బాల పురస్కారాలు 2023 ను ప్రకటించింది. ప్రముఖ విమర్శకుడు తక్కెడశిల జాని, ప్రముఖ రచయిత డి.కె. చదువుల బాబులను కేంద్ర సాహిత్య అకాడమీ యువ, బాల సాహిత్య పురస్కారాలు 2023 దక్కాయి. దేశ వ్యాప్తంగా వివిధ భాషలకు చెందిన బాల సాహిత్యానికి సంబంధించిన 22 మందికి యువపురస్కారాలకు 20 మందిని ఎంపిక చేసింది. తెలుగు భాషలో యువ పురస్కారాన్ని వై.ఎస్.ఆర్ జిల్లాకు చెందిన తక్కెడ శిల జాని రచించిన విమర్శన గ్రంథం 'వివేచన', బాల పురస్కారానికి వై.ఎస్.ఆర్. జిల్లాకు చెందిన డి.కె. చదువుల బాబు చిరు కథల పుస్తకం 'వజ్రాల వాన' దక్కించుకున్నాయి.



(X) ఎక్స్ యాప్‌గా ట్విట్టర్ : ట్విట్టర్ యాప్ లోగోను మార్చనున్నట్లు ట్విట్టర్ యజమాని ఎలాన్ మస్క్ ప్రకటించారు. ట్విట్టర్ ను రీ బ్రాండ్ చేయనున్నట్లు చైనాకు చెందిన వియ్ చాట్ తరహాలో అన్నింటికి పనికొచ్చే ఎక్స్ యాప్‌ను రూపొందించాలని కొంతకాలంగా అనుకుంటున్నట్లు ఎలాన్‌మస్క్ వెల్లండించారు. ఇది కేవలం సోషల్ మీడియా వేదికగా కాకుండా ఆన్‌లైన్ చెల్లింపులకు, ఆహారాన్ని ఆర్డర్ చేయడానికి కూడా పనికొస్తుంది. ఇక నుండి మన మొబైల్ లో ట్విట్టర్ నోటిఫికేషన్స్ ఎక్స్ సింబల్‌గా చూపిస్తాయి.



కోల్డ్ ఔట్ కాఫ్ సిరప్ సురక్షితం కాదన్న డబ్ల్యు.హెచ్.ఒ : ఇరాక్‌లో విక్రయిస్తున్న భారత్ తయారీ దగ్గుమందు సురక్షితం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. జలుబు, దగ్గు నివారణ కోసం 'కోల్డ్ ఔట్' పేరుతో రూపొందించిన సిరప్ తయారీలో వాడే పదార్థాలు పరిమితికి మించి వున్నాయని డబ్ల్యు.హెచ్.ఒ హెచ్చరించింది. చెన్నైకు చెందిన ఫోర్ట్స్ ల్యాబొరేటిస్ కంపెనీ తయారు చేసిన 'కోల్డ్ ఔట్' అనే దగ్గు మందును ఇరాక్‌కు చెందిన దాబిలైఫ్ ఫార్మాకు విక్రయించింది.

సి.బి.ఐ.సి చైర్మన్‌గా సంజయ్ కుమార్ అగర్వాల్ : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఎక్సైజ్ అండ్ కస్టమ్స్ (సి.బి.ఐ.సి) కి చైర్మన్‌గా ఐ.ఆర్.ఎస్ అధికారి సంజయ్ కుమార్ అగర్వాల్ బాధ్యతలు స్వీకరించారు. మే 31న సి.బి.ఐ.సి చీఫ్‌గా వివేక్ జోహ్రి పదవీ విరమణ చేశారు. ఆగస్టు 5న జారీ చేసిన ఉత్తర్వుల్లో సి.బి.ఐ.సి మెంబర్ కంప్లయిన్స్ మేనేజ్‌మెంట్ బాధ్యతలు నిర్వహిస్తున్న సంజయ్ కుమార్ అగర్వాల్‌ను ఆ స్థానంలో నియమిస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం : ప్రపంచంలోని ఆదివాసులు తమ హక్కులను పరిరక్షించుకోడానికి ఐక్యరాజ్య సమితి ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా 90 దేశాల్లో 476 మిలియన్ లకు పైగా ఆదివాసీ ప్రజలు నివశిస్తున్నారు. వారు ప్రపంచ జనాభాలో 5 శాతం వున్నారు. అయితే ప్రపంచ అత్యంత పేదల జాబితాలో 15 శాతం కంటే ఎక్కువ మందిగా ఈ ఆదివాసీలు వున్నారు. పేదరికం, విద్య, ఆరోగ్య సంరక్షణ అందుబాటులో లేకపోవడం, పర్యావరణ క్షీణత మొదలైన సవాళ్లను వీరు ఎదుర్కొంటున్నారు. 1994 డిసెంబర్ లో ఐక్యరాజ్య సమితి తొలిసారిగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రకటించింది. 2023 సంవత్సర ప్రపంచ ఆదివాసి దినోత్సవ థీమ్ 'స్వయం నిర్ణయాధికారం కోసం మార్పు. ఏజెంట్లుగా స్థానిక యువత'.